
www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



గురువారం | 23-1-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 278 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: నవమి సా. 5.38 తదుపరి దశమి; నక్షత్రం: విశాఖ తె. 5.08 తదుపరి అనూరాధ; వర్జ్యం: ఉ.8.45-10.32; దుర్ముహూర్తం: ఉ.10.35-11.20, మ.3.03-3.47; అమృతఘడియలు: రా.7.23-9.09; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.01 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అర్జున్, హరికృష్ణకు డ్రా

విక్‌ాన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ మాస్టర్స్ విభాగం ఐదో రౌండ్‌ను తెలుగు గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఇరిగేసి, పెంటేల హరికృష్ణ డ్రాగా ముగించారు. సహచర గ్రాండ్‌మాస్టర్ మెన్డోన్కాతో బుధవారం జరిగిన ఐదో రౌండ్‌లో అర్జున్ 30 ఎత్తుల తర్వాత పాయింట్‌ను పంచుకున్నాడు. వీ ఈ (చైనా)తో జరిగిన గేమ్‌ను హరికృష్ణ 22 ఎత్తుల్లో డ్రా చేసుకున్నాడు. చాలెంజర్స్ విభాగంలో ఫ్రెడ్రిక్ (జర్మనీ)తో ఐదో రౌండ్‌ను వైశాలీ డ్రా చేసుకుంది.

కళ్లన్నీ రోహిత్‌పైనే

● బరిలో పంత్, జడేజా, గిల్, జైస్వాల్

● నేటి నుంచి రెండో విడత రంజీ



న్యూఢిల్లీ: రంజీ ట్రోఫీ రెండో విడత మ్యాచ్‌లు స్టార్ ప్లేయర్లతో కళకళలాడనున్నాయి. దాదాపు దశాబ్దం తర్వాత రోహిత్ శర్మ ముంబై తరపున బరిలోకి దిగుతుండగా.. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ కూడా ఆడుతున్నాడు. గురువారం నుంచి జరిగే మ్యాచ్‌లో జమ్మూ కశ్మీర్‌తో ముంబై తలపడనుంది. ఢిల్లీ జట్టులో రిషభ్ పంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుండగా.. సౌరాష్ట్ర తరపున జడేజా, పంజాబ్ తరపున శుభ్‌మన్ గిల్ ఆడనున్నారు. అయితే, మెడ నొప్పితో బాధపడుతున్న కోహ్లీ.. ఈ నెల 30 నుంచి జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌కు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. హిమాచల్‌ప్రదేశ్‌తో తలపడే హైదరాబాద్ జట్టులో సిరాజ్ కూడా ఆడనున్నాడు. మరో మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు పుదుచ్చేరితో తలపడనుంది.

అభిషేక్ తుఫాన్

● వరుణ్ మాయాజాలం
● భారత్ అదిరే బోణీ
● తొలి టీ20లో ఇంగ్లండ్ చిత్తు
● బట్లర్ అర్ధ శతకం వృథా

కోల్‌కతా: అభిషేక్ శర్మ (34 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్స్‌లతో 79) దుమ్మురేపే అర్ధ శతకంతోపాటు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వరుణ్ చక్రవర్తి (3/23) తిప్పేయడంతో.. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌ను టీమిండియా ఘనంగా ఆరంభించింది. బుధవారం జరిగిన తొలి టీ20లో భారత్ 7 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. తొలుత ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 132 పరుగులకు కుప్పకూలింది. జోస్ బట్లర్ (44 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 68) ఒంటరి పోరాటం చేశాడు. అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా తలో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఛేదనలో భారత్ 12.5 ఓవర్లలో 133/3 స్కోరు చేసి గెలిచింది. సంజూ శాంసన్ (26), తిలక్ వర్మ (19 నాటౌట్) సత్తాచాటారు. రెండో టీ20 శనివారం చెన్నైలో జరగనుంది.

బాదుడే.. బాదుడు..

ఛేదనలో ఓపెనర్ అభిషేక్ వీరవిహారంతో.. భారత్ సులువుగా నెగ్గింది. ఎడాపెడా షాట్లతో శర్మ విరుచుకుపడడంతో ఇంగ్లండ్ బౌలర్లకు దిక్కుతోచలేదు. శాంసన్‌తో కలసి తొలి వికెట్‌కు 41 పరుగులు జోడించిన అభిషేక్.. తిలక్ వర్మతో మూడో వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. దీంతో టీమిండియా మరో 43 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకొంది. ఛేదనను భారత్ ధాటిగానే ఆరంభించింది. రెండో ఓవర్‌లో అట్కిన్సన్ బౌలింగ్‌లో శాంసన్ 4,4,6,4,4తో ఏకంగా 22 పరుగులు రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లో అభిషేక్ 4,6తో జోరు చూపాడు. అయితే, శాంసన్, కెప్టెన్ సూర్యకుమార్ (0)ను ఆర్చర్ అవుట్ చేసి ఝలక్ ఇచ్చాడు. కానీ, తిలక్ సహకారంతో అభిషేక్ చెలరేగి పోయాడు. ఆరో ఓవర్‌లో అభిషేక్ రెండు సిక్స్‌లు, బౌండ్రీ బాదడంతో.. భారత్ 63/2తో పవర్‌ప్లేను ముగించింది. రషీద్ బౌలింగ్‌లో బతికిపోయిన అభిషేక్ 4,6,6తో 16 పరుగులు పిండుకొన్నాడు. ఇదే జోరులో మరో సిక్స్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. దీంతో 10 ఓవర్లకు భారత్ 100/2తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. ఇక, విజయానికి 8 పరుగుల దూరంలో ఉండగా.. అభిషేక్‌ను రషీద్ అవుట్ చేశాడు. కానీ, తిలక్ బౌండ్రీతో మ్యాచ్‌ను ఫినిష్ చేశాడు.



స్పిన్ ఉచ్చులో చిక్కి..

మిస్టరీ స్పిన్నర్ వరుణ్ మాయాజాలంతో.. ఇంగ్లండ్ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. కెప్టెన్ బట్లర్ మినహా మిగతా బ్యాటర్లు కనీస పోరాటాన్ని కనబర్చలేకపోయారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ ఆదిలోనే తడబడింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (0), బెన్ డకెట్ (4)ను అవుట్ చేసిన అర్ష్‌దీప్.. పవర్‌ప్లేలోనే ప్రత్యర్థికి షాకిచ్చాడు. కానీ, వన్‌డౌన్‌లో వచ్చిన బట్లర్.. స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. బ్రూక్ (17)తో కలసి మూడో వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశాడు. అయితే, మధ్య ఓవర్లలో భారత బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేస్తూ పరుగులను కట్టడి చేశారు. ఎనిమిదో ఓవర్‌లో బ్రూక్, లివింగ్‌స్టోన్ (0)ను అవుట్ చేసిన చక్రవర్తి ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బకొట్టాడు. దీంతో 10 ఓవర్లు ముగిసేసరికి ఇంగ్లండ్ 74/4తో ఒత్తిడిలో పడింది. ఓవైపు వికెట్లు పడుతున్నా ధాటిగా ఆడుతున్న బట్లర్ అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. జాకబ్ బెథెల్ (7)ను పాండ్యా పెవిలియన్ చేర్చాడు. ఓవర్టన్ (2), అట్కిన్సన్ (2)ను అక్షర్ వరుస ఓవర్లలో వెనక్కి పంపాడు. అయితే, 17వ ఓవర్‌లో చక్రవర్తి బౌలింగ్‌లో సిక్స్ బాదిన బట్లర్.. ఆ తర్వాతి బంతికి క్యాచవుట్ కావడంతో డెత్ ఓవర్లలో ఇంగ్లండ్ మరింత డీలాపడింది. ఆర్చర్ (12), రషీద్ (8 నాటౌట్) తొమ్మిదో వికెట్‌కు 21 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో..ఇంగ్లండ్ కష్టంగా 130 మార్క్ దాటింది.



స్కోరు బోర్డు

ఇంగ్లండ్: సాల్ట్ (సి) శాంసన్ (బి) అర్ష్‌దీప్ 0, డకెట్ (సి) రింకూ (బి) అర్ష్‌దీప్ 4, బట్లర్ (సి) నితీశ్ (బి) వరుణ్ 68, బ్రూక్ (బి) వరుణ్ 17, లివింగ్‌స్టోన్ (బి) వరుణ్ 0, బెథల్ (సి) అభిషేక్ (బి) హార్దిక్ 7, ఓవర్టన్ (సి) నితీశ్ (బి) అక్షర్ 2, అట్కిన్సన్ (స్టంప్డ్) శాంసన్ (బి) అక్షర్ 2, ఆర్చర్ (సి) సూర్య (బి) హార్దిక్ 12, రషీద్ (నాటౌట్) 8, మార్క్ ఉడ్ (రనౌట్/శాంసన్) 1; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 132 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-0, 2-17, 3-65, 4-65, 5-83, 6-95, 7-103, 8-109, 9-130; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-17-2, హార్దిక్ పాండ్యా 4-0-42-2, వరుణ్ 4-0-23-3, అక్షర్ పటేల్ 4-1-22-2, బిష్ణోయ్ 4-0-22-0.

భారత్: శాంసన్ (సి) అట్కిన్సన్ (బి) ఆర్చర్ 26, అభిషేక్ (సి) బ్రూక్ (బి) రషీద్ 79, సూర్య (సి) సాల్ట్ (బి) ఆర్చర్ 0, తిలక్ వర్మ (నాటౌట్) 19, హార్దిక్ (నాటౌట్) 3; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 12.5 ఓవర్లలో 133/3; వికెట్ల పతనం:** 1-41, 2-41, 3-125; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-21-2, అట్కిన్సన్ 2-0-38-0, మార్క్ ఉడ్ 2.5-0-25-0, రషీద్ 2-0-27-1, ఓవర్టన్ 1-0-10-0, లివింగ్‌స్టోన్ 1-0-7-0.



1 *టీ20ల్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్‌గా అర్ష్‌దీప్.. స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్‌ను వెనక్కునెట్టాడు. 61 మ్యాచ్‌ల్లో అర్ష్‌దీప్ 97 వికెట్లు కూల్చగా.. చాహల్ 80 మ్యాచ్‌ల్లో 96 వికెట్లు తీశాడు. భువనేశ్వర్ (90), బుమ్రా (89), హార్దిక్ (89) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు.*

షమి బెంచ్‌కే..

ఏడాది తర్వాత పునరాగమనం చేసిన మహ్మద్ షమికి తుది జట్టులో చోటు దక్కలేదు. దీంతో అతడి ఫిట్‌నెస్‌పై మరోసారి అనుమానాలు రేకెత్తాయి. మ్యాచ్ ముందుకు వరకు నెట్స్‌లో బౌలింగ్ కూడా చేశాడు. కానీ, టాస్ సమయానికి ఫైనల్ లెవన్‌లో షమి లేకపోవడం అందరినీ ఆశ్చర్యపర్చింది. మోకాలికి కట్టు కట్టుకొనే అతడు నెట్ సెషన్స్‌లో పాల్గొన్నాడు. అయితే, మోకాలి వాపు ఇంకా తగ్గలేదనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఎదురులేని స్వియటెక్, సిన్నర్

సెమీస్‌లో ప్రవేశం
ఆస్ట్రేలియన్ ఓపెన్



స్వియటెక్

నేడు మహిళల సెమీఫైనల్
సబలెంకxబడోసా (మ.2)
స్వియటెక్xకీస్ (మ.3.10)

మెల్‌బోర్న్: డిఫెండింగ్ చాంపియన్ జానిక్ సిన్నర్, మహిళల హాట్ ఫేవరెట్ ఇగా స్వియటెక్ ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్‌కు దూసుకుపోయారు. అలాగే 21వ సీడ్ బెన్ షెల్టన్, 19వ సీడ్ మాడిసన్ కీస్ కూడా సెమీస్‌లోకి అడుగుపెట్టారు. 23 ఏళ్ల పోలెండ్ భామ స్వియటెక్ ఈసారి మెల్‌బోర్న్ పార్క్‌లో తిరుగులేని విజయాలతో దూకుడు ప్రదర్శిస్తోంది. టోర్నీలో ఇప్పటి వరకు ఒక్క సెట్ కూడా కోల్పోకపోవడం స్వియటెక్ అద్భుత ప్రదర్శనకు అర్థం పడుతుంది. బుధవారం జరిగిన మహిళల క్వార్టర్‌ఫైనల్లో..ఐదు గ్రాండ్‌స్లామ్‌ల చాంపియన్ స్వియటెక్ 6-1, 6-2తో ఎనిమిదో సీడ్ ఎమ్మా నవారో (అమెరికా)ను చిత్తు చేసింది. గురువారం జరిగే సెమీఫైనల్లో 19వ సీడ్ కీస్‌తో స్వియటెక్ అమీతుమీ తేల్చుకుంటుంది.. మరో క్వార్టర్స్‌లో కీస్ (అమెరికా) 3-6, 6-3, 6-4తో 28వ సీడ్ స్విటోలినా (ఉక్రెయిన్)న్‌పై నెగ్గింది. పురుషుల క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ సిన్నర్ (ఇటలీ) 6-3, 6-2, 6-1తో అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా)ను ఓడించాడు. శుక్రవారం జరిగే సెమీఫైనల్లో 21వ సీడ్ షెల్టన్‌ను సిన్నర్ ఎదుర్కొంటాడు. ఇంకో క్వార్టర్‌ఫైనల్లో షెల్టన్ (అమెరికా) 6-4, 7-5, 4-6, 7-6 (4)తో లోరెంజో సొనేగో (ఇటలీ)పై గెలిచాడు. పురుషుల రెండో సెమీఫైనల్లో రెండో సీడ్ జ్వెరేవ్-ఏడో సీడ్ జొకోవిచ్ తలపడతారు.

సింధు, లక్ష్య సారథ్యంలో..

ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ:పీవీ సింధు, లక్ష్యసేన్ ఫిబ్రవరి 11 నుంచి చైనాలోని కింగ్దావోలో ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత జట్లకు సారథ్యం వహించనున్నారు. 2023లో జరిగిన టోర్నీలో కాంస్యం నెగ్గిన భారత జట్టు.. ఈసారి 14 మందితో దిగుతోంది. సింగిల్స్‌లో సింధు, మాళవిక, లక్ష్యసేన్, ప్రణయ్, డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్, గాయత్రి/ట్రీసా, అశ్విని/తనీషా, 'మిక్స్‌డ్‌'లో ధ్రువ్/తనీషా, సతీష్/ఆద్య ఆడనున్నారు.

సింధు ఇంటికి.. సేన్ ముందుకు

జకార్త: ఇండియా ఓపెన్‌లో నిరాశపరిచిన పీవీ సింధుకు ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీలోనూ చుక్కెదురైంది. బుధవారం జరిగిన సింగిల్స్ తొలిరౌండ్లో సింధు 20-22, 12-21తో తుయ్ లిన్ గుయెన్ (వియత్నాం) చేతిలో ఓటమిపాలైంది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 21-9, 21-14తో ఒబయాషిపై నెగ్గి రెండో రౌండ్ చేరాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా/ధ్రువ్ కపిల జోడీ 21-18, 21-14తో స్థానిక జంట అద్నాన్/ఇన్‌దాను ఓడించి రెండో రౌండ్ చేరింది.

డ్రెస్ కోడ్‌ను పాటిస్తాం

ఊహాగానాలకు తెరదించిన బీసీసీఐ

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీలో ఐసీసీ నిబంధనల ప్రకారం డ్రెస్ కోడ్‌ను పాటిస్తామని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశాడు. టీమిండియా అధికారిక జెర్సీపై ఆతిథ్య పాకిస్థాన్ పేరును భారత బోర్డు వ్యతిరేకిస్తోందన్న ఊహాగానాలను సైకియా కొట్టిపడేశాడు. 'ఐసీసీ నిబంధనల ప్రకారం నడుచుకొంటాం. ఈ విషయంలో అన్ని జట్ల తరహాలోనే క్రీడాస్ఫూర్తిని చాటుతామ'ని సైకియా అన్నాడు. ఇక, పాక్‌లో జరిగే ప్రీ టోర్నమెంట్ కార్యక్రమాల్లో భారత కెప్టెన్ రోహిత్ శర్మ పాల్గొంటాడా, లేదా? అనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నాడు. చాంపియన్స్ ట్రోఫీ వచ్చేనెల 19 నుంచి హైబ్రిడ్ ఫార్మాట్‌లో జరగనుంది.

పాకిస్థాన్ అవుట్

షాకిచ్చిన ఐర్లాండ్
అండర్-19 టీ20 వరల్డ్ కప్

జొహోర్ (మలేసియా): అండర్-19 మహిళల టీ20 వరల్డ్ కప్‌లో ఐర్లాండ్ జట్టు పాకిస్థాన్‌ను చిత్తుచేసి సూపర్-6కు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన గ్రూప్-బి మ్యాచ్‌లో 13 పరుగులతో (డ/లూ) పాకిస్థాన్‌ను ఓడించింది. వర్షం వల్ల మ్యాచ్‌ను మ్యాచ్‌ని 9 ఓవర్లకు కుదించగా, ఐర్లాండ్ 69/5 స్కోరు చేసింది. సవరించిన లక్ష్యం ప్రకారం 9 ఓవర్లలో 73 పరుగులు చేయాల్సిన పాక్.. 59/7 కే పరిమితమై ఓడింది. ఈ గ్రూపు నుంచి ఐర్లాండ్‌తోపాటు ఇంగ్లండ్, అమెరికా సూపర్-6కి క్వాలిఫై అయ్యాయి. మరో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 8 వికెట్లతో అమెరికాను చిత్తు చేసింది. ఇక గ్రూప్-డిలో ఆస్ట్రేలియా 83 పరుగులతో నేపాల్‌పై నెగ్గింది. మరో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 18 పరుగులతో స్కాట్లాండ్‌పై గెలిచింది. ఈ గ్రూప్ నుంచి ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, స్కాట్లాండ్ సూపర్-6కి క్వాలిఫై అయ్యాయి. గ్రూప్-సిలో న్యూజిలాండ్ 67 పరుగులతో సమోవాపై విజయం సాధించింది. అలాగే దక్షిణాఫ్రికా 41 పరుగులతో నైజీరియాపై గెలిచింది. ఈ గ్రూపు నుంచి దక్షిణాఫ్రికా, నైజీరియా, న్యూజిలాండ్ సూపర్-6కి అర్హత సాధించాయి.

నేడు.. భారత్xశ్రీలంక

గ్రూప్-ఎలో భారత్ తమ చివరి లీగ్ మ్యాచ్‌ను శ్రీలంకతో గురువారం ఆడనుంది. చెరో నాలుగేసి పాయింట్లతో ఉన్నా..మెరుగైన రన్‌రేట్‌తో భారత్ అగ్రస్థానంలో కొనసాగుతున్నది. ఇరు జట్లు ఇప్పటికే సూపర్-6కి క్వాలిఫై అయ్యాయి. ఆఖరి మ్యాచ్ ద్వారా గ్రూపు టాపర్ ఎవరో తేలనుంది. మరో లీగ్ మ్యాచ్‌లో వెస్టిండీస్-మలేసియా ఢీకొననున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిస్తే వెస్టిండీస్ కూడా సూపర్-6లోకి ప్రవేశిస్తుంది.

రూ. 250తో సిప్!

సెబీ కీలక ప్రతిపాదన



న్యూఢిల్లీ: దేశంలో మ్యూచువల్ ఫండ్ల పరిధిని మరింత విస్తరించడంతో పాటు అల్పాదాయ వర్గాల ప్రజలు కూడా చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టేందుకు వీలు కల్పించేలా సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం మ్యూచువల్ ఫండ్ల సాచెటైజేషన్‌కు (ఉత్పత్తులు లేదా ఆర్థిక సేవలను అతి స్వల్ప ధరకు అందుబాటులోకి తెచ్చే ప్రక్రియ) శ్రీకారం చుట్టింది. కేవలం రూ.250 క్రమానుగత పెట్టుబడి ప్రణాళిక (సిప్) ద్వారా మ్యూచువల్ ఫండ్ యూనిట్లను కొనుగోలు చేసేందుకు వీలు కల్పించాలని ప్రతిపాదించింది. డెట్, సెక్టార్ ఆధారిత, థీమాటిక్ పథకాలతో పాటు స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఈక్విటీ స్కీమ్ విభాగాలు మినహా ఏదైనా పథకంలో స్మాల్ టికెట్ సిప్‌ను ఆఫర్ చేయవచ్చని సెబీ స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన చర్చా పత్రాన్ని సెబీ బుధవారం విడుదల చేసింది. తమ ప్రతిపాదనలపై వచ్చేనెల 6 నాటికి అభిప్రాయాలు, సూచనలు తెలుపాలని ప్రజలను కోరింది.

ఎన్‌ఎస్‌ఈ @ 11 కోట్ల ఇన్వెస్టర్లు



నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో (ఎన్‌ఎస్‌ఈ) నమోదైన ఇన్వెస్టర్ల సంఖ్య 11 కోట్ల మైలురాయిని దాటింది. ఎన్‌ఎస్‌ఈ బుధవారం ఈ విషయం ప్రకటించింది. గడిచిన 5 నెలల్లోనే ఇన్వెస్టర్ల సంఖ్య కోటి మేర పెరిగిందని ఎక్స్ఛేంజ్ తెలిపింది. గత ఐదేళ్లలో 3.6 రెట్లు పెరిగారు. 1994లో కార్యకలాపాలు ప్రారంభించిన ఎన్‌ఎస్‌ఈకి కోటి మంది ఇన్వెస్టర్ల మైలురాయిని చేరుకునేందుకు 14 ఏళ్లు పట్టింది. ఆ తర్వాత ఏడేళ్లలోనే ఇన్వెస్టర్లు 2 కోట్లకు పెరిగారు. ఆ తర్వాత 3.5 ఏళ్లలోనే 3 కోట్లకు, ఆపై ఏడాది కాలంలోనే 4 కోట్లకు చేరారని ఎక్స్ఛేంజ్ వెల్లడించింది. అప్పటి నుంచి ఇన్వెస్టర్ల సంఖ్య 6-7 నెలలకు కోటి చొప్పున పెరుగుతూ వచ్చిందని తెలిపింది.

రికార్డు గరిష్ఠానికి బంగారం

ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాములు రూ.82,730కి.. ఒక్కరోజే రూ.630 పెరుగుదల



ఢిల్లీ: దేశీయంగా పసిడి, వెండి ధరలు మరింత పెరిగాయి. ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.630 పెరిగి సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి రూ.82,730కి ఎగబాకింది. వెండి కూడా కిలోకు రూ.1,000 పెరుగుదలతో రూ.94,000కు చేరుకుంది. అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాలపై నెలకొన్న అనిశ్చితి కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో విలువైన లోహాలకు గిరాకీ మళ్లీ పుంజుకుంది. దేశీయంగా ఆభరణ వర్తకులు, స్టాకిస్టులు కొనగోళ్లు పెంచడం కూడా వీటి ధరల పెరుగుదలకు కారణమయ్యాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం 10.20 డాలర్లు పెరిగి 2,769.40 డాలర్ల వద్ద ట్రేడవగా.. వెండి 0.27 శాతం పెరిగి 31.58 డాలర్లు పలికింది. కాగా, 24 క్యారెట్ల బంగారం ధరలో గత రికార్డు 2024 అక్టోబరు 31న రూ.82,400 స్థాయి వద్ద నమోదైంది.

బిజినెస్

హెరిటేజ్ లాభం రూ.43.1 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్ర జ్యోతి బిజినెస్): మూడో త్రైమాసికానికి హెరిటేజ్ ఫుడ్స్ మంచి ఆర్థి క ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ రూ.1,033.9 కోట్ల ఆదాయంపై రూ.43.1 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 10%, నికర లాభం 43% పెరిగాయి. డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల పనితీరును పరిగణనలోకి తీసుకు న్నా రూ.3,086.1 కోట్ల ఆదాయంపై రూ.150.1 కోట్ల నికర లాభం నమోదు చేసింది. ముందు ఏడాదితో పోలిస్తే ఈ తొమ్మిది నెలల్లో కంపెనీ ఆదాయం తొమ్మిది శాతం మాత్రమే పెరిగినా నికర లాభం మాత్రం 127 శాతం పెరిగింది.

బీపీసీఎల్ రూ.5 డివిడెండ్

ఆయిల్ రిఫైనింగ్ కంపెనీ బీపీసీఎల్ మూడో త్రైమాసికంలో 36.85% వృద్ధితో రూ.4,649 కోట్ల స్టాండ్ అలోన్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన నికరలాభం రూ.3,397 కోట్లుంది. అయితే కంపెనీ ఆదాయం మాత్రం 1.86 శాతం క్షీణించి రూ.1,29,946.95 కోట్ల నుంచి రూ.1,27,520.50 కోట్లకు దిగజారింది. వాటాదారులకు కంపెనీ రూ.10 ముఖవిలువ గల ఒక్కో షేరుపై రూ.5 మధ్యంతర డివిడెండు ప్రకటించింది. ఇందుకు అర్హత సాధించేందుకు జనవరి 29 రికార్డు తేదీగా నిర్ణయించింది.

హైదరాబాద్‌లో క్రెడెరా జీసీసీ కేంద్రం

వెయ్యికి పైగా ఉద్యోగాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆమ్నికామ్ అనుబంధ సంస్థ క్రెడెరా హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) నెలకొల్పింది. భారత్‌లో ఇది తమకు ఆరో జీసీసీ అని కంపెనీ ఆసియా, పసిఫిక్ విభాగం సీఈఓ కెవిన్ మెక్‌డోనాల్డ్ చెప్పారు. ఈ కేంద్రం ద్వారా ఆసియా, పసిఫిక్ ప్రాంత దేశాల్లోని కంపెనీలకు డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, మేనేజ్‌మెంట్ సేవలు అందిస్తామన్నారు. దాదాపు 80,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ప్రస్తుతం వెయ్యిమందికి పైగా మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్ నిపుణులు పని చేస్తున్నట్టు క్రెడెరా ఇండియా సీఈఓ గౌరవ్ మాథుర్ చెప్పారు. ముందు ముందు హైదరాబాద్ జీసీసీని మరింత విస్తరించే యోచన ఉందన్నారు. ఫ్రెషర్స్‌కి కూడా తమ సంస్థలో వార్షికంగా రూ.5 లక్షల ప్యాకేజి ఇస్తున్నట్టు తెలిపారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభంలో స్వల్ప వృద్ధి

న్యూఢిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ డిసెంబరు త్రైమాసికంలో నికరలాభంలో స్వల్ప వృద్ధిని నమోదు చేసింది. బ్యాంక్ స్టాండ్ అలోన్ లాభం 2 శాతం పెరిగి రూ.16,373 కోట్ల నుంచి రూ.16,736 కోట్లకు పెరిగింది. మొత్తం ఆదాయం రూ.81,720 కోట్ల నుంచి రూ.87,460 కోట్లకు చేరింది. ఇదే త్రైమాసికంలో బ్యాంకు కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.1,12,194 కోట్లపై రూ.17,657 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. డిసెంబరు 31 నాటికి నికర ఎన్‌పీఏలు 0.31 శాతం నుంచి 0.46 శాతానికి పెరిగాయి.

హెచ్‌యూఎల్ లాభం రూ.2989 కోట్లు

హిందుస్తాన్ యునీలీవర్ కంపెనీ డిసెంబరు 31వ తేదీతో ముగిసిన మూడో త్రైమాసికంలో 19.18 శాతం వృద్ధితో రూ.2989 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. ప్యూరిట్ వ్యాపార విభాగం విక్రయం లాభాల వృద్ధికి దోహదపడిందని కంపెనీ వెల్లడించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.2508 కోట్ల లాభం ఆర్జించింది. ఇదే కాలంలో కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.15,781 కోట్ల నుంచి రూ.16,050 కోట్లకు పెరిగింది. త్రైమాసికంలో మొత్తం వ్యయాలు రూ.12,576 కోట్లుగా నమోదయ్యాయి.

అప్‌రైజింగ్ సైన్స్ కొనుగోలు: ప్రీమియం బ్యూటీ బ్రాండ్ మినిమలిస్ట్ యాజమాన్య సంస్థ అప్‌రైజిం గ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 90.5 శాతం వాటాలు కొనుగోలు చేయనున్నట్టు కంపెనీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ జావా తెలిపారు. రూ.2,955 కోట్ల అంచనా విలువతో రూ.2,670 కోట్ల నగదు చెల్లింపు ప్రాతిపదికన కంపెనీని కొనుగోలు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఇందుకోసం ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు చెప్పారు. మరో రెండు సంవత్సరాల కాలంలో మిగతా వాటాలు కూడా కొనుగోలు చేస్తామన్నారు. కాగా ఐస్‌క్రీమ్ వ్యాపారం క్వాలిటీ వాల్స్ (ఇండియా) లిమిటెడ్ డీ మెర్జర్‌కు డైరెక్టర్ల బోర్డు అనుమతించిందని ఆయన తెలిపారు.

బడా షేరు కళకళ..

చిన్న స్టాక్స్ విలవిల

మార్కెట్‌లో మిశ్రమ స్పందన.. 567 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

- ఒక శాతానికి పైగా నష్టపోయిన స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు
- రూ.2.18 లక్షల కోట్లు తగ్గిన సంపద



ముంబై: స్టాక్ మార్కెట్లో బుధవారం మిశ్రమ ట్రెండ్ కన్పించింది. సానుకూల అంతర్జాతీయ సంకేతాల నేపథ్యంలో మదుపరులు బ్లూచిప్ ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లకు పాల్పడటంతో సెన్సెక్స్, నిఫ్టీ మళ్లీ లాభాల బాట పట్టాయి. సెన్సెక్స్ ఒకదశలో 624.77 పాయింట్లు పెరిగి 76,463.13 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 566.63 పాయింట్ల లాభంతో 76,404.99 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 130.70 పాయింట్ల వృద్ధితో 23,155.35 వద్ద ముగిసింది. ప్రధాన కంపెనీల షేర్లకు డిమాండ్ పెరిగినప్పటికీ చిన్న, మధ్య స్థాయి షేర్లలో మాత్రం అమ్మకాలు కొనసాగాయి. దాంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.56 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.2 శాతం క్షీణించాయి. డిసెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో హైదరాబాద్ కంపెనీ సైయెంట్ డీఎల్ఎం షేరు 14 శాతం మేర క్షీణించి రూ.515.70కి పడిపోయింది. స్మాల్, మిడ్‌క్యాప్ షేర్లలో అమ్మకాల కారణంగా బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2.18 లక్షల కోట్లు తగ్గి రూ.421.88 లక్షల కోట్లకు పడిపోయింది.

● ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 23 పైసలు పెరిగి రూ.86.35 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ కాస్త బలహీనపడటంతోపాటు ప్రధాన ఈక్విటీల్లో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి.

మెరుగైన విధాన నిర్ణయాల కోసం రెండు ద్రవ్యోల్బణ సూచీలు

ఎంపీసీ సభ్యుడు నగేశ్ కుమార్ సూచన

న్యూఢిల్లీ: మరింత మెరుగైన ద్రవ్యపరపతి విధాన నిర్ణయాల కోసం రెండు రకాల ద్రవ్యోల్బణ సూచీలుంటే బాగుటుందని ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సభ్యుడు నగేశ్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఆహార, ఆహారేతర ఉత్పత్తుల ధరలకు వేర్వేరు సూచీలను ఏర్పా టు చేయాలని ఆయన సూచించారు. అప్పుడే, పరపతి విధాన నిర్ణయాల కోసం సంబంధిత ధరల సూచీని మాత్రం పరిగణనలోకి తీసుకోవచ్చన్నారు. ఆర్‌బీఐ వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకునే సమయంలో ఆహార ధరలను మినహాయించాలని ప్రధాన ఆర్థిక సలహాదారు వీ అనంత నాగేశ్వరన్ కూడా '2023-24 ఆర్థిక సర్వే' నివేదికలో ప్రస్తావించారు. ఆహార ధరలకు, వడ్డీరేట్లకు ఎలాంటి సంబంధం లేదని.. సరఫరాను బట్టే వాటిధరలు హెచ్చుతగ్గులకు లోనవుతాయన్నారు.

మార్కెట్లోకి రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440

- ప్రారంభ ధర రూ.2.08 లక్షలు



న్యూఢిల్లీ: రాయల్ ఎన్‌ఫీల్డ్ బుధవారం 'స్క్రామ్ 440' మోటార్ సైకిల్‌ను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. దీని ప్రారంభ ధర రూ.2.08 లక్షలు. స్క్రామ్ 411 స్థానాన్ని భర్తీ చేసేందుకు కంపెనీ ఈ బైక్‌ను గత ఏడాది గోవాలో నిర్వహించిన మోటోవెర్స్ షోలోనే ఆవిష్కరించింది. అయితే, బైక్ ఇంజిన్‌తోపాటు పనితీరు, డిజైన్‌ను మరింత అప్‌గ్రేడ్ చేసి తాజాగా కస్టమర్లకు అందుబాటులోకి తెచ్చింది. ట్రయంఫ్ స్క్రాంబ్లర్ 400ఎక్స్‌కు పోటీగా రాయల్ ఎన్‌ఫీల్డ్ ఈ బైక్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది.

డబ్ల్యూఈఎఫ్ జాబితాలో కాకినాడ ఇండస్ట్రియల్ క్లస్టర్

- భారత్ నుంచి మరో నాలుగు క్లస్టర్లకూ చోటు

దావోస్ (స్విట్జర్లాండ్) : వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఈఎఫ్) ప్రారంభించిన పారిశ్రామిక క్లస్టర్ల జాబితాలో మన దేశానికి చెందిన ఐదు క్లస్టర్లకు చోటు లభించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ పారిశ్రామిక క్లస్టర్ కూడా ఉంది. ఏఎం గ్రీన్ సంస్థ ఈ క్లస్టర్‌ను సమన్వయం చేస్తుంది. రేవు ఆధారిత ఈ క్లస్టర్‌లో కాలుష్య రహిత గ్రీన్ అమ్మోనియా, హైడ్రోజన్, పర్యావరణకు హాని చేయని విమాన ఇంధన పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటారు. కాకినాడ పారిశ్రామిక క్లస్టర్‌తో పాటు ఒడిసాలోని గోపాల్‌పూర్ ఇండస్ట్రియల్ పార్క్, తిరువనంతపురంలోని కేరళ గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, గుజరాత్‌లోని ముంద్రా క్లస్టర్, మహారాష్ట్రలోని ముంబై గ్రీన్ హైడ్రోజన్ క్లస్టర్లకు కూడా డబ్ల్యుఈఎఫ్ జాబితాలో చోటు దక్కింది. మన దేశానికి చెందిన ఐదు క్లస్టర్లతో పాటు 16 దేశాలకు చెందిన మొత్తం 33 క్లస్టర్లకు ఈ జాబితాలో చోటు దక్కింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	127	విజయవాడ	141
వరంగల్	127	గుంటూరు	137
కరీంనగర్	127	ఒంగోలు	137
మహబూబ్‌నగర్	127	చిత్తూరు	112
కర్నూలు	127	నెల్లూరు	117
విశాఖపట్నం	132	అనంతపురం	117
గోదావరి	141		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	510
వరంగల్	482	గోదావరి	505
చిత్తూరు	503	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	82,090 ▲	75,250 ▲	1,04,000 ▲
విజయవాడ	82,500 ▲	78,000 ▲	94,000 ▲
విశాఖపట్నం	79,820 ▲	73,170 ▲	92,120 ▲
రాజమండ్రి	82,090 ▲	75,250 ▲	94,200 ▲
ప్రొద్దుటూరు	80,700 ▲	74,730 ▲	93,200 ▲
ముంబై	80,190 ▲	73,460 ▲	91,250 ▲

www.andhrajyothy.com

విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 23-1-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మాతో కలిసి రండి


బిల్‌గేట్స్‌కు బాబు ఆహ్వానం

- ఆరోగ్యం, విద్య ఆవిష్కరణలకు ప్రాధాన్యం
- ఏఐ వర్సిటీ సలహా మండలిలో చేరండి
- గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం కోసం ఆంధ్రప్రదేశ్ ఎదురు చూస్తోంది
- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ హెల్త్ ఇన్నోవేషన్ డయాగ్నస్టిక్స్ పెట్టండి
- మైక్రోసాఫ్ట్ అధినేతను కోరిన సీఎం
- ఐటీ అభివృద్ధికి సహకరించండి
- గేట్స్ ఫౌండేషన్ కార్యక్రమాలకు ఏపీని గేట్‌వేగా నిలపండి
- బిల్‌గేట్స్‌తో భేటీలో మంత్రి లోకేశ్
- చాలాకాలం తర్వాత చంద్రబాబును కలవడం ఆనందంగా ఉందన్న గేట్స్



టీమ్ ఇండియా @ ప్రపంచ ఆర్థిక వేదిక

దావోస్‌లో మహారాష్ట్ర, టీ- సీఎంలతో బాబు



దావోస్‌లో బిల్‌గేట్స్‌తో సమావేశమైన సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య, విద్య ఆవిష్కరణల కేంద్రంగా మార్చేందుకు సహకరించాలని ప్రపంచ ఐటీ దిగ్గజం, మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఏపీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ హెల్త్ ఇన్నోవేషన్, డయాగ్నస్టిక్స్‌ను ప్రారంభించాలని, ఈ కేంద్రం ప్రజలకు అధునాతన ఆరోగ్య సదుపాయాలు అందించేలా తీర్చిదిద్దాలన్నారు. దావోస్‌లో బిల్‌గేట్స్‌తో సీఎం చంద్రబాబుతో పాటు రాష్ట్ర ఐటీ మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. బుధవారం దావోస్ ప్రొమెనేడ్

మిగతా 13వ పేజీలో...

'టీమ్ ఇండియా' స్ఫూర్తి

- ఉమ్మడి మీడియా సమావేశంలో బాబు, ఫడణవీస్
- తెలంగాణ, తమిళనాడు మంత్రులు కూడా!
- మార్గదర్శిగా చంద్రబాబు: కేంద్ర మంత్రి వైష్ణవ్
- మహారాష్ట్ర, తెలంగాణ బలంగా ఉన్నాయి
- మేమూ కష్టపడతాం: చంద్రబాబు

గూగుల్ క్లౌడ్‌ను విస్తరించండి



దావోస్‌లో గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి టీజీ భరత్ తదితరులు

- విశాఖలో డిజైన్ కేంద్రం పెట్టండి
- సీఈవో థామస్‌కు బాబు ఆహ్వానం
- పెట్టుబడులతో మూలపేట రండి
- పెట్రోనాస్ అధిపతిని కోరిన సీఎం
- మా ఓడరేవులను పరిశీలించండి
- డీపీ వరల్డ్‌ను కోరిన ముఖ్యమంత్రి
- పెప్సికో యాజమాన్యంతో భేటీ

ఏపీలో ట్రేడ్ హబ్

- దావోస్‌లో దిగ్గజ కంపెనీలను కోరిన లోకేశ్
- డబ్ల్యూటీసీ గ్లోబల్, హిటాచీ, విప్రో, ష్నైడర్, డబ్ల్యూఈఎఫ్ హెల్త్‌కేర్ అధిపతులతో భేటీ
- యాక్సెస్ హెల్త్‌కేర్ సీఈవోతో కూడా
- సింగపూర్ వర్సిటీ ఈడీతోనూ సమావేశం



ఏఐపై రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేశ్

ఒక రైలు దిగి.. మరో రైలు కింద నలిగి..

12 మంది దుర్మరణం



జల్గావ్‌లో ప్రమాదం జరిగిన ప్రదేశం

- పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలు చక్రాల వద్ద నిప్పురవ్వలు
- అగ్నిప్రమాదం అంటూ వదంతులు
- చైన్ లాగి కిందకు దిగిన 50 మంది
- అటుగా వచ్చిన కర్ణాటక ఎక్స్‌ప్రెస్ ఢీ
- 12 మంది అక్కడికక్కడే మృతి.. ఛిద్రమైన శరీరాలు
- మరో 10 మందికి గాయాలు: ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి.. మహారాష్ట్ర జాల్గావ్‌లో ఘటన

ముంబై, జనవరి 22: మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లా పరందా రైల్వే స్టేషన్ సమీపంలో ఘోరం జరిగింది. పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న కొందరు ప్రయాణికులు బోగీకి నిప్పంటుకుందనే వదంతులతో కిందకు దూకారు. అటుగా వచ్చిన కర్ణాటక ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో 12 మంది అక్కడికక్కడే మృతిచెందగా.. 35 మంది గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో ఓ బాలుడు, ముగ్గురు మహిళలున్నారు. ఈ ఘటనపై జల్గావ్ ఎస్పీ డాక్టర్ మహేశ్వర్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన అందజేసిన వివరాల ప్రకారం.. జల్గావ్ నుంచి బయలుదేరిన పుష్పక్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 5 గంటల సమయంలో పరందా స్టేషన్ సమీపానికి రాగానే.. జనరల్ బోగీ చక్రాల వద్ద నిప్పురవ్వలు వచ్చి, పొగ రేగింది. దీంతో.. ఓ ప్రయాణికుడు "బోగీకి నిప్పంటుకుంది" అంటూ అరిచాడు. అది విని కంగారు పడ్డ ప్రయాణికులు చైన్ లాగారు. రైలు ఆగడంతో

మిగతా 2వ పేజీలో...



కల్లోల దండకారణ్యం

- నక్సల్స్‌కు దడ పుట్టిస్తున్న యూఏవీ డ్రోన్లు
- డే అండ్ నైట్.. కారడవిలో ఆపరేషన్స్
- ఎదురుకాల్పులు తప్ప అన్నీ చేయగలవు
- మావోయిస్టుల వేటలో 28 డ్రోన్లు
- చీకట్లోనూ చీల్చుకెళ్లి ఫోటో, వీడియో, లైవ్‌స్ట్రీమింగ్
- దట్టమైన అడవుల్లోని శిబిరాలు, దళాలపైనా నిఘా
- గట్టి భద్రతలోని చలపతిని సైతం ఛేదించి ఎన్‌కౌంటర్‌కు దారి చూపిన ఏరియల్ సర్వైలెన్స్
- బలగాల పైచేయికి ఇదే కారణం

14



జన్మతః పౌరసత్వ హక్కు రద్దు ఉత్తర్వుపై

22 రాష్ట్రాలు కోర్టుకు

- రెండు కోర్టుల్లో డెమొక్రాట్ పాలిత రాష్ట్రాల అటార్నీ జనరళ్ల వ్యాజ్యాలు
- పౌరహక్కుల సంస్థలతోపాటు.. ఒక గర్భిణి కూడా న్యాయస్థానానికి!
- ఇష్టానుసారంగా చట్టాల్ని మార్చడానికి ట్రంప్ రాజు కాదని ధ్వజం

2

హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా

హరిహరనాథశర్మ, లక్ష్మణరావు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర
- కేంద్ర న్యాయ శాఖ నోటిఫికేషన్ జారీ
- ఇద్దరూ రేపు ప్రమాణం చేసే అవకాశం!
- తెలంగాణకూ నలుగురు అదనపు జడ్జీలు

14

‘గగన్‌యాన్’కు చకచకా!

ఇస్రో సన్నాహాలు.. షార్ చేరుకున్న ఆర్బిటల్ మాడ్యూల్

సూళ్లూరుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇస్రో తొలిసారిగా చేపట్టనున్న మానవసహిత అంతరిక్ష ప్రయోగం గగన్‌యాన్‌కు సన్నాహాలు వేగం పుంజుకున్నాయి. వచ్చే రెండేళ్లలో రోదసిలోకి వ్యోమగాములను పంపి, తిరిగి వారిని సురక్షితంగా భూమిపైకి తెచ్చే లక్ష్యంతో ఇస్రో ఈ మిషన్ చేపట్టింది. ఇందులో భాగంగా ఫిబ్రవరిలో మొదటి మానవరహిత యాత్రకు సన్నద్ధమవుతోంది. హ్యూమన్ రేటెడ్ లాంచ్ వెహికల్ మార్క్-3 (హెచ్‌ఎల్‌వీఎం3)-జీ1 ద్వారా ఇస్రో రూపొందించిన ఆర్బిటల్ మాడ్యూల్‌ను అంతరిక్షంలోకి పంపనున్నారు. ఈ మాడ్యూల్‌ను బుధవారం ప్రత్యేక వాహనంలో షార్‌కు తెచ్చారు. హెచ్‌ఎల్‌వీఎం3-జీ1 రాకెట్ ద్వారా 8,200 కిలోల బరువైన ఆర్బిటల్ మాడ్యూల్‌ను 170 కిలోమీటర్ల ఎత్తుకు పంపి 430 కిలోమీటర్ల దూరంలో దీర్ఘవృత్తాకార కక్ష్యలో లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెడతారు. 7రోజుల తర్వాత మాడ్యూల్‌ను మళ్లీ భూమిపైకి సురక్షితంగా తీసుకొచ్చే ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ క్రమంలో మిషన్ విఫలమయ్యే పరిస్థితి సంభవిస్తే, వ్యోమగాములు సురక్షితంగా బయటపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని నిర్ధారించుకొనేందుకు మానవ రహిత ప్రయోగం ఉపయోగపడుతుందని ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతన్నారు.



గగన్‌యాన్‌లో పంపే మాడ్యూల్

యూపీఎస్సీ సివిల్స్ నోటిఫికేషన్ విడుదల

న్యూఢిల్లీ, జనవరి 22: యూపీఎస్సీ సివిల్స్-2025 నోటిఫికేషన్ విడుదలైంది. అఖిల భారత సర్వీసుల్లో 23 విభాగాల్లోని 979 ఖాళీల భర్తీకి యూపీఎస్సీ బుధవారం ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దరఖాస్తుల దాఖలుకు ఫిబ్రవరి 11వ తేదీ వరకు అవకాశం కల్పించింది. 21 నుంచి 32ఏళ్ల మధ్య వయసు ఉండి బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఏడాది మే 25న ప్రిలిమినరీ పరీక్షను నిర్వహిస్తారు. మరోవైపు 150పోస్టులతో ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఎగ్జామినేషన్ నోటిఫికేషన్‌ను యూపీఎస్సీ విడుదల చేసింది. అభ్యర్థులు ఫిబ్రవరి 22 సాయంత్రం 6గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలి.

వైవీ సుబ్బారెడ్డి మా భూములు ఆక్రమిస్తున్నారు

పోలీసులు వారికి సహకరిస్తున్నారు.. టీ హైకోర్టులో పిటిషన్

భూములు తమవేనన్న వైవీ.. పోలీసుల జోక్యం వద్దన్న కోర్టు

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి, ఆయన భార్య స్వర్ణలతా రెడ్డి తమ భూములను ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని, ఈ అంశంలో పోలీసులు వారికి సహకరిస్తున్నారని పేర్కొంటూ తెలంగాణ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. కొప్పుల మల్లారెడ్డి, జీ నర్సింహారెడ్డి, షేక్ ఇస్లాముద్దీన్ అనే వ్యక్తులు దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ వాదిస్తూ.. వైవీ సుబ్బారెడ్డి పోలీసులు, వారి ఉన్నతాధికారులను ప్రభావితం చేసి పిటిషనర్లను ఖాళీ చేయించాలని చూస్తున్నారని తెలిపారు. వైవీ సుబ్బారెడ్డి దంపతుల తరఫున సీనియర్ న్యాయవాది కే వివేక్‌రెడ్డి వాదిస్తూ.. సదరు భూమిపై తమకే టైటిల్ ఉందని, రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా భూమి కొనుగోలు చేశారని తెలిపారు. హోంశాఖ తరఫున న్యాయవాది మహేశ్‌రాజే వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు, ప్రతివాదులు గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం కేసులు పెట్టుకున్నారని, పోలీసులు సదరు కేసులపై దర్యాప్తు చేయడం తప్ప సివిల్ వివాదంలో జోక్యం చేసుకోవడం లేదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఈ కేసుకు సంబంధించిన సివిల్ వివాదంలో గచ్చిబౌలి పోలీసులు జోక్యం చేసుకోరాదని స్పష్టం చేసింది. అయితే శాంతిభద్రతలకు భంగం కలిగినా.. అనుకోని ఘటనలు జరిగినా చర్యలు తీసుకోవచ్చంటూ తదుపరి విచారణ ఫిబ్రవరి 19కి వాయిదా వేసింది.

అనంతపురంలో ముసుగు దొంగల భారీ చోరీ

అనంతపురం క్రైం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ముసుగు దొంగలు భారీ ఎత్తున చోరీ చేశారు. నగర శివారులోని రాజహంస విల్లాస్‌లోని మూడు ఇళ్లల్లో నలుగురు దొంగలు చొరబడి భారీగా బంగారు ఆభరణాలు, నగదును దోచుకుపోయారు. బుధవారం తెల్లవారు జామున 3.45 గంటల నుంచి 5 గంటల మధ్య ఇళ్లలో ఎవరూ లేని సమయంలో దొంగతనాలు జరిగాయి. వ్యవసాయం, రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసే వెంకట శివారెడ్డి ఇంట్లోని బీరువాలో దాచిన రూ. 20 లక్షల నగదు, ప్రత్యేక లాకరులో ఉంచిన రూ. 3.50 కోట్ల విలువైన వజ్రాలు, బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకుపోయారు. విద్యుత్ శాఖ డీఈ బోయపాటి శివశంకర్‌నాయుడు ఇంట్లో 4 తులాలు బంగారు ఆభరణాలు, కొంతమొత్తంలో వెండి సామగ్రి, రూ. 65 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఆ పక్కనే రంజిత్ అనే వ్యక్తి ఇంట్లోనూ చోరీ జరిగింది. ఎంత చోరీ జరిగిందీ తెలియరాలేదు. అయితే రంజిత్ ఇంట్లో సీసీ కెమెరాలున్నాయి. పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. నలుగురు దుండగులు ముఖానికి ముసుగులు వేసుకుని దొంగతనాలకు పాల్పడినట్లు ఫుటేజీ ఆధారంగా నిర్ధారించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. నాలుగో పట్టణ సీఐ సాయినాథ్ సిబ్బందితో కలిసి చోరీలు జరిగిన ఇళ్లను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను ముక్కలుగా కోసి.. కుక్కర్‌లో ఉడికించి..

ఓ భర్త దారుణం.. ఆమె ప్రవర్తనపై అనుమానంతోనే ఘోరం

ఉడికిన ముక్కలను 3రోజులు ఎండబెట్టి.. దంచిన దుర్మార్గుడు

ఆ పొడిని చెరువులో కలిపేశాడు.. మీర్‌పేట్‌లో ఘోరం

హైదరాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భార్యను కత్తితో విచక్షణారహితంగా పొడిచి చంపి, అదే కత్తితో ఆమె మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా కోశాడా భర్త! ఆ ఖండిత భాగాలను కుక్కర్‌లో వేసి, ఉడికించి.. ఆ ముక్కలను మూడు రోజుల పాటు ఎండబెట్టి.. రోకలితో దంచాడు! ఆ పొడిని తీసుకెళ్లి ఓ చెరువులో పడేశాడు!! ఒళ్లు గగుర్పాటుకు గురిచేసేలా ఉన్న ఈ ఘోరం రాచకొండ పరిధిలోని హైదరాబాద్ మీర్‌పేట్‌లో వెలుగుచూసింది. భార్య ఎవరితోనో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందనే అనుమానంతోనే అతడింతటి ఘోరానికి పాల్పడ్డాడు. నిందితుడు ఆర్మీలో పనిచేసి రిటైర్ అయిన 39 ఏళ్ల గురుమూర్తి! అతడి స్వస్థలం ఏపీలోని ప్రకాశం జిల్లా తూర్పాన్. పోలీసు వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. గురుమూర్తి, 13 ఏళ్ల క్రితం ప్రకాశం జిల్లాకే చెందిన ఉప్పాల వెంకటరమణ-సుబ్బమ్మ దంపతుల కుమార్తె వెంకట మాధవిని పెళ్లి చేసుకున్నాడు. వారికి పాప (10), బాబు (7) ఉన్నారు. రెండేళ్ల క్రితం గుర్తుమూర్తి ఉద్యోగ విరమణ చేశాడు. కంచన్‌బాగ్‌లోని ఓ సెక్యూరిటీ సంస్థలో పనిచేస్తున్నాడు. కుటుంబం మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ శ్రీవెంకటేశ్వరనగర్ కాలనీలో ఓ అద్దె ఇంట్లో ఉంటోంది. కొన్నాళ్లుగా భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న గురుమూర్తి, తరచూ గొడవపడుతూ తీవ్రంగా వేధిస్తున్నాడు. ఈనెల 13న కూడా భార్యతో గొడవపడి.. ఆమెను కత్తితో పొడిచి చంపాడు. ఆ మృతదేహాన్ని ముక్కలుగా కోసి.. కుక్కర్‌లో ఉడకబెట్టి, ఆ అవశేషాలను మూడు రోజుల పాటు ఇంట్లోనే ఎండబెట్టి.. దంచి.. ఆ పొడిని బకెట్‌లో వేసుకొని జిల్లెలగూడ చెరువులో పడేశాడు. భార్యను హత్య చేసిన మూడు రోజుల తర్వాత 16వ తేదీన గురుమూర్తి, నగరంలోనే మరోచోట ఉంటున్న తన అత్తగారైన సుబ్బమ్మకు ఫోన్ చేశాడు. మాధవి తనతో గొడవపడి ఇంట్లోంచి వెళ్లిపోయిందని నమ్మించాడు. అదే రోజు ఆమెతో కలిసి మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా భార్యను హత్యచేయాలనే పథకంలో భాగంగానే అతడు సంక్రాంతి సెలవుల పేరుతో ఇద్దరు పిల్లల్ని తన అత్తగారింటికి పంపించాడు. మాధవి ఆచూకీ కోసం స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజీని పోలీసులు పరిశీలించారు. 16న మాధవి ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయినట్లు ఏ ఫుటేజీలో కనిపించలేదు. దీంతో గురుమూర్తినే పోలీసులు అనుమానించి అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా మాధవిని తానే హత్య చేసినట్లు అతడు అంగీకరించినట్లు తెలిసింది. దీన్ని ఇంకా పోలీసులు ధ్రువీకరించడం లేదు. రేపోమాపో అతడిని మీడియా ముందుకు తీసుకువచ్చి వివరాలు వెల్లడించే అవకాశమున్నట్లు తెలిసింది.



గురుమూర్తి-వెంకట మాధవి దంపతులు(ఫైల్)

జన్మతః పౌరసత్వ హక్కు రద్దు ఉత్తర్వుపై

22 రాష్ట్రాలు కోర్టుకు



వాషింగ్టన్, జనవరి 22: పుట్టుకతో పౌరసత్వ హక్కును రద్దు చేస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వును సవాల్ చేస్తూ.. అమెరికాలో డెమొక్రాట్ల పాలనలో ఉన్న 22 రాష్ట్రాలు కోర్టులను ఆశ్రయించాయి. అమెరికాకు అక్రమంగా వలస వచ్చేవారికైనా.. సక్రమంగా విద్యార్థి/ఉద్యోగ/పర్యాటక వీసాపై వచ్చినవారికైనా అమెరికాలో పిల్లలు పుడితే వారికి ఆటోమేటిగ్గా ఆ దేశ పౌరసత్వం లభించేలా 1868లో 14వ రాజ్యాంగ సవరణ ద్వారా హక్కు కల్పించిన సంగతి తెలిసిందే. ఆ హక్కును రద్దు చేస్తూ ట్రంప్ తాజాగా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఆయన ఉత్తర్వు జారీ చేయగానే ఆ హక్కు రద్దు అయిపోదని.. ట్రంప్ సర్కారు దీనిపై చట్టపరమైన సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఒకవేళ రాజ్యాంగ సవరణ ద్వారా ఆ హక్కును రద్దు చేయాలనుకున్నా కూడా అది చాలా సుదీర్ఘమైన, సంక్లిష్టమైన ప్రక్రియ అని హక్కుల కార్యకర్తలు మంగళవారమే స్పష్టం చేశారు. వారి మాటలను నిజం చేస్తూ అమెరికాలోని 22 రాష్ట్రాల అటార్నీ జనరళ్లు రెండు కోర్టుల్లో వ్యాజ్యాలు వేశారు. జన్మతః పౌరసత్వ హక్కును రద్దు చేస్తూ ఉత్తర్వును ఇవ్వడం ద్వారా.. ప్రెసిడెంట్ తనకున్న అధికారాలను మీరారని, అమెరికా రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని ఆ వ్యాజ్యాల్లో పేర్కొన్నారు. ఆ ఉత్తర్వును అనుమతిస్తే.. ఏటా అమెరికాలో జన్మించే దాదాపు 1.5 లక్షల మంది వలసదారుల పిల్లలు పుట్టుకతో పౌరసత్వ హక్కును కోల్పోతారని ఆందోళన వెలిబుచ్చారు. అధ్యక్షుడికి ఎన్ని విస్తృత అధికారాలు ఉన్నప్పటికీ.. ఆయన రాజు కాదని, ఇష్టానుసారంగా చట్టాలను మార్చేయలేరని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. “ఒక్క సంతకంతో అధ్యక్షుడు 14వ రాజ్యాంగ సవరణ ఉనికినే లేకుండా చేయలేరు” అని న్యూజెర్సీ అటార్నీ జనరల్ మాట్ ప్లాట్‌కిన్ స్పష్టంచేయగా.. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను లాగేసుకునే అధికారం ప్రెసిడెంట్ ట్రంప్‌కు ఎంతమాత్రం లేదని మసాచుసెట్స్ అటార్నీ జనరల్ ఆండ్రియా జాయ్ క్యాంప్‌బెల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక, జన్మతః పౌరసత్వ హక్కు ద్వారానే అమెరికా పౌరసత్వం పొంది, అక్కడే పెరిగి, అమెరికాలో తొలి చైనీస్-అమెరికన్ అటార్నీ జనరల్‌గా ఎన్నికైన కనెక్టికట్ అటార్నీ జనరల్ విలియం టాంగ్ అయితే.. దీన్ని తన వ్యక్తిగత వ్యాజ్యంగా పరిగణిస్తానని పేర్కొన్నారు. డెమొక్రాట్ పాలిత రాష్ట్రాలతోపాటు.. అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ వంటి సంస్థలు, వలసదారులకు సంబంధించిన సంస్థలు, మార్చి నెలలో ఒక బిడ్డకు జన్మనివ్వబోతున్న తల్లి సైతం ఈ ఉత్తర్వుపై కోర్టుల్లో వ్యాజ్యాలు దాఖలు చేయడం గమనార్హం. అమెరికా ప్రజాప్రతినిధుల సభ సభ్యులు, భారత సంతతికి చెందిన ఆర్‌వో ఖన్నా, శ్రీతానేదార్, ప్రమీలా జయపాల్ కూడా ట్రంప్ ఉత్తర్వులను ఖండించారు. వైట్‌హౌస్ వర్గాలు మాత్రం.. ఈ కేసులను వామపక్షవాదుల ప్రతిఘటనకు పొడిగింపుగానే చూస్తామని, ఆయా రాష్ట్రాలను కోర్టుల్లోనే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించాయి. “ఏటికి ఎదురీది, ప్రజల కోరికను తిరస్కరించడమా లేక అధ్యక్షుడు ట్రంప్‌తో కలిసి ముందుకు సాగడమా.. ఈ రెండింటిలో ఏదో ఒకదాన్ని తీవ్ర భావజాలం ఉన్న వామపక్షవాదులు ఎంచుకోవచ్చు” అని వైట్‌హౌస్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ హారిసన్ వ్యాఖ్యానించారు.

రష్యాపై ఆంక్షలు తప్పవు : ట్రంప్

ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపే అంశంలో చర్చలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ రాకుంటే ఆ దేశంపై మరిన్ని ఆంక్షలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. కాగా, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మాట్లాడుతున్నామని, పుతిన్‌తోనూ త్వరలోనే మాట్లాడతామని ట్రంప్ వెల్లడించారు. అలాగే, ఉక్రెయిన్‌కు ఆయుధాలు పంపే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు, ఇక, ఉక్రెయిన్‌పై పోరును ఆపేందుకు రష్యాను ఒప్పించాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ఫోన్ కాల్ ద్వారా కోరానని ట్రంప్ తెలియజేశారు. కాగా, ఎల్‌జీబీటీలు, వలసదారులు నేరస్థులు కాదని, వాళ్లపై దయ చూపాలని వాషింగ్టన్ నేషనల్ కేథడ్రల్(చర్చి) బిషప్ మరియన్ ఎడ్గార్ బుడ్డే ట్రంప్‌ను కోరారు.

అమెరికాలో డీఈఐ సిబ్బంది ఇంటికి!

వాషింగ్టన్, జనవరి 22: డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ‘డైవర్సిటీ, ఈక్విటీ అండ్ ఇంక్లూజన్ (వైవిధ్యం, సమానత్వం, కలుపుకొనిపోయే తత్వం - డీఈఐ)’ సిబ్బందిని సాగనంపేందుకు సిద్ధమయ్యారు. డీఈఐ సిబ్బంది అందరినీ సెలవులో ఉంచాలని ఆదేశిస్తూ ట్రంప్ కార్యవర్గం ఉత్తర్వులు జారీ చేసింది. అమెరికా ఫెడరల్ ప్రభుత్వానికి చెందిన డీఈఐ కార్యక్రమాలను నిర్వీర్యం చేస్తూ ట్రంప్ కార్యనిర్వాహక ఆదేశాలపై సంతకం చేశారు. డీఈఐ సిబ్బంది అందరినీ బుధవారం సాయంత్రం 5 గంటల్లోగా (అమెరికా కాలమానం ప్రకారం) వేతనంతో కూడిన సెలవుపై పంపించాలని సంబంధిత ఏజెన్సీలకు ఆదేశాలు అందాయి. అనంతరం వారిని శాశ్వతంగా ఉద్యోగాల నుంచి తొలగించనున్నారు.

అమెరికాలోకి సమర్థులు రావడం అవసరం

హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్‌తోనే ఇది సాధ్యం: ట్రంప్

వాషింగ్టన్, జనవరి 22: దేశానికి సమర్థులు, గొప్ప వ్యక్తులు అవసరమని, అది హెచ్-1బీ వీసా ద్వారానే సాధ్యపడుతుందని ట్రంప్ అన్నారు. హెచ్-1బీ వీసాల అంశంపై తన మద్దతుదారుల్లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ట్రంప్ స్పందించారు. ఒరాకిల్ సీఈవో లారీ ఎల్లిసన్, సాఫ్ట్‌బ్యాంక్ సీఈవో మసయోషి సన్, ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌తో కలసి మంగళవారం ఆయన వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. “ఈ అంశంపై రెండు వైపుల వాదనలూ నాకు నచ్చాయి. సమర్థులైన వ్యక్తులు దేశంలోకి రావడాన్ని కూడా నేను ఇష్టపడతాను. ఇంజనీర్ల గురించి మాత్రమే కాదు... నేను అన్ని స్థాయిల వ్యక్తుల గురించి మాట్లాడుతున్నా” అని ట్రంప్ పేర్కొన్నారు. ‘వ్యాపారాలు విస్తరించుకోవడానికి సమర్థులైన, నైపుణ్యం కలిగిన వ్యక్తులు మన దేశంలోకి రావాలని కోరుకుంటున్నాం. నిజంగా సమర్థులైన, గొప్ప వ్యక్తులను మన దేశంలోకి రానివ్వాలి’ అని ట్రంప్ అభిప్రాయపడ్డారు.

పనామా కాలువ అమెరికా ఇచ్చిన బహుమతి కాదు : పనామా అధ్యక్షుడు ములినో

పనామా కాలువను వెనక్కి తీసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలపై పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో తీవ్రంగా స్పందించారు. పనామా కాలువ తమకు అమెరికా ఇచ్చిన బహుమతేం కాదని ఘాటుగా బదులిచ్చారు. పనామా కాలువలో చైనా కార్యకలాపాలు అధికమయ్యాయని, కాలువ చైనా అధీనంలో ఉందని, తాము పనామాకు ఇచ్చిన ఆ కాలువను వెనక్కి తీసుకుంటామని ట్రంప్ ఇటీవల పలు మార్లు ఆరోపించారు. అధ్యక్షుడిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా పనామా కాలువ అంశంపై మాట్లాడారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ఉన్న ములినో... అమెరికా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలకు స్పందించారు. పనామా కాలువను అమెరికా తమకు బహుమతిగా ఇవ్వలేదని, కాలువ చైనా అధీనంలో లేదని తేల్చిచెప్పారు.

లోకం తీరు



ట్రంప్ సుంకాలు విధిస్తే భయపడం, ఊరుకోం: ట్రుడో

కెనడా నుంచి దిగుమతయ్యే వస్తువులపై ఫిబ్రవరి 1 నుంచి 25 శాతం సుంకాన్ని వసూలు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై కెనడా అధ్యక్షుడు జస్టిన్ ట్రుడో దీటుగా స్పందించారు. ట్రంప్ సుంకాలు విధించినంత మాత్రానా భయపడమని, తామేంటో ఆయనకు చూపిస్తామని, కెనడా పౌరుల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేస్తామని స్పష్టం చేశారు. అలాగే, కెనడా నుంచి అమెరికాలోకి చొరబాట్లు విచ్చలవిడిగా జరుగుతున్నాయని, ఫెంటనిల్ రవాణా జరుగుతోందని ట్రంప్ చేసిన ఆరోపణలపైనా ట్రుడో స్పందించారు. సరిహద్దులో భద్రత పెంపు అంశంపై చర్చలు జరిపేందుకు కెనడా ఎప్పుడూ సిద్ధమేనని తెలిపారు. ఇక, కెనడాలోని సహజ వనరులను వినియోగించుకోకుండా అమెరికా బలమైన ఆర్థిక శక్తిగా నిలబడలేదనే విషయాన్ని ట్రంప్ మరచిపోకూడదని వ్యాఖ్యానించారు.

జాతి ప్రయోజనాలే మాకు ముఖ్యం : చైనా

చైనా నుంచి జరిగే దిగుమతులపై 10 శాతం సుంకం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై చైనా కూడా స్పందించింది. వాణిజ్య యుద్ధంలో విజేతలు ఉండరని తమ విశ్వాసమని, జాతి ప్రయోజనాలు కాపాడుకునేందుకు తాము కట్టుబడి ఉన్నామని చైనా విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి మావో నింగ్ పేర్కొన్నారు. ఫెంటనిల్ అనే డ్రగ్ చైనా నుంచి కెనడా, మెక్సికో మీదుగా అమెరికాలోకి వస్తుందని, సుంకాలు విధించడమే అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందని ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. కాగా, ఫెంటనిల్ రవాణా చేస్తూ పట్టుబడిన వారికి మరణశిక్ష విధించాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వద్ద ట్రంప్ ఇటీవల ప్రస్తావించారు.

టెన్షన్ టెన్షన్

25 ఏళ్లలోపు ఉద్యోగుల్లో తీవ్ర పని ఒత్తిడి!

ప్రతి 10 మందిలో 9 మందికి విపరీతమైన ఆందోళన

యువ ఉద్యోగులకు నిర్మాణాత్మక మద్దతు అవసరం

ఉద్యోగుల సహాయ సేవాసంస్థ ‘వన్ టు వన్’ వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 22: ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఎన్‌ఆర్ నారాయణమూర్తి, ఎస్ఎన్ సుబ్రమణ్యన్, లాంటివారు సుదీర్ఘ పనిగంటలు ఉండాలని, వారాంతాల్లోనూ పనిచేయాలని అభిప్రాయం వ్యక్తం చేసినా అందుకు యువత మానసికంగా సిద్ధంగా లేదేమో! దేశవ్యాప్తంగా యువ ఉద్యోగులంతా పని ఒత్తిడి కారణంగా మానసిక ఆరోగ్య సమస్యలతో పెను సవాళ్లు ఎదుర్కొంటున్నారట! ఈ మేరకు ‘వన్ టు వన్’ అనే ఉద్యోగుల సహాయ సేవాసంస్థ పేర్కొంది. ‘వన్ టు వన్’ కౌన్సెలింగ్ సెషన్ల డేటా ప్రకారం పాతికేళ్ల వయసు ఉద్యోగుల్లో ప్రతి 10 మందిలో తొమ్మిది మంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారట! 25 ఏళ్లలోపు ఉద్యోగుల్లో 90శాతం మంది, 45 ఏళ్లలోపు ఉద్యోగుల్లో 67శాతం ఒత్తిడితో ఆందోళనకు గురవుతున్నారని ఈ సంస్థ పేర్కొంది. యువ ఉద్యోగులకు నిర్మాణాత్మకమైన మద్దతు అవసరమని స్పష్టం చేసింది. నిరుడు జనవరి నుంచి నవంబరు దాకా పని చేసే చోట ఉద్యోగులు మానసికంగా ఎదుర్కొంటున్న సవాళ్ల మీద ‘వన్ టు వన్’ సంస్థ 83వేల కౌన్సెలింగ్ సెషన్లు, 12వేల సెలెక్టివ్ స్క్రీమింగ్స్, 42వేల అంచనాలను రూపొందించింది. ఉద్యోగుల్లో 59శాతం మందిలో తమకు తాము హాని చేసుకునే లక్షణాలను గుర్తించిన మేనేజర్లు, సహాయం కోసం రిఫర్ చేసినట్లు వన్ టు వన్ నివేదిక వెల్లడించింది. ఉద్యోగుల కుటుంబీకుల్లో చాలామంది తీవ్ర ఒత్తిడితో బాధపడుతూ ఆత్మహత్య గురించి ఆలోచిస్తున్నారని నివేదిక పేర్కొంది. ఉద్యోగుల్లో 45ఏళ్లలోపు వారికన్నా 30 ఏళ్లలోపు వారు తీవ్ర డిప్రెషన్, ఆందోళనతో బాధపడుతున్నట్లు వెల్లడించింది.

ఢిల్లీలో ఆప్ ఓటమి ఖాయం: మోదీ



న్యూఢిల్లీ, జనవరి 22: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి ఓటమి తప్పదని ప్రధాని మోదీ చెప్పారు. అందుకే ఆపద (ఆప్) పార్టీ నేతలు పూటకో కొత్త హామీ ఇస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఢిల్లీ బీజేపీ కార్యకర్తలతో మోదీ ఆన్‌లైన్ ద్వారా సంభాషించారు. 50శాతానికి పైగా ఓట్లు పడేలా బీజేపీ నేతలు, బూత్ కార్యకర్తలు లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని ఆయన సూచించారు. నిత్యావసరాలు, కనీస అవసరాలు అందక ఢిల్లీ ప్రజలు కష్టాలు పడుతుంటే కేజ్రీవాల్ శీశ్‌మహల్ వంటి భవనం కట్టుకున్నారని మోదీ ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఢిల్లీని అభివృద్ధి చెందిన రాజధాని నగరంగా తీర్చిదిద్దుతామని ప్రధాని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా.. ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌లపై చెరి రూ.50 కోట్ల మేర పరువు నష్టం దావా వేయబోతున్నట్లు బీజేపీ ఎంపీ పర్వేశ్ వర్మ ప్రకటించారు. పంజాబీలు దేశానికి ప్రమాదకరంగా మారారని తాను అన్నట్లుగా దుష్ప్రచారం చేస్తున్నందుకే ఈ దావా వేస్తున్నట్లు తెలిపారు.

నెత్తురోడిన రైలు పట్టాలు.. 12 మంది దుర్మరణం

(మొదటి పేజీ తరువాయి)



ప్రమాదం జరిగిన స్థలంలో రైలు ప్రయాణికులు

సుమారు 50 మంది ప్రయాణికులు రైలు లోంచి కిందకు దిగారు. పుష్పక్ ఎక్స్‌ప్రెస్ సరిగ్గా ఓ భారీ కల్వర్టు వద్ద ఆగడంతో.. ఒక వైపు సేఫ్టీవాల్, లోయను తలపించే కాలువ.. మరోవైపు రెండో ట్రాక్ ఉన్నాయి. దీంతో.. ప్రయాణికులు ట్రాక్ ఉన్న వైపు దిగి.. నిప్పురవ్వలు వచ్చిన ప్రాంతాన్ని పర్యవేక్షిస్తూ.. అక్కడే నిలబడ్డారు. అంతలో మృత్యుశకటంగా కర్నాటక ఎక్స్‌ప్రెస్ వారు నిలబడ్డ ట్రాక్ వైపు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో దూసుకువచ్చింది. ప్రయాణికులు తేరుకుని, పక్కకు తప్పుకొనేలోపే.. ట్రాక్‌పై ఉన్నవారిని ఢీకొంటూ.. వారిని కొంత దూరం ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనలో 12 మంది అక్కడికక్కడే మృతిచెందారు. మృతుల్లో పదేళ్ల వయసున్న ఓ బాలుడితోపాటు.. ముగ్గురు మహిళలున్నారు. మరో 10 మందికి గాయాలయ్యాయి. మిగతావారు జరిగిన దారుణాన్ని అర్థం చేసుకునేలోపు.. మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. పలు మృతదేహాల చేతులు, కాళ్లు తెగి.. రక్తపు ముద్దలు ట్రాక్‌పై దర్శనమిస్తూ.. బీభత్సమైన దృశ్యాలు కనిపించాయి. పోలీసులు కూడా తొలుత 11 మంది మృతి చెందారని భావించారు. అయితే.. ఆస్పత్రిలో శరీర భాగాలను మృతదేహాల వారీగా జతచేయగా.. 12 మంది చనిపోయినట్లు తేలిందని ఎస్పీ మహేశ్వర్ రెడ్డి వివరించారు. క్షతగాత్రులను పచోరాలోని బృందావన్ ఆస్పత్రికి తరలించారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని మహారాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. సంఘటనాస్థలిని జల్గావ్ ఎంపీ స్మితావాఘ్, మాజీ ఎంపీ ఉన్మేశ్‌పాటిల్, జిల్లా కలెక్టర్ ఆయుష్ ప్రసాద్, ఐజీ దత్తాత్రేయ కరాలే సందర్శించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. అగ్నిప్రమాదమేమీ జరగలేదని, కేవలం వదంతులతోనే దారుణం జరిగిందన్నారు. మృతులంతా జనరల్ కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణిస్తున్నవారేనని వివరించారు. ఈ ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. “ఘటన సమాచారం అందగానే ఎనిమిది అంబులెన్స్‌లను పంపించాం. మంత్రి గిరీశ్ మహాజన్, ఇతర అధికారులు సంఘటనాస్థలికి చేరుకున్నారు. క్షతగాత్రులకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో మెరుగైన చికిత్స అందిస్తున్నాం” అని ఎక్స్‌లో పోస్టు చేశారు. మహారాష్ట్ర సర్కారు తరఫున మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందిస్తామన్నారు.

గాజా మళ్లీ కోలుకుంటుందా?

ఎటు చూసినా యుద్ధఛాయలే.. కుప్పకూలిన భవంతులు, ధ్వంసమైన రోడ్లు

శిథిలాలను తొలగించాలంటేనే 1.2 బిలియన్ డాలర్ల ఖర్చు

గాజా అభివృద్ధి 69 ఏళ్లు వెనక్కి: ఐరాస



గాజాలో ఇజ్రాయెల్ దాడులతో నేలమట్టమై మట్టి కుప్పలుగా మిగిలిపోయిన భవనాలు

న్యూఢిల్లీ, జనవరి 22: గాజాలో ఎటు చూసినా విధ్వంస ఛాయలే. కుప్పలుగా పేరుకుపోయిన శిథిలాలు, కూలిపోయిన లక్షల భవంతులు, ధ్వంసమైన రోడ్లు అక్కడ దర్శనం ఇస్తున్నాయి. ఈ ప్రాంతం పునర్నిర్మాణం సాధ్యమేనా? ఎంత సమయం పడుతుంది? ఎంత ఖర్చు అవుతుంది.? కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత ఈ ప్రశ్నలు ఇప్పుడు ఉదయిస్తున్నాయి. గాజా కోలుకోవాలంటే దశాబ్దాల కాలం పడుతుందని ఐక్యరాజ్యసమితి తాజాగా తేల్చి చెప్పింది. దిగ్బంధనాలు కొనసాగితే.. యుద్ధానికి ముందు ఆర్థిక పరిస్థితికి చేరడానికి గాజాకు కనీసం 350 ఏళ్లు పడుతుందని ఐరాస అంచనా వేసింది. తాజాగా వేసిన అంచనాల ప్రకారం 10 శాతం ఆర్థిక వృద్ధి ఉంటుందని భావిస్తే.. 2050 నాటికి గత పరిస్థితికి గాజా చేరుకుంటుందని పేర్కొంది. అది కూడా మిలటరీ చర్యలు లేకుండా, సరుకుల రవాణా స్వేచ్ఛగా జరిగి, పెట్టుబడులు వచ్చి, ఏటా 2.8%జనాభా పెరుగుదల ఉన్నపుడు మాత్రమే సాధ్యమని అభిప్రాయపడింది.

శిథిలాల తొలగింపునకు 21 ఏళ్లు..

ఇక్కడి భవన శిథిలాల తొలగింపుపై ఇటీవల ఐరాస ఒక అంచనా వేసింది. యుద్ధం కారణంగా పేరుకుపోయిన 50 మిలియన్ టన్నుల భవనాల శిథిలాల తొలగింపునకు కనీసం 21 ఏళ్లు పడుతుందని, 1.2 బిలియన్ డాలర్లు ఖర్చు అవుతుందని లెక్కగట్టింది. హింస కారణంగా గాజా అభివృద్ధి 69 ఏళ్లు వెనక్కి పోయిందని ఐరాస అభివృద్ధి కార్యక్రమం అధికారి ఒకరు చెప్పారు. 2023 అక్టోబరు 7న హమాస్ టెర్రరిస్టులు ఇజ్రాయెల్‌పై దాడితో గాజాలో యుద్ధం మొదలైన విషయం తెలిసిందే. ఇజ్రాయెల్ లెక్కల ప్రకారం హమాస్ దాడుల్లో 1,200 మంది ఇజ్రాయెలీలు కన్నుమూశారు. గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం ఆ ప్రాంత పౌరులు 46 వేల మంది చనిపోయారు.

ఇళ్ల నిర్మాణం ఇప్పట్లో సాధ్యపడదు..

కూలిపోయిన ఇళ్ల పునర్నిర్మాణం ఇప్పట్లో సాధ్యపడదని గతేడాదే ఐరాస వెల్లడించింది. గత డిసెంబరులో యూఎన్ శాటిలైట్ డేటా ప్రకారం యుద్ధానికి ముందు ఉన్న భవనాల్లోని మూడింట రెండువంతులు.. అంటే 1.70 లక్షలకు పైగా ధ్వంసమయ్యాయి లేదా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం 18 లక్షల మంది ప్రజలకు వెంటనే ఆవాసాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఐరాస మానవతా సంస్థ అంచనాల ప్రకారం కనీసం 68 శాతం రోడ్డు నెట్‌వర్క్ నాశనమైంది. 75 శాతం పైగా నీటి పంపిణీ వ్యవస్థ దెబ్బతింది. ఇక శరణార్థులు ఎక్కువగా నివసించే ఉత్తర గాజాలోని జబాలియా పట్టణం మొత్తం శిథిలాల కుప్పగా మారిపోయింది. ఇజ్రాయెల్ దాడులతో గాజాలో సగానికి పైగా వ్యవసాయ భూమి ధ్వంసమైంది. 95 శాతానికి పైగా పశువులు, గొర్రెలు మృత్యువాత పడ్డాయి.

ఉద్యోగాలు ఇప్పిస్తామని

మోసం చేశారు

» టీడీపీ గ్రీవెన్స్‌లో బాధితుల ఫిర్యాదులు

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు, రుణాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని, మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. వైసీపీ నేతల అండతో భూ కబ్జాలకు పాల్పడిన వారిపైనా విచారణ జరపాలని మరికొందరు విజ్ఞప్తి చేశారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి పార్థసారథి అర్జీలు స్వీకరించారు. కృష్ణా జిల్లా ఉత్తర చిరువోలులంకకు చెందిన ఉప్పాల అనిల్‌కుమార్ 'మోర్ల మహీధర్... మాజీ మంత్రి జోగి రమేశ్‌కు అత్యంత సన్నిహితుడు. గృహ నిర్మాణ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని భరోసా ఇచ్చాడు. రూ.16 లక్షలు తీసుకుని, మోసం చేశాడు. దీనిపై పోలీసులను ఆశ్రయిస్తే కేసు తీసుకోలేదు' అని వాపోయారు. భీమవరం కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఆదినారాయణరెడ్డి ఉద్యోగం ఇప్పిస్తానని రూ.9.50 లక్షలు తీసుకుని, మోసం చేశారని తాడేపల్లికి చెందిన కేఎస్ ప్రియ ఫిర్యాదు చేశారు. 'వైసీపీ నేత భైరెడ్డి సిద్దార్థరెడ్డి అనుచరుడు వర్రా సాగర్‌రెడ్డి బ్యాంక్‌లో పనిచేస్తున్నానని చెప్పి నమ్మించాడు. లోన్ ఇప్పిస్తానని నా ఖాతాలోని సొమ్ము కాజేశాడు' అని గుంటూరుకు చెందిన గంజరపల్లి చిన్నయ్య ఫిర్యాదు చేశారు.

తిరుపతి తొక్కిసలాటపై

న్యాయవిచారణ కమిషన్

» హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణ మూర్తి సారథ్యం

» ఆరు నెలల్లో నివేదిక ఇవ్వాలి

» సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు



తిరుపతిలో ఈ నెల 8వ తేదీ రాత్రి వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సందర్భంగా తొక్కిసలాట జరిగిన క్యూలైన్ (ఫైల్)

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మరణించిన ఘటనపై రాష్ట్రప్రభుత్వం న్యాయ విచారణకు రాష్ట్రప్రభుత్వం ఆదేశించింది. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణ మూర్తి నేతృత్వంలో న్యాయ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) చరిత్రలో ఎన్నడూ లేని విధంగా టోకెన్ల జారీ క్యూలైన్‌లో ఆరుగురు మరణించడం ఇదే తొలిసారి. ఈ నెల 8వ తేదీన జరిగిన ఈ సంఘటనను అత్యంత తీవ్రంగా పరిగణించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హుటాహుటిన తిరుపతి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఇద్దరు అధికారుల సస్పెన్షన్, ముగ్గురు అధికారుల బదిలీలు కూడా వెంటవెంటనే జరిగాయి. బాధిత కుటుంబాలకు టీటీడీ తరఫున నష్టపరిహారం సైతం చెల్లించారు. ఈ ఘటనపై న్యాయవిచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి అప్పుడే ప్రకటించారు. దాని ప్రకారం ఇప్పుడు మాజీ న్యాయమూర్తితో విచారణకు ఆదేశాలు జారీ అయ్యాయి. తిరుపతిలోని పద్మావతి పార్క్ వద్ద జరిగిన ఈ తొక్కిసలాటలో వైకుంఠ ఏకాదశి దర్శనానికి టోకెన్ల కోసం ఎదురుచూస్తున్న ఆరుగురు భక్తులు మరణించడానికి దారి తీసిన పరిస్థితులేమిటో కమిషన్ విచారణ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 'టోకెన్ల పంపిణీకి సరైన ఏర్పాట్లు చేశారో లేదో గుర్తించాలి.. ఏకాదశి ఏర్పాట్లలో ఏవైనా లోటుపాట్లు ఉన్నాయా..? ఎలాంటి లోపాలున్నాయి..? అందుకు కారణమైన వ్యక్తులను గుర్తించాలి. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు జరగకుండా ఏం చర్యలు తీసుకోవాలి.. శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమల సందర్శించే భక్తులకు ఎలాంటి భద్రత కల్పించాలి.. సంస్థాగతంగా ఎలాంటి మార్పులు చేయాలి.. టీటీడీ ఉద్యోగులను ఏ విధంగా సన్నద్ధం చేయాలన్న దానిపైనా కమిషన్ సిఫారసులు చేయాలి' అని సూచించారు. బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఆరు నెలల్లో విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. న్యాయ విచారణ కమిషన్‌కు సివిల్ కోర్టుకు ఉండే అధికారాలను ప్రభుత్వం కట్టబెట్టింది.

రేపటి నుంచి విశాఖలో ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు

విశాఖపట్నం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఈ నెల 24,25,26 తేదీల్లో ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని బీజేపీ మాజీ ఎమ్మెల్సీ, స్వాగత సమితి ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 25న ఏబీవీపీ కార్యకర్తలతో శోభాయాత్ర జరుగుతుందన్నారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి యాచంద్ర మాట్లాడుతూ సంస్థ ఏర్పాటై 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా త్వరలో 'పంచ పరివర్తన్' పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా రామచంద్రమోహన్

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా కె.రామచంద్రమోహన్ నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం జరిగిన ఐఏఎస్ బదిలీల్లో కమిషనర్ ఎస్.సత్యనారాయణను ప్రభుత్వం బదిలీ చేసింది. కొత్త కమిషనర్‌ను నియమించే వరకూ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఆ శాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్ర మోహన్‌కు బాధ్యతలు అప్పగించింది.

ఆలయ కమిటీలోకి రిటైర్డ్ ఈఈ యూప రావు

వారసత్వ ఆలయాల అభివృద్ధికి, పురాతన కట్టడాలను రక్షించేందుకు ప్రభుత్వం గతంలో నియమించిన కమిటీలో జల వనరుల శాఖ రిటైర్డ్ ఈఈ ఉప్పలపాటి ఎ.రావుకు తాజాగా స్థానం కల్పించింది. ఈమేరకు దేవదాయ శాఖ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'సూర్యఘర్'తో డబ్బు ఆదా

» సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుతో సొంతంగా విద్యుత్ ఉత్పత్తి

» అనువైన ఇళ్లు, ప్రభుత్వ భవనాల్లో ఏర్పాటుకు చర్యలు

» ప్రజల్లో అవగాహన కల్పించాలి

» రాష్ట్ర స్థాయి సమావేశంలో సీఎస్



పీఎం సూర్య ఘర్ పథకంపై నిర్వహించిన రాష్ట్ర కో ఆర్డినేషన్ సమావేశంలో సీఎస్ విజయానంద్

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను ఆదేశించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన, ప్రధాన మంత్రి- కుసుమ్ పథకాలకు సంబంధించి బుధవారం అమరావతి సచివాలయంలో సీఎస్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. సీఎస్ మాట్లాడుతూ... సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుతో సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. జాతీయ స్థాయిలో నేషనల్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీ(ఎన్‌పీఐఏ), రాష్ట్ర స్థాయిలో స్టేట్ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీలు(ఎస్ఐఏ) ఈ పథకాన్ని అమలు చేస్తాయని తెలిపారు. ఈ పథకం కింద డిస్కమ్‌లు తమ పరిధిలో రూఫ్‌టాప్ సోలార్‌ను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. ప్రజలు పెద్దఎత్తున ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం మండలం నడిమూరు, తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లె గ్రామాలను మోడల్ సోలార్ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రతిపాదించిందని వెల్లడించారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో 5 గ్రామాలను మోడల్ సోలార్ గ్రామాలుగా పైలెట్ ప్రాజెక్టు కింద తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్ణయించిందని తెలిపారు. పీఎం సూర్యఘర్ యోజన కింద 2 కిలో వాట్ సామర్థ్యం గల సిస్టమ్‌లకు సోలార్ యూనిట్ ధరలో 60 శాతం, 2 నుంచి 3 కిలోవాట్ సామర్థ్యం సిస్టమ్‌లకు అదనపు సిస్టమ్ ఖర్చులో 40 శాతం సబ్సిడీని, 3 కిలోవాట్ వరకూ రూ.78 వేల వరకూ కేంద్ర ప్రభుత్వం రాయితీగా అందిస్తుందన్నారు. దరఖాస్తుదారు సోలార్ ప్యానెళ్లను అమర్చుకోవడానికి అనువైన పైకప్పు ఉన్న ఇల్లు, విద్యుత్ కనెక్షన్ కలిగి ఉండాలన్నారు. గృహాలతో పాటు ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, కళాశాలలు తదితర వాటిపై సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని ట్రాన్స్‌కో అధికారులను సీఎస్ ఆదేశించారు. ప్రధాన మంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్(పీఎం- కుసుమ్) పథకం కింద వ్యవసాయ రంగంలో సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 20 లక్షలా 17 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, విద్యుత్ ఫీడర్ల స్థాయిలో లక్ష సోలార్ విద్యుత్ పంపు సెట్లు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిందన్నారు. మరో 2 లక్షల సోలార్ పంపు సెట్లకు కూడా కేంద్రం అనుమతించిందని చెప్పారు. అంతకుముందు ఏపీ జెన్కో ఎండీ చక్రధర్‌బాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలుకు సంబంధించిన వివిధ మార్గదర్శకాలను వివరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సామాన్యులూ సంపన్నులూ

ఆర్థిక అసమానతలు మూడు విధాలుగా కనిపిస్తాయి: భిన్న ఖండాలు, వేర్వేరు దేశాలలోని సమాజాల మధ్య వ్యత్యాసాలు; ఒక దేశం లేదా ఒక రాష్ట్రంలోని పట్టణాలు, పల్లెల మధ్య తేడాలు; ఒక సామాజిక సమూహంలోని అత్యధికులు అయిన పేదలు, స్వల్ప సంఖ్యలో ఉండే ధనికుల మధ్య అంతరాలు. మానవాళి ప్రస్థానాన్ని పరిశీలిస్తే మూడోరీతి అసమానతలు నాగరికత ప్రభవించిన నాటి నుంచే ఆరంభమయ్యాయని, అవి కాలక్రమేణా పెరిగాయని, ఇప్పటికీ తీవ్రమవుతూనే ఉన్నాయని అర్థమవుతుంది. మరి మొదటి తరహా అసమానతలకు వలసవాద పాలన కారణమన్న భావన సబబైనదేనని ఆర్థికవేత్తలు, చరిత్రకారులు అంటున్నారు. వలసవాద పాలన నుంచి లబ్ధి పొందినవి పాశ్చాత్య దేశాలు, నష్టపోయినవి ప్రాచ్య దేశాలు. ఆసియా, ఆఫ్రికా దేశాలపై యూరోపియన్ రాజ్యాల వలసవాద ఆధిపత్యమే అవి సంపద్వంతం కావడానికి విశేషంగా దోహదం చేసింది. శతాబ్దాల పాటు ఆ పాశ్చాత్య దేశాలు ప్రాచ్య దేశాలను అన్ని విధాల దోపిడీ చేసి అణచివేశాయి. స్పెయిన్, పోర్చుగీస్, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, నెదర్లాండ్స్, బెల్జియం, జర్మనీ, రష్యా మొదలైన యూరోపియన్ దేశాలేకాక, ఆధునిక యుగంలో తొలుత వలసవాద పాలనకు గురైన అమెరికా సైతం ఈ ధరిత్రిపై ఏదో ఒక ప్రాంతాన్ని దురాక్రమించాయి. 1765–1900 సంవత్సరాల మధ్య మన దేశం నుంచి బ్రిటన్ 64.82 ట్రిలియన్ పౌండ్ల విలువైన ఆస్తులను తరలించుకుపోయింది. ఇందులో 38.8 ట్రిలియన్ పౌండ్ల మేరకు ఆ దేశంలోని పదిశాతం సంపన్నులు లబ్ధి పొందారు. మన దేశంలో కొల్లగొట్టిన ధనరాశులే ఇంగ్లాండ్‌ను సంపద్వంతం చేశాయి.

వలసవాద ఆధిపత్యం ఒక చారిత్రక దురాగతం మాత్రమే కాదు, అది వర్తమాన ప్రపంచాన్నీ పీడిస్తున్న అధర్మం. ఈ సత్యాన్నే ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ (ప్రపంచ వ్యాప్తంగా పేదరికం నిర్మూలన లక్ష్యంగా పనిచేస్తున్న 21 స్వతంత్ర ప్రభుత్వేతర సంస్థల సమాఖ్య) తాజా నివేదిక 'టేకర్స్, నాట్ మేకర్స్: ద అన్‌జస్ట్ పావర్టీ అండ్ అన్‌ఎర్న్‌డ్ వెల్త్ ఆఫ్ కలోనియల్ ఇన్హెరిటన్స్' విపులంగా విశదీకరించింది. ఆధునిక బహుళజాతి సంస్థలన్నీ ఒకనాడు మన దేశాన్ని పీడించి పాలించిన ఈస్టిండియా కంపెనీ లాంటివేనని ఆ నివేదిక స్పష్టం చేసింది. పేద దేశాల సహజ వనరులను, శ్రమశక్తిని విపరీతంగా దోపిడీ చేయడం వల్లనే వాటి మాతృదేశాలు సిరిసంపదలతో తులతూగుతున్నాయని నివేదిక పేర్కొంది. సామాన్యుల శ్రేయస్సును ఉపేక్షించి, అతి కొద్దిమంది సంపన్నుల ప్రయోజనాలను కాపాడే విధంగా దేశ దేశాల ఆర్థికవ్యవస్థలను అవి ప్రభావితం చేశాయని, చేస్తున్నాయని, తత్కారణంగానే ఆర్థిక అసమానతలు అంతులేని రీతిలో పెచ్చరిల్లిపోతున్నాయని ఆక్స్‌ఫామ్ తెలిపింది. 2024లో బిలియనీర్ల ఆస్తులు 2023లో కంటే మూడు రెట్లు పెరిగాయి. ఒక సంవత్సర కాలంలో మహా కుబేరుల మొత్తం ఆస్తులు 2 లక్షల కోట్ల డాలర్లకు పైగా పెరిగాయి. ఇదే కాలంలో 204 మంది కొత్త బిలియనీర్లు ఆవిర్భవించారు. ఈ మహా కుబేరులు ఎలా ప్రభవించారు? వారి అపార ధనరాశులు ఎలా వచ్చాయి? ఆ వేల కోట్ల ఆస్తులు వారు కష్టపడి సంపాదించుకున్నవి కాదని, అవి వారు ఆర్జించని ఆస్తులేనని ఆ నివేదిక పేర్కొంది. వారసత్వం, గుత్తాధిపత్యం, ఆశ్రిత పక్షపాతం ద్వారా వారికి ఆ ఆస్తులు సమకూరాయి. పూర్తిగా అవినీతి మార్గాలలోనే వారు బిలియనీర్లు కావడం జరిగింది. పచ్చి నిజం ఏమిటంటే తమకే పూర్తిగా అనుకూలంగా ఉండేలా రాజకీయ, ప్రభుత్వ వ్యవస్థలను వారు అన్నివిధాల ప్రభావితం చేయగలుగుతున్నారు. ఈ పరిణామాలు సామాన్యులు, సంపన్నుల మధ్య, పేద, ధనిక దేశాల మధ్య ఆర్థిక అసమానతలను పెంచుతున్నాయి. సామాన్యులు పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నారు. సంపన్న దేశాలలోని 1 శాతం ధనికులకు పేద దేశాల వారు గంటకు 30 మిలియన్ డాలర్లు చెల్లిస్తున్నట్టు పారిస్‌లోని ఇనెక్వాలిటీ ల్యాబ్ పరిశోధకులు ధ్రువీకరించినట్టు ఈ నివేదిక పేర్కొంది. సంపన్న దేశాలు చేస్తున్న ప్రతి ఒక డాలర్ సహాయానికి పేద దేశాలు నాలుగు డాలర్లు చెల్లిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఆర్థిక అసమానతలు పెరిగిపోకుండా ఎలా ఉంటాయి? కనుకనే రాజకీయ వలసాధిపత్యం నుంచి ఏనాడో విముక్తమైన ఎన్నో దేశాలు నేడు ఆర్థిక వలసాధిపత్యానికి అణగారిపోతున్నాయి.

ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పరిపూర్తి గడువు (2030 సంవత్సరం) సమీపిస్తున్నది. ఆ లక్ష్యాల పరమార్థమైన ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని మానవాళి సాధించుకోగలుగుతుందా? ఒక సమాజంలోని సకల వ్యక్తులు, జనసముదాయాలు తమ ప్రాకృతిక, సామాజిక వనరులను వినియోగించుకోవడంలో సమరీతిలో భాగస్వాములు కావడమే ఆర్థిక ప్రజాస్వామ్యం. ఈ సముదాత్త పరిస్థితిని నెలకొల్పుకునేందుకై తొలుత ఆర్థిక అసమానతలను గణనీయంగా తగ్గించుకునేందుకు అన్ని ప్రభుత్వాలు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని నివేదిక పేర్కొంది. ఒకనాడు వలసాధిపత్యం చెలాయించిన దేశాలన్నీ తాము చేసిన అన్యాయాలన్నిటికీ బాధిత దేశాలకు క్షమాపణలు చెప్పాలి. చారిత్రక మనస్తాపాలు విస్మరించి అన్ని దేశాలు కలసికట్టుగా సాగడానికి ఈ చర్య ఒక నైతిక వాతావరణాన్ని సృష్టిస్తుంది. మరింత ముఖ్యంగా, పేద దేశాలు ప్రాంతీయ సహకార సంస్థలుగా ఏర్పడి ధనికదేశాలపై ఆధారపడకుండా ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రాధాన్యమివ్వాలని ఆక్స్‌ఫామ్ సూచించింది.

యువత భవితకు కొత్త బాటలు

ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి నారా లోకేశ్ యువతలో స్ఫూర్తి నింపుతున్నారు, వారి భవితకు బంగారు బాటలు వేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న దావోస్ పారిశ్రామికవేత్తల సమావేశంలో లోకేశ్ పెట్టుబడులను రాబట్టే ప్రతిపాదనలు చేశారు. కూటమి ప్రభుత్వం ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలను అమలు చేస్తోందని, పారిశ్రామిక ప్రోత్సాహకాలతోపాటు, పక్షం రోజుల్లో అనుమతులు అందజేస్తున్నామని చెప్పారు. దీని కోసం ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రత్యేక వ్యవస్థను సిద్ధం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డీప్ టెక్ రంగాల్లో అధునాతన ఆవిష్కరణల కోసం ఏపీ విశ్వవిద్యాలయాలతో కలసి స్విస్ పరిశోధన సంస్థలు పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఉన్నత విద్యావంతుడు విద్యాశాఖమంత్రి కావడంతో స్వల్పకాలంలోనే ఉన్నత విద్యారంగాన్ని గాడిలో పెట్టడమే లక్ష్యంగా చర్యలు చేబట్టారు. ఉపాధి కల్పనే లక్ష్యంగా సంస్కరణలు తీసుకొచ్చారు. రాబోయే అయిదేళ్లలో వర్శిటీల పాలన ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతుందనే నమ్మకాన్ని నింపగలిగారు. విశ్వవిద్యాలయాల్లో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న సుమారు 3,300 పోస్టుల భర్తీకి రూట్ మ్యాప్ రూపొందించారు. అనుసంధన్ ప్రాజెక్ట్ కింద పరిశోధనల ప్రోత్సాహానికి ఐదు విశ్వవిద్యాలయాలను గుర్తించారు. ఏ విద్యార్థీ నిరుద్యోగిగా ఉండరాదన్న లక్ష్యంతో 2025–26 విద్యా సంవత్సరం నుంచి పరిశ్రమల అవసరాలు, సామాజిక అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాల్లో మార్పులు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధి కల్పనే లక్ష్యంగా డిజిటలైజేషన్‌కు పెద్దపీట వేశారు. పూర్వోదయ పథకం కింద రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో అకడమిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను బలోపేతం చేసేందుకు రూ.3,324కోట్ల ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఆంధ్రా మోడల్ ఎడ్యుకేషన్ దిశగా పాఠశాల విద్యలో సంస్కరణలు తీసుకొచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి 16,437 టీచర్ పోస్టులు భర్తీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. దీనికి తోడు కనీస మౌలిక సదుపాయాల కల్పన, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు.



యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా నైపుణ్యాభివృద్ధికి చర్యలు చేపట్టి అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు మంత్రి నారా లోకేశ్. పెద్దఎత్తున తరలివస్తున్న పరిశ్రమల అవసరాలకు తగిన విధంగా యువతలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు దేశంలోనే తొలిసారిగా స్కిల్ సెన్సస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్కిల్ డెవలప్‌మెంట్ శాఖలో రాబోయే ఆరునెలల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై లోకేశ్ రూట్ మ్యాప్ ఇచ్చారు.

మద్రాస్ ఐఐటీతో కలిసి విద్యాశక్తి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేలా చర్యలు చేపట్టారు. నైపుణ్యాలను మెరుగుపరచడానికి డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మెరుగుదల, ఫిజికల్, వర్చువల్ విద్యను అమల్లోకి తీసుకురానున్నారు. ఏపీని ఐటీ హబ్‌గా మార్చే దిశగా మంత్రి లోకేశ్ తనదైన కృషి చేస్తున్నారు. డీప్‌టెక్‌ను అభివృద్ధి చేసి తద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని నిర్ణయించారు. ఇన్నొవేషన్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఇటీవల ఫిజిక్స్‌వాలాతో ఎంఓయు కుదుర్చుకున్నారు. గూగుల్ క్లౌడ్, టీసీఎస్ వంటి దిగ్గజ కంపెనీలు రాష్ట్రంలో యూనిట్లను స్థాపించేందుకు ముందుకు వచ్చాయి. 2024–29 సంవత్సరాలకు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్స్ తయారీ విధానం, ఆంధ్రప్రదేశ్ సెమీకండక్టర్, డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ, ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ పాలసీ, ఆంధ్రప్రదేశ్ డేటా సెంటర్ పాలసీలను ప్రకటించారు. మంత్రి లోకేశ్ చొరవతో రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో రూ.40 వేల కోట్ల పెట్టుబడులకు టాటా గ్రూప్ సిద్ధమైంది. రాష్ట్రంలో రూ.65 వేల కోట్లతో 500 కంప్రెస్డ్ బయో గ్యాస్ యూనిట్ల స్థాపనకు రిలయన్స్ ఎనర్జీ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. రెండు దశలుగా రాబోయే పదేళ్లలో రాష్ట్రంలో రూ.1,40,000 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఆర్సెలర్ మిట్టల్, నిప్పాన్ స్టీల్ జాయింట్ వెంచర్ ముందుకు వచ్చింది.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా నైపుణ్యాభివృద్ధికి చర్యలు చేపట్టి అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు లోకేశ్. గత అక్టోబర్‌లో లోకేశ్ అమెరికాలో పర్యటించి రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకురావడంలో సఫలీకృతమయ్యారు. అందువల్లే పెద్దఎత్తున తరలివస్తున్న పరిశ్రమల అవసరాలను ఆయన గుర్తించారు. అందుకు తగిన విధంగా యువతలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు దేశంలోనే తొలిసారిగా స్కిల్ సెన్సస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌శాఖలో రాబోయే ఆరునెలల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై మంత్రి లోకేశ్ రూట్ మ్యాప్ ఇచ్చారు.

ఇది ఇలా వుండగా సామాన్యులకు అండగా మంత్రి నారా లోకేశ్ ప్రజాదర్బార్‌తో భరోసాగా నిలిచారు. ప్రజాదర్బార్ తలుపుతట్టిన వారికి తోడుగా నిలుస్తున్నారు. బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి ఏజెంట్ల చేతిలో మోసపోయిన వారికి నేనున్నానంటూ లోకేశ్ అండగా నిలిచారు. రాష్ట్రాన్ని మునుముందుకు తీసుకుపోవడంలో నేను సైతం అంటూ అహర్నిశలూ శ్రమపడుతున్న లోకేశ్ ప్రజల గుండెల్లో చోటు సంపాదించుకున్నారు.

○ దాసరి శ్యామ్‌చంద్రశేషు
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి

ట్రంప్ దూకుడుతో వరుస షాక్‌లు!

రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన డోనాల్డ్ ట్రంప్ స్పీడ్‌ని ఏ స్పీడోమీటర్లూ కొలవలేవు. పదవీ బాధ్యతలు తీసుకున్న తక్షణమే టన్నుల కొద్దీ నిర్ణయాలు చకచకా తీసుకున్నారు. కొన్ని ఎన్నికల్లో చెప్పినవీ.. మరికొన్ని అప్పటికప్పుడే చెప్పినవి. ఆయన సంతకాలతో దేశం లోపలా, బయటా షాకులే! అమెరికాను మళ్లీ ఘనత పొందిన దేశంగా చేస్తానని చెప్పిన ఆయన, వస్తూనే డజన్ల కొద్దీ ఆదేశాలపై సంతకాలు చేశారు. అందులో గత ప్రభుత్వం ఇచ్చిన 78 ఆదేశాల రద్దుతో మొదటి పద్దు మొదలెట్టారు. తర్వాత ముఖ్యమైన నిర్ణయం– అమెరికాలో పుట్టినవారికి ఆటోమేటిక్‌గా వర్తించే పౌరసత్వపు హక్కు రద్దు చేశారు. ఆ తర్వాత ప్రపంచ ఆరోగ్య సంస్థ నుండి వైదొలగడం. పర్యావరణ రక్షణ బాధ్యతకు పూచీ పడాల్సిన పారిస్ ఒప్పందం నుండి తప్పుకోవడం. ఆపైన తన చిరకాల హామీ అయిన మెక్సికో వైపు దేశ సరిహద్దుని గోడతో మూసేందుకు సుగమం చేసేలా ఎమర్జెన్సీ విధింపు. బ్రిక్స్ దేశాలతో వాణిజ్యంపై వంద శాతం సుంకం వేస్తానని హుంకరింపు.

ఇలా ఒక్కొక్కటీ ఒక్కో షాకు. ప్రపంచ దేశాల మధ్య ఆర్థిక లావాదేవీలను, అమెరికాతో సంబంధాలను తీవ్రంగా ప్రభావితం చేసే నిర్ణయాలు. అమెరికా తను పాడుచేసిన పర్యావరణం పట్ల చూపాల్సిన బాధ్యతను తప్పుకోవడం అంటే అది మొత్తం ప్రపంచ దేశాల పట్ల బాధ్యతను విస్మరించడమే. ఈ డజన్ల కొద్దీ ఆదేశాల్లో ఎన్ని కార్యరూపం దాలుస్తాయో కానీ ఆయన ఉద్దేశ్యం, స్పీడు మాత్రం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. అడుగు పెడుతూనే దుడుకు చూపించారు. బండి స్టార్ట్ చేస్తూనే టాప్ గేర్‌లోకి వెళ్లారు. ఇక భయంతోనో, సంభ్రమంతోనో గట్టిగా కళ్ళు మూసుకోవడం, దెబ్బ తగలకుండా చూసుకోవడం ఒక్కటే ప్రపంచ దేశాల పని.

– డి.వి.జి. శంకరరావు

హేతుబద్ధత లేని ఆర్వోఆర్ కేసుల బదిలీ!

రెవెన్యూ అధికారులకు న్యాయ అధికారాలు కూడా ఉంటాయి. అందుకే వారిని ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్స్ అంటారు. మండల రెవెన్యూ కార్యాలయంలోని తహశీల్దార్ చాంబర్ వద్ద, 'మండల రెవెన్యూ ఆఫీసర్ & మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్' అని ఉంటుంది.

ఒక పేదవాడి చేతిలో ఉన్న భూమిని లాగేయాలంటే అతన్ని చంపనవసరం లేదు, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టులు ఆ పని చేయగలవు. 'సొమ్ములు పోనాయండి' నవలికలో ఈ కోర్టులు ఎలా పని చేస్తాయో మనకి రాచకొండ విశ్వనాథశాస్త్రి చూపిస్తారు. మేజిస్టీరియల్ అధికారాలతో బాటు, కొన్ని చట్టాలు, రెవెన్యూ కోర్టులకు మాత్రమే విచారణాధికారాలను ఇచ్చాయి. ఆ సందర్భంలో రెవెన్యూ కోర్టులు 'సివిల్ ప్రొసీజర్ కోడ్' (సీపీసీ)ను అనుసరించి విచారణ జరుపుతాయి. ఇందులో హైకోర్టు వంటి రాజ్యాంగ కోర్టులు తప్ప, దిగువ కోర్టులు జోక్యం చేసుకోలేవు. అలా రెవెన్యూ కోర్టులకు అధికారులు ఇచ్చిన ఒక చట్టం 'ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు, పట్టాదారు పాసు పుస్తకాల చట్టం'. గత ప్రభుత్వం ఈ చట్టానికి తెచ్చిన ఒక సవరణ... పేద కక్షిదారులకు ఎలా ప్రాణసంకటంగా మారిందో, అదే సమయంలో జిల్లా రెవెన్యూ పాలన వ్యవస్థపై ఎలాంటి ప్రభావాన్ని చూపించిందో చూద్దాం.

భూముల అమ్మకాలు–కొనుగోళ్ళు నిరంతరం జరుగుతూ ఉంటాయి. కాబట్టి కొన్నవారి పేరున రికార్డులు మారుతూ ఉండాలి. భాగ పంపకాలు, కానుకలు, దానాలు, వారసత్వాలు ఇలా పలు రూపాలలో జరిగే భూమి బదిలీల వివరాలు భూమి హక్కుల రికార్డులలోకి ఎక్కాలి. ఈ అవసరాలను తీర్చడానికి వచ్చిన చట్టమే ముందు చెప్పుకున్న పట్టాదారు పాసు పుస్తకాల(ఆర్ఓఆర్) చట్టం. గ్రామ భూమి హక్కుల రికార్డులు ఆయా మండల రెవెన్యూ కార్యాలయాలలో ఉంటాయి. హక్కుల రికార్డులలో, పట్టాదారుల వివరాలను చూపించేది 1B రిజిస్టర్. ఇది చాలా కీలకమైనది. ఈ రికార్డులో పట్టాదారుగా నమోదైతేనే భూలావాదేవీలు జరపడానికి ఆసామికి హక్కు వస్తుంది. అంతేకాదు ప్రభుత్వాలు, బ్యాంకులు ఇచ్చే పెట్టుబడి, ఇతర సహాయాలు పొందాలన్నా 1B కీలకం. ఈ రికార్డును నిర్వహించేది తహశీల్దార్ కార్యాలయం.

1B ఒక ముఖ్యమైన రికార్డు గనుక, తప్పులు జరగడానికి వీలుండకూడదు. ఈ రికార్డులో మార్పు చేయాలంటే తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆర్ఓఆర్ చట్టం నియమాలను తూ.చ తప్పకుండా పాటించి తీరాలి. అవినీతి, అధికార దుర్వినియోగం లేదా చట్టం స్ఫూర్తికి విరుద్ధంగా రికార్డులో మార్పు జరిగితే బాధితుడు ఏం చేయాలి? ఇందుకుగాను రెండంచెలలో తనిఖీ/సమీక్షను ఏర్పాటు చేశారు. హక్కుల రికార్డులో తహశీల్దార్ వద్ద అన్యాయం జరిగిందనుకుంటే రెవెన్యూ డివిజనల్ అధికారి వద్ద అప్పీల్ వేసుకోవచ్చు. అక్కడా న్యాయం జరగలేదని భావిస్తే జిల్లా జాయింట్ కలెక్టర్ వద్ద 'రివిజన్' దాఖలు చేసుకోవచ్చు. ఆ తరువాత హైకోర్టు... ఇదీ చట్టంలో ఉన్న ఏర్పాటు. గత ప్రభుత్వం ఆర్ఓఆర్ చట్టానికి సవరణ తెచ్చి ఆర్డీవో కోర్టుకు ఇచ్చిన ఈ అప్పీల్ అధికారాన్ని డీఆర్వో (డిస్ట్రిక్ రెవెన్యూ ఆఫీసర్)కి బదిలీ చేసింది.



గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఒక అనాలోచిత పాలనాపరమైన మార్పుతో ఆర్ఓఆర్ కేసులు ప్రజలకు అందుబాటులో ఉండే ఆర్డీవో కోర్టు నుంచి డీఆర్వోకు బదిలీ అయ్యాయి. తాను ఎందుకు ఈ మార్పు తీసుకువస్తున్నదీ అప్పటి ప్రభుత్వం కారణాలు చెప్పలేదు. ఈ నిర్ణయం కారణంగా పేదలు ఇబ్బంది పడుతున్నారు.

ఒక జిల్లాలో తహశీల్దార్, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ /సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ కార్యాలయాలు పూర్తి సిబ్బందితో ఉంటాయి. కలెక్టర్ ఆఫీస్ అనగానే అందరికీ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల పేర్లు మాత్రమే తెలుస్తాయి. అక్కడ మరొక ముఖ్యమైన పోస్టు డీఆర్వో. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో ఒక భాగం. జిల్లాలోని రెవెన్యూ సిబ్బంది వ్యవహారాలను ఈయన పర్యవేక్షిస్తారు. సీనియర్ ఐఏఎస్ అధికారులైన కలెక్టర్–జాయింట్ కలెక్టర్లకు, జిల్లా రెవెన్యూ సిబ్బందికి డీఆర్వో వారధి. అందుకే ఆయనకు నేరుగా క్షేత్రస్థాయి సమస్యలతో సంబంధం ఉండదు. సమాచార హక్కు చట్టం వచ్చాక, ఆర్డీవో, జిల్లా కలెక్టర్ కార్యాలయాల పౌర సమాచార అధికారులపై డీఆర్వో అప్పీలేట్ అధికారి. కనుక, ఆ కేసు ఫైల్స్ కూడా ఇప్పుడు ఆయనే చూడాలి.

భూమి రికార్డులలో మార్పులు చేర్పులకు ఆదేశాలు తహశీల్దార్ నుంచి వస్తాయి. వాటితో విబేధిస్తే ఆర్డీవో కోర్టులో అప్పీల్, ఆర్డీవో ఆదేశాలపై జాయింట్ కలెక్టర్ వద్ద రివిజన్ వేసుకోవచ్చని ముందు చెప్పుకున్నాం. సాధారణంగా రెవెన్యూ డివిజనల్ కేంద్రాలలోనే పౌర (సివిల్) న్యాయస్థానాలు కూడా ఉంటాయి. అవి సోమవారం నుంచి శుక్రవారం వరకూ పని చేస్తాయి. ఆర్డీవోలు ఆర్ఓఆర్ కేసులను శనివారం వింటారు. డివిజన్ కేంద్రంలో ఉన్న న్యాయవాదులలో, తమ తాహతుకు సరిపోయే వారిని పెట్టుకొని కేసులు వాదించుకుంటారు బాధితులు. ఆర్డీవో కోర్టులు పేద బాధితులకు భౌతిక సామీప్యతలో అందుబాటులో ఉంటాయి. భోజన, దారి ఖర్చులలో పేద బాధితులకు వెసులుబాటుగా ఉంటాయి.

గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఒక అనాలోచిత పాలన మార్పుతో ఆర్ఓఆర్ కేసులు ప్రజలకు అందుబాటులో ఉండే ఆర్డీవో కోర్టు నుంచి డీఆర్వోకు బదిలీ అయ్యాయి. తాను ఎందుకు ఈ మార్పు తీసుకువస్తున్నదీ ప్రభుత్వం కారణాలు చెప్పలేదు. ఇదే కాదు, చాలా విధాన మార్పులను ప్రజలకు ఎలాంటి వివరణ, జవాబు లేకుండానే చేసుకుంటూ పోయారు.

ఒక జిల్లాలో రెండు నుంచి మూడు వరకూ రెవెన్యూ డివిజన్స్ ఉంటాయి. దాంతో డివిజన్స్‌లోని ఆర్ఓఆర్ కేసులన్నీ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని డీఆర్వో ఛాంబరుకు వచ్చి పడ్డాయి. అప్పటి వరకూ, ఆర్డీవో ఆదేశాలను సవాల్ చేస్తూ జాయింట్ కలెక్టర్ ముందు దాఖలైన రివిజన్ కేసులను మాత్రమే కలెక్టరేట్ సిబ్బంది చూసేవారు, ఇప్పుడు అప్పీల్ కేసులు కూడా అక్కడికే చేరుకున్నాయి. ఉదాహరణకు ఒక జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్స్‌లో 300 ఆర్ఓఆర్ కేసులు ఉన్నాయనుకుందాం, ఆర్డీవో తీర్పు తరువాత అన్నీ రివిజన్ వరకూ రావు. ఎక్కువలో ఎక్కువ 50శాతం అనుకున్నా, అవి 150 ఉంటాయి. ఇప్పటికే ఉన్న రివిజన్ కేసులతో పాటు చట్టంలో మార్పు వల్ల అప్పీల్ కేసులు కూడా వరదలా వచ్చి చేరాయి. కలెక్టరేట్‌లోని ఆర్ఓఆర్ విభాగం ఇప్పుడు డీఆర్వో ముందు మొదటి అప్పీల్ ఫైల్స్‌ను, అదే విభాగం జాయింట్ కలెక్టర్ వద్ద రివిజన్ కేసు ఫైల్స్‌ను నిర్వహించాలి. పని వత్తిడి వల్ల పొరపాటు జరిగితే హైకోర్టు చేతిలో మొట్టికాయలు తినాలి.

చింత వెంగళరావు ఒక కొండకమ్మర ఆదివాసీ. గిరిజనేతరులతో హక్కుల వివాదం ఉంది. న్యాయవాదిని పెట్టుకొనే స్తోమత లేదు. సామాజిక కార్యకర్తల సహాయంతో ఆర్డీవో కోర్టులో తానే (ఇన్ పర్సన్) అప్పీల్ వేశాడు. ఇంతకుముందు వాయిదాకు వెళ్లడానికి చేతిలో వంద రూపాయలు ఉంటే చాలు. కానీ ఇప్పుడు జిల్లా కేంద్రానికి వెళ్ళాలి. చటర్జీపురం ఒక చిన్న ఆవాస గ్రామం. 10 ఎకరాల భూమిలో ఆరు గదబ ఆదివాసీలు సాగులో ఉన్నారు. వారి పేర్లను ఏకపక్షంగా ఎలక్ట్రానిక్ (వెబ్ లెండ్) అడంగల్ నుండి తీసేశారు. ఆర్ఓఆర్ కేసుకు బలమైన సాక్ష్యం ఉంది. ఆర్డీవో కోర్టు ఉన్న నర్సీపట్నం... వారికి 20 కి.మీ దూరంలో ఉండగా, డీఆర్వో కోర్టు ఉన్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆఫీస్ 70 కి.మీ దూరంలో ఉంది.

ఆర్ఓఆర్ కేసులను డీఆర్వోకు బదిలీ చేస్తూ చట్టం తెచ్చిన తరువాత, జిల్లాల వారీగా డీఆర్వోల వద్ద ఎన్ని కేసులు పోగుపడింది, అసలు వాటి విచారణ ఎలా సాగుతున్నదీ ప్రభుత్వం గమనిస్తున్నదా? విజయనగరం జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్స్ నుంచి ఆ జిల్లా డీఆర్వోకు 190 కేసులు బదిలీ అయ్యాయి. అనకాపల్లి జిల్లాలోని రెండు రెవెన్యూ డివిజన్స్ నుంచి డీఆర్వో కోర్టుకు 572 కేసులు బదిలీ అయ్యాయి. అనకాపల్లి పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండే జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్ళడానికి ఎలాంటి పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు లేదు. అక్కడికి తినడానికి తిండి కూడా దొరకదు.

ఆర్ఓఆర్ కేసులను ఆర్డీవో నుంచి డీఆర్వోకు బదిలీ చేయడంలో ఎలాంటి హేతుబద్ధత లేదు. ఒకవేళ ఆర్డీవోలపై విపరీతమైన రాజకీయ వత్తిళ్ళు వస్తున్నాయని, న్యాయం చేయలేకపోతున్నారని, అదే డీఆర్వో అయితే కొంతవరకూ తట్టుకోగలరని ప్రభుత్వ పెద్దల ఉద్దేశ్యం అయితే... అది కూడా తప్పే. ఆర్డీవోలకు ఆర్ఓఆర్ కేసులను తిరిగి అప్పగించడం ఇష్టం లేకపోతే డివిజన్ కేంద్రంలో ఉండే న్యాయస్థానాలకు అప్పగించాలి. అంతేగాని పేద బాధితులను ఇబ్బంది పెట్టకూడదు.

▪ పి.ఎస్. అజయ్‌కుమార్

పాఠశాల విద్యలో సంస్కరణలు ఎటువైపు?

ప్రభుత్వ రంగంలో మంచి పాఠశాల విద్యకు ప్రధానంగా కావలసిన ఉపాధ్యాయుల నియామకం పట్ల గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. ఉపాధ్యాయ పోస్టులు తగ్గించుకోవడానికి పాఠశాల విద్యను విధ్వంసం చేసిన జీఓ 117 తీసుకువచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ జీఓ రూపాన్ని మాత్రమే మారుస్తుందా, సారాన్ని కూడా మారుస్తుందా అన్నది పాఠశాల విద్య ముంగిట ఉన్న పెద్ద సమస్య. ఈ జీఓ ఉపసంహరణ ప్రక్రియ పేరుతో ప్రభుత్వం జనవరి 9న విడుదల చేసిన మెమో ఇక్కడ చర్చనీయాంశం.

గత ప్రభుత్వం జీఓ 117 ద్వారా ఐదు ప్రధాన సమస్యలను సృష్టించింది: 1) ప్రాథమిక పాఠశాలలను నిలువునా రెండు ముక్కలు చేసి 3, 4, 5 తరగతుల బాలబాలికలను ఉన్నత పాఠశాలలకు పంపింది. అత్యధిక సందర్భాల్లో ఉన్నత పాఠశాలలకు వెళ్ళిన విద్యార్థులు నిర్లక్ష్యానికి గురికాగా, 1, 2 రెండు తరగతులతో మిగిలిపోయిన ఫౌండేషన్ పాఠశాలలతో కలిపి సుమారు 15 వేల ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా దిగజారిపోయాయి. 2) 1 నుంచి 8 వరకు ఉండే అత్యధిక ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య ఎనిమిది నుంచి నాలుగు లేదా ఐదుకు తగ్గించారు. ఆ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 3) అత్యధిక ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడు, పి.ఇటి పోస్టులు రద్దు చేశారు. 4) ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత విభాగాల్లో తరగతి గదిలో విద్యార్థుల గరిష్ఠ సంఖ్యను వరుసగా 30, 35, 40/50 నుంచి వరుసగా 40, 52, 60గా మార్చారు. ఇంకా, వారానికి ఉపాధ్యాయులు గరిష్ఠంగా బోధించవలసిన పీరియడ్లను 32 నుంచి 42కు పెంచారు. దీనితో విజయవంతంగా నడుస్తున్న ఎక్కువ నమోదుగల పాఠశాలలు అవసరమైన ఉపాధ్యాయ పోస్టులను కోల్పోయి నష్టపోయాయి. 5) ప్రభుత్వ పాఠశాలల్లో సమాంతరంగా నడుస్తున్న మాతృభాషా మాధ్యమ విభాగాలను రద్దుచేశారు. జీఓ 117 రద్దు చేయమని, పాఠశాల పునర్వ్యవస్థీకరణ జీఓ 84ను, ప్రాథమిక విద్య అందుబాటు దూరపరిమితి పెంపు జీఓ 85ను రద్దుచేయమని సుమారు అన్ని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు కూడా డిమాండు చేశాయి. కానీ గత ప్రభుత్వం పట్టించుకోలేదు.

పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన మెమోలో విద్యార్థులు ప్రకాశవంతమైన భవిష్యత్‌తో గ్లోబల్ పౌరులు కావాలని లక్ష్య నిర్దేశం చేశారు. ప్రాథమిక విద్య పూర్తిచేసిన విద్యార్థులకు గత 20 ఏళ్లుగా చదవనూ రాయనూ రావడం లేదు. ఈ పరిస్థితుల్లో అంత గొప్ప లక్ష్య నిర్దేశం చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇక ఆ మెమోలో ఏముందో చూద్దాం. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు మారుస్తున్నారు. ఇది మంచి పరిణామం. అయితే ప్రాథమిక విద్య అందించే అత్యధిక పాఠశాలలు గతంలో జీఓ 117 పద్ధతిలోనే రెండవ తరగతి వరకు మాత్రమే విద్య అందించే ఫౌండేషన్ పాఠశాలలుగా కొనసాగుతాయి. కొన్ని పాఠశాలలు మాత్రమే జీఓ 117 ముందు స్థాయికి వస్తాయి. అందులో కూడా కొన్ని బేసిక్ పాఠశాలలుగా, కొన్ని ఆదర్శ పాఠశాలలుగా వ్యవస్థీకరిస్తారు. ఆదర్శ పాఠశాలలు ఆదర్శంగా తయారవుతాయో లేదో కాని, బేసిక్ పాఠశాలలు కునారిల్లిపోతాయనే ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ మెమో ప్రకారం 60 లోపున విద్యార్థుల నమోదు ఉన్న ఏడు తరగతులకు (ఎల్.కె.జి–యు.కె.జి– 1 నుంచి 5 తరగతులకు) కలిపి ఇద్దరు టీచర్లను ఇస్తారు. వీటిని బేసిక్ పాఠశాలలు అంటారు. ఇవి పెద్ద సంఖ్యలో ఉంటాయి. వీటి పరిస్థితి దారుణంగా ఉంటుందని వేరుగా చెప్పనవసరం లేదు. ఇక నమోదు 60 దాటిన ప్రాథమిక పాఠశాలలకు ఏడు తరగతులకు (ఎల్.కె.జి–యు.కె.జి 1 నుంచి 5 తరగతులకు) కలిపి ఐదుగురు ఉపాధ్యాయులను ఇస్తారు. వీటిని ఆదర్శ పాఠశాలలు అంటారు. ఇటు బేసిక్ పాఠశాలలకు గాని, అటు ఆదర్శ పాఠశాలలకు గాని పూర్వ ప్రాథమిక విద్యకు (ఎల్.కె.జి–పిపి1– యు.కె.జి–పిపి2లకు) ప్రత్యేకంగా ఉపాధ్యాయులను ఇవ్వరు. ఇక కొన్ని ఆదర్శ పాఠశాలలకు ఐదుగురు ఉపాధ్యాయులను ఇవ్వడానికి పెద్ద సంఖ్యలో ప్రాథమిక పాఠశాలలను 2వ తరగతి వరకు బోధించే ఫౌండేషన్ పాఠశాలలుగా కుదించడం, ఎల్.కె.జి నుంచి 5వ తరగతి వరకు మొత్తం ఏడు తరగతులు ఉండే బేసిక్ పాఠశాలలకు ఇద్దరు ఉపాధ్యాయులను మాత్రమే ఇవ్వడం ఎంతవరకు సమంజసం?



పాఠశాల విద్యాశాఖ ఇటీవల ఇచ్చిన మెమోలో విద్యార్థులు ప్రకాశవంతమైన భవిష్యత్‌తో గ్లోబల్ పౌరులు కావాలని లక్ష్య నిర్దేశం చేశారు. ప్రాథమిక విద్య పూర్తిచేసిన విద్యార్థులకు గత 20 ఏళ్లుగా చదవనూ రాయనూ రావడం లేదు. ఈ పరిస్థితుల్లో అంత గొప్ప లక్ష్య నిర్దేశం చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.


విద్యార్థి–ఉపాధ్యాయ నిష్పత్తి విషయంలో కేంద్ర విద్యా హక్కు చట్టం (బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009)' తగిన స్థాయిలో లేదు. ఆపైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు 'విద్యాహక్కు చట్టానికి మినహాయింపుగా' ఇచ్చిన ఒక తీర్పును ఉపయోగించుకుని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థి నమోదు 20 వరకు ఒకే ఒక్క ఉపాధ్యాయుడ్ని ఇస్తూ వచ్చారు. ఇప్పుడూ అందులో మార్పులేదు. ఇక, నమోదు 21–40 స్లాబ్‌లో విద్యాహక్కు చట్టం ప్రకారం ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయిస్తున్నారు, కాని గురువారం విడుదలైన మెమో ప్రకారం నమోదు 21–30 ఉన్న ఫౌండేషన్ పాఠశాలలకు (ఎల్.కె.జి, యు.కె.జి ఇంకా 1వ తరగతి, 2వ తరగతి) ఒక ఉపాధ్యాయుడ్నే కేటాయించడం ఒక కొత్త కత్తిరింపు. ఆదర్శ పాఠశాలల స్థాపన పేరున ఈ కత్తిరింపులు జరుగుతున్నాయి. నమోదు 41–60 ఉన్న ప్రాథమిక పాఠశాలలను బేసిక్ పాఠశాలలుగా పరిగణిస్తూ ఇద్దరు ఉపాధ్యాయుల చొప్పున మాత్రమే ఇవ్వబోతున్నట్లు ఇటీవలి మెమో బట్టి తెలుస్తుంది. ఈ స్లాబ్‌లో మూడవ ఉపాధ్యాయుడ్ని ఎందుకివ్వకూడదు? ఈ స్లాబ్‌లో కనీసం ప్రతి పంచాయితీకి ఒక పాఠశాల ఉంటుంది. మూడవ పోస్టును కేటాయించి వాటిని బలపరచవచ్చు. ఇంకా బాలబాలికల నమోదు 40, 60, 90 దాటిన ప్రాథమిక పాఠశాలలన్నింటికీ విద్యాహక్కు చట్టానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక పోస్టును ఇస్తే ప్రాథమిక స్థాయిలో సార్వత్రికంగా విద్యా ప్రమాణాలు పెరుగుతాయి. అత్యధిక పాఠశాలలు ఆదర్శ పాఠశాల వైపు అడుగులు వేయగలుగుతాయి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నమోదు కూడా పెరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఇచ్చే ఆ పోస్టును ఆంగ్ల భాషా బోధనకు ఉద్దేశించవచ్చు. మాతృభాషా మాధ్యమం, ఆంగ్లభాషా బోధన రెండూ సాధించవచ్చు. ఇందుకోసం ప్రభుత్వం కొత్తగా పోస్టులు మంజూరు చేయవలసిన అవసరం లేదు. ఇప్పటికే మంజూరై ఖాళీగా ఉన్న పోస్టులను మార్పుచేసి నింపితే సరిపోతుంది.

ప్రాథమికోన్నత పాఠశాలల విషయానికి వస్తే– ఎ) 6, 7, 8 తరగతుల నమోదు 60 పైన ఉంటే ఆ ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాల చేస్తామంటున్నారు. జీఓ 117 అమలు కారణంగా గత రెండు సంవత్సరాలుగా ప్రాథమికోన్నత పాఠశాలలు బాగా తెబ్బతిన్నాయి. అప్‌గ్రేడేషన్ అవకాశం ఉండకపోవచ్చు. బి) 6, 7, 8 తరగతుల నమోదు 30లోపున ఉంటే అటువంటి ప్రాథమికోన్నత పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా కుదిస్తారు. గత రెండు సంవత్సరాలుగా నమోదు తగ్గినందున చాలా ప్రాథమికోన్నత పాఠశాలలు ఈ నిబంధనకు గురవుతాయి. సి) 6, 7, 8 తరగతుల నమోదు 31 నుంచి 59 ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రాథమికోన్నత విభాగాల కొనసాగింపు ఆయా సందర్భాలను బట్టి నిర్ణయిస్తామని చెప్తున్నారు. వాటి ఉనికి ప్రశ్నార్థకం చేశారు. 2017లో ప్రాథమికోన్నత పాఠశాలల విషయమై విస్తృతంగా చర్చ జరిగి, ప్రాథమికోన్నత పాఠశాలను కొనసాగించాలని ఇచ్చిన జీఓ 29, 33, 42లను ప్రస్తుత అధికారులు పరిశీలించాలి. ఉన్నత పాఠశాల లేని దగ్గర కనీసం ప్రాథమికోన్నత పాఠశాలైనా ఉండడం బాలికల విద్యకు చాలా అవసరం. ఆవాస ప్రాంతం నుంచి ఒక కిలోమీటరు పరిధిలో ఐదవ తరగతి వరకు, మూడు కిలోమీటర్ల పరిధిలో 6, 7, 8 తరగతులు అందుబాటులో ఉండాలని, అందుకై 2021 డిసెంబర్‌లో వచ్చిన దూర పరిమితి జీఓ 85ను రద్దు చేసి అంతకు ముందటి విధానాన్ని పునరుద్ధరిస్తామని మెమోలో పేర్కొనలేదు. మంజూరై ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నీ నింపకుండా సామీప్యతకు, విద్యాప్రమాణాలకు మధ్య ఘర్షణ చూపుతున్నారు.

ఉన్నత పాఠశాలల్లో ఒక తరగతిలో విద్యార్థుల సంఖ్య 54 దాటితే రెండవ సెక్షన్ ఆరంభించడానికి అనుమతించడం మంచి పరిణామమే. జీఓ 117 ప్రకారం ఈ సంఖ్య 60 ఉంది. ఈ మెమోలో ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనిభారం గురించి ఒక చోట ప్రస్తావించారు. కాని ఒక వారంలో ఉపాధ్యాయులు బోధించవలసిన గరిష్ఠ పీరియడ్లను 42 నుంచి 32కి పునరుద్ధరించలేదు. ఇది ఉపాధ్యాయుల సమస్య కాదు, విద్యా ప్రమాణాల సమస్య అని అధికారులకు అర్థం కావడం లేదు.

• డి. రమేష్ పట్నాయక్
కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com





అన్ని నగరాల్లో అస్త్రం



సీసీ కెమెరాలను రిమోట్‌తో ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, కొలికపూడి శ్రీనివాసరావు, సీపీ రాజశేఖరబాబు

ఇష్టంతో పనిచేస్తేనే అద్భుతాలు

- ట్రాఫిక్ సమస్య తగ్గించవచ్చు
- విజయవాడ పోలీసుల పనితీరు భేష్
- హోంమంత్రి అనిత ప్రశంసలు
- 1,000 సీసీ కెమెరాలు, సురక్ష కమిటీలు, ఈగల్ వాహనాల ప్రారంభం
- ప్రజలకు మెరుగైన సేవలందించాలి : డీజీపీ ద్వారకా తిరుమలరావు

విజయవాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : 'పోలీస్ అంటేనే ప్యాషన్. ఇష్టంతో పనిచేస్తే మిరాకిల్స్ చేయవచ్చు. విజయవాడ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగిస్తున్న అస్త్రం ఏఐ టూల్‌ను అన్ని నగరాల్లో ఉపయోగించుకోవచ్చు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలను కొంత వరకు తగ్గించవచ్చు' అని హోంమంత్రి అనిత అన్నారు. ఐదేళ్లలో భ్రష్టుపట్టిన అన్ని వ్యవస్థలను కూటమి ప్రభుత్వం గాడిన పెడుతోందన్నారు. ఎన్టీఆర్ పోలీసు మిగతా 6లో..



నగరంలో జేఈఈ మెయిన్స్

నగరంలోని పలు కేంద్రాల్లో బుధవారం జేఈఈ మెయిన్స్ జరిగాయి. మొత్తం 11 పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. 19,800 మంది విద్యార్థులకు ఈ కేంద్రాలను కేటాయించారు. శుక్రవారంతో ఈ పరీక్షలు ముగుస్తాయి. (కానూరులోని ఓ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఇన్‌సెట్‌లో.. వన్‌టౌన్‌లోని కేంద్ర వద్ద విద్యార్థులు)



బియ్యం బీర్..!

పీడీఎస్ రైస్‌తో బీరు తయారీ

కోళ్ల మేత, చేపల మేత, స్వీట్ల దుకాణాలకు పీడీఎస్ బియ్యాన్ని తరలించడం చూశాం.. విన్నాం.. తాజాగా బీరు తయారుచేసే ఫ్యాక్టరీలకు కూడా పేదల బియ్యాన్ని తరలిస్తున్నారన్న విషయం బయటకొచ్చింది. కోళ్లు, చేపల మేత కోసం నాణ్యమైన సార్టెక్స్ బియ్యాన్ని తరలిస్తుండగా, రాష్ట్రంలోని ఓ బీరు ఫ్యాక్టరీకి మాత్రం ఏకంగా నాణ్యత తక్కువగా ఉండే రంగుమారిన ధాన్యాన్ని రైతుల వద్ద కొని తరలిస్తుండటం ఆశ్చర్యపోవాల్సిన విషయం.

తడిసి, రంగుమారిన బియ్యానికి భలే డిమాండ్

- ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి తరలుతున్న పేదల బియ్యం
- రైతుల వద్ద తక్కువ ధరకు కొంటున్న వ్యాపారులు
- మిల్లుల్లో ఆడించి బీరు ఫ్యాక్టరీలకు మంచి ధరకు విక్రయం
- నష్టపోయేది రైతు.. లాభపడేది ప్రైవేట్ వ్యాపారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కొంతకాలం కిందట మిచౌంగ్ తుఫాను మిగిల్చిన విషాదం కొంతమంది బియ్యం కొనుగోలు వ్యాపారులకు కాసులు కురిపించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023, డిసెంబరు 1 నుంచి 6 వరకు మిచౌంగ్ తుఫాను బీభత్సం సృష్టించింది. దీని కారణంగా ఉమ్మడి జిల్లాలో రైతాంగం తీవ్ర నష్టాన్ని చవిచూసింది. ఈ తుఫానుకు తడిసిన ధాన్యాన్ని కొంటామని అప్పటి వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. కానీ, కొనుగోలు చేసే విషయంలో అనేక అవాంతరాలు ఏర్పడ్డాయి. మిల్లర్ల ఆంక్షలతో స్వేచ్ఛగా విక్రయించుకునే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో ప్రైవేట్ ధాన్యం కొనుగోలు వ్యాపారులు వీటిని అతి తక్కువ ధరకే కొన్నారు. తడిసిన ధాన్యం.. వారం పాటు నానిపోయాక గోధుమ, ముదురు రంగులోకి మారతాయి. వీటికి వాసన వస్తుంది కనుక తినటానికి మిగతా 6లో..



బీరు ఫ్యాక్టరీకి తరలిన రంగుమారిన బియ్యం శాంపిల్స్

గత ఆగస్టులోనూ..

గత ఆగస్టులో కురిసిన భారీ వర్షాలు, బుడమేరు వరద కారణంగా ఉమ్మడి కృష్ణాలో పంట నష్టం ఏర్పడింది. తడిసిన బియ్యాన్ని కూటమి ప్రభుత్వం కొనుగోలు చేయాలని నిర్ణయించుకుంది. వైసీపీ హయాంలో మాదిరిగా కాకుండా, ఎట్టి పరిస్థితుల్లో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా కొనాల్సిందేనని టార్గెట్లు విధించింది. పూర్తిగా కొనాల్సిందేనని ఆదేశించింది. అయినప్పటికీ మధ్య దళారీలు కీలకపాత్ర పోషించి రైతుల నుంచి తక్కువ ధరకే ఆ బియ్యాన్ని కొన్నారు. ఆ తర్వాత ప్రైవేట్ వ్యాపారులకు సమకూర్చారు. వారేమో సొంత, బయట మిల్లుల్లో ఆడించి, రంగుమారిన బియ్యాన్ని బీరు ఫ్యాక్టరీకి పంపించారు. ఇలా రెండో దఫా కూడా భారీగా ప్రైవేట్ ధాన్యాన్ని కొని వ్యాపారులు లబ్ధిపొందారు. రంగుమారిన బియ్యం పెద్ద మొత్తంలో రావటం వల్ల సదరు బీరు ఫ్యాక్టరీ కూడా డిమాండ్‌కు తగిన విధంగా కొనలేకపోయింది. దీంతో చాలామంది వ్యాపారుల వద్ద రంగుమారిన ధాన్యం మిగిలి ఉండిపోయింది.

సెంట్రల్‌లో సర్వే

ప్రజాప్రతినిధుల తీరుపై ఇంటెలిజెన్స్ ఆరా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సెంట్రల్ నియోజకవర్గంలో ప్రభుత్వం ఇంటెలిజెన్స్ ద్వారా రహస్య సర్వే నిర్వహించటం చర్చనీయాంశంగా మారింది. రెండు రోజులుగా ఇంటెలిజెన్స్ బృందాలు ముమ్మరంగా సర్వే నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజాప్రతినిధులు ప్రజలకు దగ్గరగా ఉంటున్నారా? లేదా.. అనే విషయాలను తెలుసుకుంటున్నారు. దీనికోసం ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్నారని సమాచారం. అలాగే, పార్టీ నాయకులకు, ప్రజాప్రతినిధులకు మధ్య సత్సంబంధాలు కొనసాగుతున్నాయా? లేదా? అనే అంశాలపై ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని సంప్రదిస్తున్నారు. అసంతృప్త నాయకులు ఏం చెబుతున్నారు? వారి అసంతృప్తికి కారణాలేంటి? వంటివి కూడా ఆరా తీస్తున్నారు. నిగూఢంగా ఈ సర్వే జరుగుతోంది.

అవినీతి రగడపై డీటీసీ ఆగ్రహం

ఎంవీఐల తీరుపై ఫైర్.. ప్రైవేట్ వ్యక్తి గురించి ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రవాణా శాఖలో అవినీతి వ్యవహారాలకు సంబంధించి 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన 'అవినీతి భాగస్వామి రగడ' కథనంపై జిల్లా ఉప రవాణా శాఖాధికారి (డీటీసీ) మోహన్ స్పందించారు. ఎంవీఐల సిండికేట్, ప్రైవేట్ వ్యక్తి వసూళ్లపై విచారణ ప్రారంభించారు. నగరంలోని రవాణా శాఖ కార్యాలయంలో బుధవారం అత్యవసరంగా పలువురు ఎంవీఐలతో ఆయన రహస్యంగా సమావేశమయ్యారు. ఈ వ్యవహారాలు ఎప్పటి నుంచి జరుగుతున్నాయి? వసూలు చేస్తున్న ఆ వ్యక్తి ఎవరు? సిండికేట్‌లో ఎవరెవరు ఉన్నారు? లారీల సిండికేట్‌లో ఎవరున్నారు? వంటి అంశాలకు సంబంధించి డీటీసీ విచారణ జరిపినట్టు తెలుస్తోంది.

మధురానగర్ రైల్వేస్టేషన్‌లో రేపటి నుంచి పీఆర్ఎస్‌సీ

8లో



సంక్రాంతికి తగ్గిన ఆదాయం

గత ఏడాదితో పోలిస్తే ఆర్టీసీ ఆదాయంలో తగ్గుదల

- గత ఏడాది ఆదాయం రూ.3.06 కోట్లు
- ఈ ఏడాది ఆదాయం రూ.2.80 కోట్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాష్ట్ర రవాణా రంగంలో కీలకపాత్ర పోషించే విజయవాడ రీజియన్ పరిధిలో ఈసారి సంక్రాంతికి ఆర్టీసీకి ఆదాయం గణనీయంగా తగ్గింది. గత ఏడాది సంక్రాంతికి రూ.3.06 కోట్ల ఆదాయం రాగా, ఈసారి మాత్రం రూ.2.80 కోట్లే వచ్చింది. ఈ సంక్రాంతికి మొత్తం 782 బస్సులు నడపగా, 3,89,123 కిలోమీటర్ల మేర తిరిగాయి. తద్వారా రూ.1,52,00,471 ఆదాయం లభించింది. కిలోమీటరుకు రూ.39.60 చొప్పున సాధించింది. ఆక్యుపెన్సీ రేషియో 58 శాతంగా నమోదైంది. పండుగ తర్వాత 572 స్పెషల్ బస్సులు నడిపారు. మొత్తం 3,46,560 కిలోమీటర్ల మేర తిరగగా, రూ.1,28,62,264 ఆదాయం సమకూరింది. కిలోమీటరుకు రూ.37.11 ఆదాయం సాధించగా, ఆక్యుపెన్సీ రేషియో 55 శాతంగా నమోదైంది. మొత్తంగా 1,354 బస్సులు 7,35,683 కిలోమీటర్లు ప్రయాణించగా రూ.2,80,62,735 ఆదాయం వచ్చింది. స్థూలంగా 57 శాతం మేర ఆక్యుపెన్సీ నమోదైంది. 2024 సంక్రాంతికి మొత్తం 1,310 బస్సులు 7,31,988 కిలోమీటర్లు తిరగగా, కిలోమీటరుకు రూ.41.93 చొప్పున రూ.3,06,90,978 కోట్ల ఆదాయం వచ్చింది. ఆక్యుపెన్సీ రేషియో 62 శాతంగా నమోదైంది. 2024తో పోల్చి చూస్తే రూ.26,28,243 ఆదాయం తగ్గింది.



అంబాపురం వద్ద నగరవనం

మరో నగరవనం

- ఆధ్యాత్మిక కేంద్రం వేదాద్రి వద్ద ఏర్పాటు
- 125 ఎకరాల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు
- కొత్తూరు తాడేపల్లి 'వనం' విస్తరణకు ప్రణాళికలు

8లో

మామిడి పోతున్నాయ్!

మామిడి రైతుకు తీరని నష్టం చేస్తున్న నల్లి, కోడిపేలు



కోడి పేలు ఉధృతికి రాలిపోయిన పూత

- నివారణ మందుల్లో అవగాహనలేమి
- కాడలుగా మిగులుతున్న మామిడి తోటలు
- జిగురు అట్టల ఏర్పాటుతో కొంత మేలు
- ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలి

6లో

● రిహార్సల్స్





రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 26న జరిగే గణతంత్ర వేడుకలకు రిహార్సల్స్ మొదలయ్యాయి. పోలీసులు, వివిధ దళాల కవాతు రిహార్సల్స్ ప్రతిరోజూ జరుగుతున్నాయి. స్టేడియాన్ని మూడు రంగులతో అందంగా తీర్చిదిద్దుతున్నారు.

అనధికార డంపింగ్‌లపై నిఘా పెట్టండి

జగ్గయ్యపేట పర్యటనలో కలెక్టర్

6లో



జగ్గయ్యపేట డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

అనధికార డంపింగ్‌లపై నిఘాపెట్టండి

- జగ్గయ్యపేటలో కలెక్టర్ విస్తృత పర్యటన
- విలియంపేట డంపింగ్‌యార్డు తరలింపునకు ఆదేశాలు

జగ్గయ్యపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : అనధికార డంపింగ్ ప్రాంతాలలో సీసీ కెమెరాలతో నిఘా పెట్టి చెత్త వేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసు కోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. జగ్గయ్యపేట శివారు విలియంపేటలో ఉన్న డంపింగ్ యార్డును తరలించేందుకు వెంటనే ప్రత్యామ్నాయం అన్వేషించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జగ్గయ్యపేట పట్టణంలో విలియంపేట డంపింగ్‌యార్డును ఎమ్మెల్యే తాతయ్య, చైర్మన్ రాఘవేంద్రలతో కలిసి పరిశీలించారు. అంతకుముందు ఆయన జయంతిపురంలో ఆర్ఎస్. నెం.93లో ఏపీఐఐసీకి కేటాయించిన 498.68 ఎకరాలు ఎంసీ ల్యాండ్‌ను పరిశీలించగా అక్కడ పరిశ్రమల స్థాపనకు అడ్డంకిగా ఉన్న కోర్టు వివాదం, రోడ్డు సమస్యను పరిష్కరించాల్సి ఉందని అధికారులు వివరించారు. భీమవరం వద్ద ఏపీఐఐసీకి కేటాయించిన ఆర్.ఎస్ నెం.65లోని 325 ఎకరాల భూమిని, చిల్లకల్లులోని 109 ఎకరాల భూమిని కలెక్టర్ పరిశీలించారు. వాటిపై ఉన్న కోర్టు వ్యాజ్యాలను అధికారులు వివరించారు. చిల్లకల్లు రెవెన్యూ సదస్సులో తొమ్మిదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యను పరిష్కరించిన చిల్లకల్లు రైతు ప్రతిస్పందన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లా అంతటా తడి, పొడి చెత్తను వేరు చేసి సంపద తయారీ కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పరిసరాల పరిశుభ్రతలో ప్రజలను మరింత భాగస్వాముల్ని చేయాలని అభిప్రాయపడ్డారు. ఆయన వెంట నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, జగ్గయ్యపేట తహసీల్దార్ మనోహర్, కమిషనర్ రామ్మోహన్, కౌన్సిలర్లు నకిరికంటి వెంకటి, పేరం సైదేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కోట వీరబాబు, రాటకొండ చంద్రశేఖర్

రైతులకు అండగా నీటి సంఘాలు

- ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు

నందిగామ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఎస్‌పీ కాలువల పటిష్టత, సమగ్ర నీటి పంపిణీ అంశాలపై దృష్టిసారించి నీటి సంఘాలు రైతులకు అండగా ఉంటాయని ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్‌లు అన్నారు. బుధవారం స్థానిక ఎన్ఎస్‌పీ డీఈ కార్యాలయంలో ఆయన రికార్డులు పరిశీలించి ఎన్ఎస్‌పీ ఆస్తుల అన్యాక్రాంతంపై ఆరా తీశారు. అనంతరం నీటి సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం సాగునీటి రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. ఫలితంగా పలుచోట్ల సాగర్ కాలువలు పూర్తిగా ధ్వంసమయ్యాయన్నారు. ఇకపై వారబందీ విధానం అమలు చేసి నీటిని సమర్థవంతంగా కిందకు నడిపిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. తీర్మానాలను జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడికి అందజేయనున్నట్టు చెప్పారు. సమావేశంలో ఈఈ ఆర్.సంతోష్, డీఈ సుబ్బారావు, ఏఈ నాగరాజు, అనిల్, నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.




సామాజిక తనిఖీ చేస్తున్న అధికారులు

ఉపాధి నిధులు రూ.20 లక్షలు స్వాహా

వత్సవాయి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి పనుల్లో సుమారు రూ.20 లక్షల అవినీతి జరిగినట్టు గుర్తించామని డ్వామా పీడీ రాము తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళ, బుధవారాల్లో ఉపాధి పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మండలంలోని 28 గ్రామాల్లో జరిగిన పనుల్లో అవినీతి జరిగినట్టు తెలిపారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు జాబ్ కార్డు వేతనంతో పాటు అమెరికాలో ఉన్నవారికి సైతం జాబ్ కార్డు వేతనం చెల్లించినట్టు తేలిందన్నారు. ఎఫ్ఏలు నిధులు స్వాహా చేసినట్టు గుర్తించామన్నారు. ఎక్కువ మొత్తంలో భీమవరంలో 4.10 లక్షలు, మంగొల్లులో 2.24 లక్షలు, దేశిపాలెంలో 1.43 లక్షలు, చిట్యేలలో 1.13 లక్షల అవినీతి జరిగనట్టు గుర్తించామన్నారు. ఆ నిధులను ఎఫ్ఏల నుంచి జరిమానాతో సహా వసూలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి ఎం.బాలాజీ, ఏపీడీ పార్థసారథి, ఎంపీడీవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పొందుగల పంచాయతీకి అరుదైన గౌరవం

- ఢిల్లీలో గణతంత్ర వేడుకలకు సర్పంచ్‌కు ఆహ్వానం



గుగులోతు కోటమ్మ, సర్పంచ్

మైలవరంరూరల్, జనవరి 22, (ఆంధ్రజ్యోతి) : పొందుగల గ్రామపంచాయతీకి అరుదైన గౌరవం దక్కింది. ఢిల్లీలో జరగనున్న 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు అతిథిగా హాజరుకావాలని సర్పంచ్ గుగులోతు కోటమ్మకు ప్రత్యేక ఆహ్వానాన్ని అధికారులు అందజేశారు. ప్రతీఏటా గణతంత్ర దినోత్సవం నాడు దేశంలో అత్యుత్తమ సేవలు అందించిన గ్రామపంచాయతీలను గుర్తించి ఆయా సర్పంచ్‌ల గొంతుకను ఈ వేదిక ద్వారా వినిపించనున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేయడంతోపాటు వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించిన దేశంలోని వెయ్యి గ్రామ పంచాయతీలలో ఎన్టీఆర్ జిల్లా పొందుగల పంచాయతీ ఎంపికవడం విశేషం.

వీఆర్‌కు ఎస్ఐ అర్జునరాజు

తోట్లవల్లూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు ఎస్ఐ ఎం.అర్జునరాజును వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేసినట్టు పోలీసు వర్గాలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపాయి. గతేడాది ఆగస్టులో ఎస్ఐగా వచ్చిన అర్జునరాజును ఆరు నెలల కాలంలోనే వీఆర్‌కు పంపటం చర్చనీయాంశమైంది. ఎస్ఐ తీరుపట్ల అధికారపార్టీ నేతలు అసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం. వల్లూరుపాలెం జిల్లా టీడీపీ మాజీ కార్యదర్శి చెన్నుపాటి శ్రీధర్‌ను స్టేషన్‌కు పిలిచి పాత కేసులపై రైడీషీట్ తెరవాల్సి ఉంటుందని హెచ్చరించటం రచ్చకు దారితీసింది. ఇటీవల వైసీపీ సానుభూతిపరులైన ఇసుక కార్మికులు ఏకంగా 15 గంటలపాటు ఇసుక క్వారీ వద్ద ధర్నా నిర్వహించినా పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడంపై టీడీపీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ఐ వైఖరిపై శ్రీధర్ పోలీసు అధికారులకు, టీడీపీ పెద్దలకు ఫిర్యాదు చేయటం.. భద్రిరాజుపాలెంలో గంగానమ్మ జాతర సందర్భంగా పలువురిని అవమానానికి గురిచేసి ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టిన తీరు విమర్శలకు దారితీసిందని చెపుతున్నారు.

మామిడి పోతున్నాయ్!



కోడి పేలు ఉధృతికి రాలిపోయిన పూత

మామిడికి రైతుకు తీరని నష్టం చేస్తున్న నల్లి, కోడిపేలు

- నివారణ మందుల్లో అవగాహన లేమి
- కాడలుగా మిగులుతోన్న మామిడి తోటలు
- జిగురు అట్టల ఏర్పాటుతో కొంత మేలు
- ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలి

(రెడ్డిగూడెం-ఆంధ్రజ్యోతి)

నల్లి, కోడి పేలు మాట వింటేనే రెడ్డిగూడెం మండలం మామిడి రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. గత మూడేళ్లుగా కోడి పేలు మామిడి పంటను తీవ్రంగా నష్ట పరుస్తున్నాయి. దీని నివారణకు ఇప్పటి వరకు సరైన మందు లేకపోవడంతో రైతులు అవగాహన లేకుండా పురుగు మందులను పిచికారీ చేసి తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఈఏడాది డిసెంబరు నెలాఖరు నుంచే పేను ఉధృతి మామిడి తోటల్లో ఎక్కువగా ఉండటంతో ఎన్ని మందులు కొట్టినా పేలు, నల్లి అదుపులోకి రాకపోవడంతో మామిడి రైతులు దిక్కుతోచని స్థితిలో విలవిల్లాడుతున్నారు. వీటి ఉధృతికి మామిడి చెట్లు పూతలేని ఒట్టి కాడలుగా మిగులుతున్నాయి. రెండేళ్ల క్రితం వరకు రెడ్డిగూడెం మండలం మామిడికి ప్రసిద్ధి గాంచింది. వాతావరణంలో మార్పులు, అతి ప్రమాదకర నల్లి, కోడి పేలు బారిన పడి మామిడి తోటలు పూత దశలోనే మాడిపోతున్నాయి. దీంతో మామిడి రైతులు విలవిల్లాడిపోతున్నారు. ఏడాది పొడవునా సస్య రక్షణ చర్యలు చేపట్టి, పెట్టుబడులు పెట్టి ఆశగా ఎదురు చూసే రైతులకు తీవ్ర నిరాశే మిగులుతోంది. ఉద్యానశాఖ అధికారులు సైతం నామమాత్రపు సదస్సు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారే తప్ప మామిడి రైతులకు సరైన అవగాహన కల్పించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

జిగురు అట్టలపై అవగాహన కల్పించాలి



తోటలో ఏర్పాటు చేసిన జిగురు అట్టలు

నల్లి, పేల నివారణకు జిగురు అట్టలు కడితే ఫలితాలు లభిస్తున్నప్పటికీ కొందరు రైతుల వల్ల పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. జిగురు అట్టలు కట్టిన తోటను వదిలేసిన పేలు, నల్లి ఇతర తోటలపై పడుతున్నాయి. అట్టలు ఉన్నంత వరకు తోటలకు రక్షణ ఉన్నా, మిగిలిన తోటల వల్ల వాటి ఉధృతి పెరిగి అట్టలు కట్టిన తోటలకు ప్రమాదం ఏర్పడుతోందని పలువురు రైతులు వాపోతున్నారు. ఉద్యానశాఖ అధికారులు పలు దఫాలుగా అవగాహన సదస్సులు పెట్టి జిగురు అట్టలు కట్టించే ఏర్పాట్లు చేస్తే నల్లి, పేలు నివారణ సాధ్యమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

రెండేళ్ల నుంచి తీవ్ర నష్టాలు

- కె.పరమేశ్వరరావు, రెడ్డిగూడెం



నల్లి, కోడి పేలు వల్ల రెండేళ్ల నుంచి తీవ్ర నష్టం జరుగుతోంది. ఏ మందు కొట్టినా అవి అదుపుకావడం లేదు. ఉద్యానశాఖ అధికారుల సూచనలు మేరకు జిగురు అట్టలు తోటలో చెట్టుకు ఆరు నుంచి ఏడు కట్టాను. కొంత వరకు ఫలితాన్ని ఇచ్చాయి. కోడిపేలు, నల్లి అట్టలపై వాలి అతుక్కుపోతున్నాయి. అందరూ అట్టలు పెట్టుకుంటే ప్రయోజనం ఉంటుంది.

చెట్టుకు రెండు అట్టలు చొప్పున పెట్టుకోవాలి

- నరేంద్ర కుమార్, ఉద్యాన అధికారి

నల్లి, పేను నివారణకు ఒక్కొక్క మామిడి చెట్టుకు బ్లూ, పసుపు జిగురు అట్టలు రెండు చొప్పున పెట్టుకోవాలి. ఫిప్రోనిల్ లీటర్ నీటికి రెండు మిల్లీ లీటర్లు థయోమిథాక్సిన్ లీటర్ నీటికి 0.3 గ్రాముల చొప్పున వారానికి ఒక సారి పిచికారీ చేసుకోవాలి.

హెల్మెట్‌లు లేకుంటే తిరగలేం

- చిట్టెంశెట్టి వెంకట రాధాకృష్ణ



సాయంత్రం వేళల్లో తోటల్లోకి హెల్మెట్ లేకుండా వెళ్లలేపోతున్నాం. తోటలు ఉన్న చోట్ల రహదారిపైనా తిరిగే పరిస్థితి లేదు. ఊరిలోకి ఇవి ప్రవేశించాయి. పెరట్లో పూలమొక్కలు బతికే పరిస్థితి లేదు. వీటి ఉధృతి ఈఏడాది అధికంగా ఉంది. నివారణకు సరైన మందు కనిపెడితే తప్ప మామిడి బతికే పరిస్థితి లేదు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్య బలోపేతమే లక్ష్యం



సదస్సులో మాట్లాడుతున్న వి జయరామరాజు

పటమట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా విద్యాశాఖ ముందుకు సాగుతుందని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు అన్నారు. మేరిస్టెల్లా కళాశాల ఆడిటోరియంలో బుధవారం ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని మానవవనరుల అధికారులు, హెచ్ఎంలతో నూతన విద్యా విధానంపై ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యను బలోపేతం చేసేందుకు మానవవనరుల విభాగంలో భాగస్వామ్యమయిన మేధావి వర్గంతో అవగాహనతో కూడిన శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టినట్టు చెప్పారు. ఎంపీయూపీ పాఠశాలలో 6, 7, 8 తరగతులు ఉన్నచోట విద్యార్థుల సంఖ్యను బట్టి ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు. నూతన ప్రతిపాదిత విద్యావిధానంలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా శాటిలైట్ ఫౌండేషన్, మోడల్ ప్రైమరీ, బేసిక్ ప్రైమరీ హైస్కూల్ పాఠశాలలను ఉన్నతీకరణ చేస్తామన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్లు డీకే బాలాజీ, జి.లక్ష్మీశ, జి.నాగమణి, డీఈవోలు యూవీ సుబ్బారావు, పీవీజే రామారావు, ప్రత్యేకాధికారులు, ఎమ్మీవోలు, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం బీర్..!

(5వ పేజీ తరువాయి)

పనికిరావు. సార్టెక్స్ చేయడానికి కూడా ఉపయోగపడవు. తడిసిన బియ్యం నిర్ణీత శాతం వరకు అయితే సార్టెక్స్ చేయటానికి పనికొస్తాయి. ఆ శాతం దాటితే మాత్రం రంగు మారిపోతాయి. ఆ బియ్యాన్ని కొనటానికి ఎవరూ సాహసించరని తెలిసినా రైతుల వద్ద భారీ ఎత్తున ప్రైవేట్ ధాన్యాన్ని వ్యాపారులు కొన్నారు. ఇలా కొన్న బియ్యాన్ని తమ సొంత మిల్లుల్లో కొందరు, బయట మిల్లుల్లో మరి కొందరు ఆడించారు. ఇలా ఆడించిన బియ్యాన్ని ఓ బీరు ఫ్యాక్టరీకి తరలించినట్టు తెలుస్తోంది. రంగుమారిన బియ్యం బాగా తడిచి ఉండటం వల్ల బీరు తయారీకి ఉపయోగపడింది. ఈ ధాన్యాన్ని నిల్వబెట్టి, పులియబెట్టి బీరు అసెన్స్ బయటకు తీశారు.

ఆర్థికభారాన్ని పోగొట్టుకునేందుకు..

ఈ ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఉమ్మడి కృష్ణాజిల్లాకు ప్రభుత్వం టార్గెట్లు విధించింది. ఈ క్రమంలో రైతుల నుంచి ధాన్యం కొన్న కొందరు ప్రైవేట్ వ్యాపారులు.. రైతుల ముసుగులో వాటిని కొనుగోలు కేంద్రాలకు విక్రయించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు విక్రయించిన లోడులో కొన్ని రంగుమారిన బియ్యం బస్తాలను కూడా వేసి పంపారు. మిల్లర్ల దగ్గరకు వెళ్లాక బియ్యం ఆడించి సార్టెక్స్ చేసేటపుడు రంగుమారిన బియ్యం కనిపించాయి. ఇలాంటి బియ్యాన్ని వేరు చేశారు. వందల టన్నుల కొద్దీ రంగుమారిన బియ్యం రావటంతో ఆ బియ్యం స్థానంలో తెల్లబియ్యం వేసి ఇవ్వాల్సి వచ్చింది. ఇలా చాలామంది మిల్లర్లు ఆర్థిక భారాన్ని చవిచూశారు. తొలుత లోడు తీసుకునేటపుడు తేమశాతాన్ని మాత్రమే చూసిన మిల్లర్లు లోడులో ఎక్కడో మధ్యభాగంలో వేసిన రంగుమారిన ధాన్యం బస్తాలను కనిపెట్టలేకపోయారు. ఇలా వేరు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు రూ.20కు బీరు ఫ్యాక్టరీకి విక్రయించారు. ఇలా వివిధ రూపాల్లో పీడీఎస్ బియ్యం బీరు ఫ్యాక్టరీకి చేరింది. ప్రకృతి విపత్తులు సంభవించి రైతులు కంట కన్నీరు పెట్టుకుంటుంటే, ప్రైవేట్ వ్యాపారులకు మాత్రం బీరు ఫ్యాక్టరీల పుణ్యమా అని లాభాల పంట పండింది. పీడీఎస్ బియ్యాన్ని కిలోకు రూ.20 నుంచి రూ.30 వరకు కొంటున్నారు. తక్కువ ధరకు కొని, మిల్లు ఆడించి బియ్యం తీయటం ద్వారా ప్రైవేట్ వ్యాపారులు బాగానే లాభపడుతున్నారు.



సాగు ఖర్చులకు అనుగుణంగా పంట రుణాలు

- అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని రుణ పరిమితి ప్రతిపాదనలు
- ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- డీఎల్‌టీసీ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వివిధ పంటల సాగు ఖర్చులకు అనుగుణంగా రైతులకు పంటరుణాల మంజూరుకు మార్గదర్శకాల ప్రకారం పటిష్ట ప్రణాళికతో చర్యలు తీసుకొంటున్నామని, స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనకు ప్రభుత్వం తీసుకొంటున్న చర్యల్లో రైతులు కీలక భాగస్వాములు కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. కృష్ణా జిల్లా కేంద్ర సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ - ఎన్టీఆర్ జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ (డీఎల్‌టీసీ) సమావేశం బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, ప్రగతిశీల, రైతులు, బ్యాంకర్లు తదితరులు హాజరుకాగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ పంటలకు ఎకరా విస్తీర్ణానికి రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్)పై ప్రతిపాదనల రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో ఖరీఫ్, రబీ సీజన్లలో వివిధ పంటల సాగు వ్యయం, దిగుబడి విలువ, రుణ పరిమితి వివరాలను పరిశీలించి, తదుపరి 2025-26 ఆర్థిక సంవత్సరంలో సాగు ఖర్చు, దిగుబడి విలువ అంచనాల ఆధారంగా నిర్ణయించాల్సిన రుణ పరిమితిపై వ్యవసాయం, ఉద్యాన, మత్స్య తదితర శాఖల అధికారులు తమ అభిప్రాయాలను సమావేశం ముందుంచారు. రైతులు వివిధ పంటల సాగుకు సంబంధించిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పంట కోతలు తదితరాలకు అయ్యే ఖర్చుల వివరాలను తెలియజేశారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ ద్వారా 2025-26కు గాను వరికి రుణ పరిమితి రూ.46వేలు, మిరప (డ్రై)కు రూ.1,10,000, మిరప (ఇరిగేటెడ్)కు రూ.1,15,000, మామిడికి రూ.42,500, ఆయిల్‌పామ్‌కు రూ.75 వేలు, పట్టు పురుగుల పెంపకానికి రూ.60,000 వివిధ పంటలు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు రుణపరిమితిని ప్రతిపాదించడం జరిగిందని వివరించారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (రుణ పరిమతికి) అదనంగా 30శాతం వరకు బ్యాంకులు రుణాలు మంజూ రు చేసేందుకు అవకాశముందన్నారు. సమావేశంలో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో ఎ.శ్యామ్ మనోహర్, జీఎం ఎ.రంగబాబు, అసిస్టెంట్ ఎల్‌డీఎం ఎం.రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి బి.విజయకుమారి, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, ప్రగతిశీల రైతులు, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

అన్ని నగరాల్లో అస్త్రం



ప్రమాణం చేస్తున్న సురక్షా కమిటీ కుదరవెల్లి వెంకట నరసయ్య, కృష్ణమూర్తి, అబ్దుల్ వహద్, తోట రవి, లక్ష్మీనారాయణ, శంకర రెడ్డి, ఎం.వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరస్వామి

(5వ పేజీ తరువాయి)

కమిషనరేట్ అధికారులు ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటుచేసిన 1,000 సీసీ కెమెరాలు, నూతనంగా ఏర్పాటుచేసిన సురక్ష కమిటీలు, మాదకద్రవ్యాలను అరికట్టడానికి అమర్చిన 'ఈగల్' వాహనాలను విజయవాడలో బుధవారం ప్రారంభించారు. అస్త్రం ఏఐ టూల్‌తో ట్రాఫిక్ సమస్యను పూర్తిగా పరిష్కరించకపోయినా కొంతవరకు ఫలితాలను సాధించవచ్చన్నారు. టెక్నాలజీని ఉపయోగించుకుని పనితీరును మెరుగుపరుచుకోవాలని చంద్రబాబు చేసిన సూచనలను ఎన్టీఆర్ జిల్లా పోలీసులు తూచా తప్పకుండా పాటిస్తున్నారని ఆమె కొనియాడారు. ట్రాఫిక్ నియంత్రణకు ఏఐ టూల్స్‌ను ఉపయోగించడం, బందోబస్తుల సమయంలో డ్రోన్లను వినియోగించడం మంచి పరిణామమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వంపై ఆధారపడకుండా ప్రజల భాగస్వామ్యంతో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించడం శుభపరిణామంగా పేర్కొన్నారు. ప్రజాభద్రత విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. పోలీసులు చేసే పనిని ప్రజల ఆమోదం తీసుకుని చేయడం కోసం సురక్ష కమిటీలను ఏర్పాటు చేశారన్నారు. ప్రజలతో పనిచేయించే బాధ్యతను పోలీసులు తీసుకోవడం మామూలు విషయం కాదన్నారు. డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసుల పనితీరును మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు దర్యాప్తు తీరును, ప్రవర్తనను, ఆలోచనా విధానాలను మార్చుకుని ప్రజలకు మెరుగైన సేవలను అందించాలన్నారు. రాష్ట్రంలో ప్రతి వీధి నిఘాలో ఉండేలా మార్చి నెలాఖరునాటికి లక్ష సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రజా భద్రతకు సీసీ కెమెరాలు దోహదపడతాయన్నారు. ఫోర్స్ మల్టీప్లేయర్స్‌గా డ్రోన్లు, సీసీ కెమెరాలను ఉపయోగించుకోవాలని సూచించారు. చోరీలను అరికట్టడానికి పోలీసు శాఖ రూపొందించిన ఎల్‌హెచ్ఎంఎస్‌ను వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రాన్ని సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తయారు చేస్తామని స్పష్టం చేశారు. మహిళా పోలీసులకు హోంమంత్రి సహా నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య హెల్మెట్లను అందజేశారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళాలిచ్చిన కుదరవెల్లి వెంకట నరసయ్య, కృష్ణమూర్తి, అబ్దుల్ వహద్, తోట రవి, లక్ష్మీనారాయణ, శంకరరెడ్డి, ఎం.వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరస్వామిని హోంమంత్రి, డీజీపీ సత్కరించారు. నూతనంగా నియమించిన సురక్ష కమిటీకి వెంకట నరసయ్యను కో-ఆర్డినేటర్‌గా నియమించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని చిన్ని, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యేలు శ్రీరాం తాతయ్య, గద్దె రామ్మోహన్, వసంత కృష్ణప్రసాద్, బొండా ఉమామహేశ్వరరావు, కొలికపూడి శ్రీనివాసరావు, తంగిరాల సౌమ్య, కామినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బెజవాడ ఫ్రెండ్లీ పోలీసింగ్

- కేశినేని శివనాథ్, ఎంపీ

ఫ్రెండ్లీ పోలీసింగ్(ఎఫ్‌పీ)కి నిదర్శనం విజయవాడ. రాష్ట్రంలో అన్ని జిల్లాలో ఈ తరహా పోలీసింగ్ అమలు చేయాలి. పోలీసు కమిషనర్ ప్రజలకు చెంతకు పోలీసులను తీసుకెళ్తున్నారు. ఇంతకుముందున్న సీపీ ఏదో ఒక సమస్యను సృష్టించేవారు. బెజవాడలో డ్రోన్ షో నిర్వహించిన తర్వాత అన్ని పోలీస్‌స్టేషన్లకు డ్రోన్లను సమకూర్చాలని సీపీ నిర్ణయించారు. నా వద్దకు వచ్చి డ్రోన్లను సమకూర్చాలని కోరారు. నా వంతుగా పది డ్రోన్లను సీఎస్ఆర్ కింద ఇచ్చాను. తర్వాత ఎమ్మెల్యేలు డ్రోన్లను విరాళంగా ఇచ్చారు. బెజవాడ అంటే గొడవల నగరం అనే ముద్ర ఒకప్పుడు ఉండేది. ఈ ముద్రను మీడియా మాత్రం వదలడం లేదు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. పోలీసు నివాస సముదాయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటికి మరమ్మతులు చేయించడానికి నిధులు కేటాయించాలి. కమిషనరేట్‌కు అదనపు సిబ్బందిని నియమించాలి.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ఉపయోగించాలి

- కొలికలపూడి , తిరువూరు ఎమ్మెల్యే

నేను హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో చదువుతున్న రోజుల్లో బైక్‌పై వేగంగా వెళ్తుండగా బేగంపేట ఫ్లైఓవర్‌పై ఆటో అడ్డంగా రావడంతో అదుపుతప్పి పడిపోయాను. 20-30 అడుగుల దూరం దొర్లుకుంటూ పడ్డాను. ఆ సమయంలో నేను ధరించిన



హెల్మెట్ రెండు ముక్కలుగా పగిలిపోయింది. యువత ఎక్కువగా స్పోర్ట్స్ బైక్‌లను నడుపుతున్నారు. ఉద్యోగులు, యువకులు, ప్రజలు బైక్‌లు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.

ఇతర రాష్ట్రాలకు 'ఎన్టీఆర్' ఆదర్శం

- తంగిరాల సౌమ్య, నందిగామ ఎమ్మెల్యే

ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండాలి. వైసీపీ పాలనలో నేరాలు ఎక్కువ, పోలీసింగ్ తక్కువగా కనిపించేది. కూటమి పాలనలో పోలీసింగ్ ఎక్కువ, నేరాలు తక్కువగా కనిపిస్తున్నాయి.

నిధులు కేటాయించాలి

- వసంత కృష్ణప్రసాద్, మైలవరం ఎమ్మెల్యే

శాసన వ్యవస్థ, పోలీసు వ్యవస్థ కలిసి పనిచేస్తే ఎలాంటి ఫలితాలను సాధించవచ్చన్న దానికి ఎన్టీఆర్ కమిషనరేట్ నిదర్శనం. ఇప్పటి వరకు రాష్ట్రంలో అనేక కార్యక్రమాలు జరిగాయి. ఏ కార్యక్రమంలోను కూటమి ఎమ్మెల్యేలంతా పాల్గొన్నట్టుగా కనిపించలేదు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ అధికారులు నిర్వహించిన కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యేలంతా పాల్గొనడం విశేషం. పోలీసు వ్యవస్థ కోల్పోయిన ప్రతిష్టను సీపీ రాజశేఖరబాబు తీసుకొస్తున్నారు. విజయవాడ పోలీసులకు అవసరమైన నిధులను హోంమంత్రి కేటాయించాలి.

ఇంకా గంజాయి సమస్య ఉంది

- గద్దె రామ్మోహనరావు, తూర్పు ఎమ్మెల్యే

విజయవాడ నగరంలో చాలా వరకు గంజాయి సమస్య తగ్గింది. ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఉంది. దీన్ని సమూలంగా తొక్కేయాలి. గంజాయి మత్తులో వ్యసనపరులు ప్రజల పట్ల ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. నేరాలను అరికట్టడానికి, నేరం చేసిన వారిని గుర్తించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. చంద్రబాబు 2014లోనే కమ్యూనిటీ పోలీసింగ్ విధానాన్ని తీసుకొచ్చారు. వైసీపీ ప్రభుత్వం పోలీసు వ్యవస్థను స్వలాభాలకు ఉపయోగించుకుని నిర్వీర్యం చేసింది.

వ్యవస్థలను గాడిన పెడుతున్నాం

- బొండా ఉమా, సెంట్రల్ ఎమ్మెల్యే

వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన వ్యవస్థలను కూటమి ప్రభుత్వం గాడిన పెడుతోంది. రాజశేఖరబాబు సీపీగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి నగరంలో పోలీసు వ్యవస్థ పరుగులు తీస్తోంది. ఒక విజన్ ఉన్న సీఎం కింద పనిచేసే అధికారులు దాన్ని అందిపుచ్చుకుంటే ప్రజలకు అద్భుతమైన సేవలను అందివచ్చని విజయవాడ పోలీసులు చూపించారు. నిధుల కోసం ప్రభుత్వంపై ఆధారపడకుండా పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు సొంత నిధులతో 1150 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం సంతోషకరం.

అన్నీ అమర్చుకుంటూ అడుగులు వేస్తున్నాం

- ఎస్వీ రాజశేఖరబాబు, పోలీసు కమిషనర్

నేను బాధ్యతలు తీసుకునే సమయానికి సదుపాయలన్నీ పక్కన పడిపోయాయి. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎల్ఈడీ స్క్రీన్ పనిచేయడం లేదు. సిబ్బంది లేరు. మోడల్ గెస్ట్‌హౌస్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ పరిస్థితి ఇదే. ఫాల్కన్ వాహనాన్ని పక్కన పెట్టేశారు. ఇలా ఒక్కోదాన్ని గాడిన పెట్టుకుని అడుగులు వేస్తున్నాం. 10వేల మీటర్ల రోప్‌ను కొనుగోలు చేశాం. డ్రాగన్ లైట్లను, బెల్‌హారన్స్‌ను సమకూర్చుకున్నాం. కమిషనరేట్ పరిధిలో ప్రభుత్వం 1900 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. వాటికి అదనంగా 10వేల సీసీ కెమెరాలను ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రజల ఖాతాలను ఖాళీ చేస్తున్న సైబర్ నేరాలపై యుద్ధం చేయాలని నిర్ణయించుకున్నాం. డ్రోన్లను ఉపయోగించుకుని దసరా, భవానీ దీక్షల విరమణలను ఎలాంటి గందరగోళం లేకుండా విజయవంతంగా పూర్తి చేశాం. ప్రజల్లో భద్రతా సంస్కృతిని పెంపొందించడానికి సురక్ష పేరుతో కోర్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నాం. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కమిటీలు ఉంటాయి. ఒక డ్రోన్ 1000 మంది పోలీసులతో సమానం, ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులకు సమానం. అందుకే డ్రోన్, సీసీ కెమెరాలను విరివిగా వినియోగిస్తున్నాం. మహిళా పోలీసులు, సచివాలయాల్లోని మహిళా పోలీసుల్లో 100 మందిని డ్రోన్ పైలెట్లుగా తయారు చేశాం. రాబోయే రోజుల్లో మరింత వినూత్నంగా ముందుకు అడుగులు వేస్తాం. కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న హెల్మెట్ డ్రైవ్ వల్ల మంచి ఫలితాలు వచ్చాయన్నారు. నగరంలో 85శాతం వాహనదారులు హెల్మెట్ ధరిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	148,157, 168
చికెన్ విత్ స్కిన్	286
చికెన్ స్కిన్‌లెస్	296

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 500

నలందలో ప్రాంగణ ఎంపికలు..18 మందికి ఉద్యోగాలు



లబ్బీపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నలంద కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో ముత్తూట్ ఫిన్‌కార్ప్ కంపెనీకి డిగ్రీ విద్యార్థులు 18మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ తెలిపారు. బిజినెస్ డవలప్‌మెంట్, ఎగ్జిక్యూటివ్, గోల్డ్ ఇన్‌స్పెక్టర్ జాబులకు 3రౌండ్లు ఇంటర్వ్యూ నిర్వహించగా 80మంది పాల్గొనగా వారిలో 18మంది ఉద్యోగార్హత పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్తూట్ ఫిన్‌కార్ప్ హెచ్.ఆర్.మేనేజర్ అబ్దుల్ సలీమ్ షేక్, కృశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.చంద్రగిరి పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా నగరాన్ని అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అమరావతికి ముఖద్వారంగా ఉన్న విజయవాడ నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడానికి సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. బుధవారం 13వ డివిజన్ కోనేరు వారి వీధిలో రూ.20లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రెయినేజీ పనులకు, మరో రూ.20 లక్షలతో జేడీ నగర్‌లో నిర్మాణం చేయనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్న పాటి వర్షానికి సైతం రహదారుల్లో నీరు నిల్వ ఉంటుందని, అలా లేకుండా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టినట్లు చేపట్టారు. అన్ని రహదారులను సీసీ రహదారులుగా మార్చేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. నగరాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణలు నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గద్దె ప్రసాద్, కార్పొరేటర్ మున్ననేని ప్రసాద్, నాయకులు వేమూరి బాబురావు, గుమ్మడి కృష్ణారావు, సొంటి నాగేశ్వరరావు, వీరంకి డాంగే కుమారి, పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న గద్దె రామ్మోహన్

కార్యకర్తలే టీడీపీకి బలం, బలగం

భారతీనగర్: టీడీపీకి బలం, బలగం కార్యకర్తలేనని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నాల్గవ డివిజన్‌లోని గురునానక్ కాలనీకి చెందిన దాసరి ప్రభుజ్యోతి, తుమ్మల దుర్గాభవాని, బండి స్వాతి లక్షరూపాయలను టీడీపీ యాప్‌లో చెల్లించి జీవితకాల సభ్యత్వాన్ని బుధవారం తీసుకున్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఈ కార్యక్రమానికి హాజరై స్వయంగా వారికి ఆన్‌లైన్ ద్వారా సభ్యత్వ నమోదు రశీదులను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు అన్న ఎన్టీఆర్ ఒక్కరితో ప్రారంభమైన టీడీపీ ప్రయాణం నేడు కోటిమంది సభ్యత్వాలు తీసుకొని అతి పెద్ద కుటుంబంగా మారిందని అన్నారు. సాధారణ సభ్యత్వాలతో పాటుగా జీవితకాల సభ్యత్వాలను నియోజకవర్గంలో ఎక్కువ మంది తీసుకున్నారని తెలిపారు. జీవితకాల సభ్యత్వాలు తీసుకున్న వారి జాబితాలో రాష్ట్రంలో తూర్పు నియోజకవర్గం 5వ స్థానంలో ఉందని తెలిపారు. టీడీపీలో సభ్యత్వం ఉన్న ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. జాస్తి సాంబశివరావు, గద్దె రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్కినేని నాగేశ్వరరావు వర్ధంతి



కార్యక్రమంలో పాల్గొన్న సర్వేశ్వరరావు తదితరులు

ధర్నాచౌక్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అక్కినేని నాగేశ్వరరావు 11వ వర్ధంతి ఆలిండియా అక్కినేని నాగార్జున యువసేన అధ్యక్షుడు సర్దార్ ఎన్.సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. గాంధీనగర్‌లోని కామాక్షి కార్యాలయం సెంటర్‌లో ఆయన చిత్రపటానికి, తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న అక్కినేని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్మల్ హృదయ భవన్ అనాథ ఆశ్రమంలో అనాథలకు పాలు, బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా 'శిల్పాకళారత్న' డి.దేవికారాణి శిల్పి వుడయార్, సీనియర్ అభిమానులు బ్రహ్మదేశం వసంతకుమార్, కొండాయగుంట రాము, ఏడుకొండలు, షఫీ, రామవులు, టి.శేఖర్, కే.ప్రభాకర్, ఎస్‌కే బాషా, ఏ.చిన్ని, ప్రదీప్, భాస్కర్, శివమణి, ఈడీ రాజు, హనుమంతరావు, నాగు తదితరులు పాల్గొన్నారు.

25న జాబ్‌మేళా

భారతీనగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించాలని లక్ష్యంతో ఎన్టీఆర్ వికాస ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో శనివారం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఎస్‌వీ సాఫ్ట్‌సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఫ్లట్టర్ డెవలపర్, హెచ్‌ఆర్ రిక్రూటర్, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం ఇన్ డిజిటల్ మార్కెటింగ్, టెక్నోటాస్క్ బిజినెస్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్‌లో బీపీవో, బిలింకిట్ కంపెనీలో పిక్కర్, ప్యాకర్, యాక్సిస్ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్(బీఆర్ఈ), ఇండో ఎంఐఎం కంపెనీలో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ ఉత్తీర్ణులైన 30ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు. వీరికి నెలకు వేతనం రూ.12 వేల నుంచి రూ.30వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఎన్టీఆర్ వికాస కార్యాలయానికి ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 7799376111, 9849465427 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

లైసెన్స్ లేకుండా నడిపితే వాహనం సీజ్

సీఐ రామారావు



పత్రాలు లేని వాహనాలు సీజ్ చేస్తున్న ట్రాఫిక్ సీఐ రామారావు

గుణదల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలను లైసెన్స్ లేకుండా నడిపితే సదరు వాహనాన్ని సీజ్ చేస్తామని నాల్గవ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ రామారావు తెలిపారు. వాహనాల తనిఖీలో భాగంగా ఆయన బుధవారం రమేష్ హాస్పటల్ జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనచట్ట నిబంధనల ప్రకారం 18 ఏళ్లలోపు వారు వాహనం నడపడం నేరమని, 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ లైసెన్స్ తీసుకోవాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతూ పట్టుబడితే సదరు వాహనాన్ని సీజ్ చేయడమే కాకుండా వాహనం ఎవరి పేరుమీద ఉంటుందో వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. త్రిబుల్ రైడింగ్ కూడా ఉపేక్షించేది లేదన్నారు. నోపార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేసి వెళితే అటువంటి వాహనాలను డంపింగ్ యార్డ్‌కు తరలిస్తామని హెచ్చరించారు. వాహనాల తనిఖీ సమయంలో లైసెన్స్ వాహనపత్రాలు, ఇన్సూరెన్స్, పొల్యూషన్ పత్రాలు చూపడంతోపాటు హెల్మెట్ తప్పని సరిగా ఉండాలన్నారు.



పరికరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్

నియోథర్మల్ కూలెంట్ పరికరం ప్రారంభం

ప్రభుత్వాసుపత్రి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సర్వజనాసుపత్రిలో పిల్లలకు, నవజాత శిశువులకు ఉపయోగపడే అత్యవసర వైద్య పరికరం నియోథర్మల్ కూలెంట్‌ను బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీ రావు, సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్ కుమార్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వోడీ డాక్టర్ అనిల్‌కుమార్, ప్రొఫెసర్ సునీత, రమణారావు, రామాంజనేయులు, ఖ్యాతి, దీప్తి, అశ్విని, స్వాతి, శేషురాం, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు కథానిక పోటీల్లో చాముండేశ్వరి ఫస్ట్



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

విజయవాడ కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో ఎల్‌వీఎస్ చాముండేశ్వరి(సీనియర్ ఇంటర్) తెలుగు కథానిక పోటీల్లో మొదటి బహుమతి సాధించింది. ఈనెల 12న విద్యావికాస వాహిని సంస్థ కంకిపాడులో నిర్వహించిన తెలుగు కథానిక పోటీల్లో మొదటి బహుమతి రూ.1500 గెలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల పద్మజ తెలిపారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సాహిత్యం, కళలు, సర్వతోముఖాభివృద్ధికి సంస్థ ప్రోత్సాహాన్ని అందిస్తుందని వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు ఎల్‌వీఎస్ చాముండేశ్వరిని అభినందించారు.

ఆదిత్యలో ఘనంగా రోటరాక్ట్స్ ఇన్‌స్టాలేషన్



జ్యోతి వెలిగిస్తున్న రొటేరియన్స్

పటమట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బెంజిసర్కిల్ వద్ద ఉన్న ఆదిత్య డిగ్రీ కళాశాలలో బుధవారం రోటరాక్ట్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రోటరీ క్లబ్ విజయవాడ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమానికి డాక్టర్ శ్రీదేవి అధ్యక్షత వహించారు. ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా డాక్టర్ పట్టాభిరామయ్య, డాక్టర్ ఎంసీ దాస్‌లు వ్యవహించారు.

నూతనంగా ఏర్పడిన క్లబ్‌కు ఆటోమా ఆఫ్ ఆదిత్యా, కారుణ్య ఆఫ్ ఆదిత్యా అని లోగోలు విడుదల చేశారు. చార్టర్ క్లబ్ ఆటోమా ప్రెసిడెంట్‌గా కె.అభిషేక్, కారుణ్య క్లబ్ చార్టర్ క్లబ్ ప్రెసిడెంట్ కె.లలితలు బాధ్యతలు స్వీకరించారు. విద్యార్థుల్లో నైపుణ్యంతో పాటు నాయకత్వ లక్షణాలు నేర్పేందుకు క్లబ్‌లు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.వీర్రాజు, రవి, హర్షిత, సుంకర ఫణీంద్ర, వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర వర్మ, తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

వన్‌టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రామవరప్పాడు- విజయవాడ నార్త్‌ఈస్ట్ రైల్వే స్టేషన్ల మధ్య ట్రాక్ పై గుర్తు తెలియని 55 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం ఉదయం జరిగింది. విజయవాడ రైల్వే పోలీసులకు అందిన సమాచారం మేరకు డబ్ల్యూఆర్‌పీ ఎస్‌ఐ వి.జయమ్మ కేసు నమోదు చేసుకుని సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా గుర్తించారు. మృతుడి శరీరం రెండు ముక్కలుగా విడిపోయింది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. వివరాలు తెలిసినట్లయితే ఎస్‌ఐ వి.జయమ్మ (9866909335)కు సమాచారం అందించాలని ప్రకటనలో కోరారు.

రహదారిపై కంకరతో ప్రమాదాలు

- స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని వినతి

ప్రభుత్వాసుపత్రి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉంటే ఈఎస్‌ఐ రహదారిపై చిందర వందరగా కంకర పడి ఉండటంతో పలు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఆసుపత్రి లోనికి వెళ్లేందుకు నూతనంగా కల్వర్టును నిర్మించారు. అయితే అందుకు వినియోగించిన కంకరను పూర్తిగా తొలగించకుండా రోడ్డు మీద వదిలేయడంతో ఇక్కడ పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. అసలే ఆసుపత్రి ఏరియా రోగులు వచ్చి పోతుంటారు. దీంతో ఇక్కడ వాహనాల వేగం నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. అధికారులు స్పందించి కంకరను శుభ్రం చేయడంతో పాటు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయించాలని రోగులు వేడుకుంటున్నారు.



ఈఎస్‌ఐ ఆసుపత్రి ఎదుట ఉన్న రహదారిపై వదిలేసిన కంకర

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరో ఇరువురికి గాయాలు

గుణదల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్కూటీపై వెళుతున్న ముగ్గురు యువకులను అతి వేగంగా వచ్చిన లారీ వెనుక నుంచి ఢీ కొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇరువురికి గాయాలైన ఘటన మహానాడు జంక్షన్ వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగింది. వివరాల ప్రకారం జక్కుల వినయ్(19), జీవన్(22), గోపి (26)లు రామవరప్పాడులో ఉంటున్నారు. వీరు ముగ్గురు బెంజిసర్కిల్ వద్ద ఓ షాపింగ్‌మాల్ రెస్టారెంట్లో చెఫ్‌లుగా పనిచేసి జీవనం సాగిస్తున్నారు. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని ముగ్గురూ ఒకే ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతుండగా మహానాడు జంక్షన్ వద్దకు వచ్చే సరికి వీరు ప్రయాణిస్తున్న స్కూటీని వెనుక నుంచి అతివేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో వాహనం నడుపుతున్న గోపి మీద నుంచి లారీ టైరు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇరువురికి గాయాలయ్యాయి. వీరిని స్థానికులు ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గోపి మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. సమాచారం అందుకున్న మాచవరం సీఐ ప్రకాష్, నాల్గవ ట్రాఫిక్ సీఐ రామారావులు ఘటనా స్థలానికి చేరుకుని పూర్వాపరాలు సేకరించారు. వినయ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మాచవరం పోలీసులు తెలిపారు.

భర్త కనిపించడం లేదంటూ ఫిర్యాదు

వన్‌టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భర్త కనిపించడం లేదంటూ ఓ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. గొల్లపూడి పంట కాల్వ రోడ్డు హిమజ్ఞ రెసిడెన్సీలో షేక్ మహమ్మద్ ముస్తఫా భార్య, కుమారుడితో ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా ముస్తఫా భార్య షేక్ నూరే రబ్బానీ కుమారుడిని తీసుకుని 10న హైదరాబాద్‌లోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. అప్పటి నుంచి ఆమె భర్తతో తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండేది. రబ్బానీ ఈనెల 19న భర్తకు వీడియోకాల్ చేయగా, ఇంట్లోనే ఉన్నానని చెప్పి కట్ చేశాడు. ఆ తరువాత నుంచి అతని ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంది. 20న హైదరాబాద్ నుంచి ఇంటికి చేరుకోగా ముస్తఫా కనిపించక పోవటంతో స్నేహితులు, బంధువుల వద్ద వెతికినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. రబ్బానీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇద్దరు పిల్లలు సహా...

నగరానికి చెందిన జ్యోతి(32) కి గంధవరపు అశోక్‌తో 2011లో వివాహమైంది. వీరికి కుమార్తె నాగ దీపశ్రీ (5), కుమారుడు పన్నశ్రీ (4) ఉన్నారు. జ్యోతి ఈనెల 16న పుట్టింటికి వెళుతున్నానని ఇద్దరు పిల్లలను తీసుకుని వెళ్లింది. అశోక్ జ్యోతి తల్లికి ఫోన్ చేసి అడుగగా ఇంటికి రాలేదని చెప్పింది. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా, జ్యోతి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంది. దీంతో బంధువులు, స్నేహితులు వద్ద వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. జ్యోతి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రికెట్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

మైలవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మైలవరం ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళా క్రికెట్ సెలక్షన్స్‌లో పలు కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారిణుల ప్రతిభను గుర్తించి ఒక జట్టుగా తయారు చేశారు. వారు ఈనెల 23 నుంచి యూనివర్సిటీ ఆఫ్ మైసూరు, కర్ణాటకలో నిర్వహించే దక్షిణ భారత అంతర్ విశ్వ విద్యాలయ పోటీలకు పంపుతున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి బుధవారం తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం పనితీరు పరిశీలన

గవర్నర్‌పేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పనితీరును బుధవారం 23వ డివిజన్ కార్పొరేటర్, వీఎంసీ టీడీపీ ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి పరిశీలించారు. వీఎంసీ సీవీఆర్ స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలసి బాలస్వామి భోజనం చేశారు. భోజనం ఏర్పాట్ల విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీవీఆర్ స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి

వచ్చేనెల 3 నుంచి బ్రహ్మోత్సవాలు

● పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్లను, కరపత్రాలను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన్ను ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద్ మాట్లాడుతూ ఫిబ్రవరి 3 నుంచి 6 వరకు జరిగే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 3న కల్యాణం, 4న రథోత్సవం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈసారి ప్రత్యేక ఆకర్షణగా 6న స్వామివారి కోనేటిలో కల్యాణ మూర్తుల తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఘనాపాటి నౌడరి విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మ, సీనియర్ అసిస్టెంట్లు బర్మా ప్రసాద్, తోట చెన్నకేశవ, కంప్యూటర్ ఆపరేటర్ పయ్యావుల నాగరాజు పాల్గొన్నారు.

దుర్గగుడి ప్రధాన అర్చకుడు

బదరీనాథ్ బాబు కన్నుమూత



వన్‌టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి ప్రధాన అర్చకుడు లింగంభొట్ల బదరీనాథ్ బాబు (65) గుండెపోటుతో మృతిచెందారు. కామకోటినగర్‌లోని అరవింద వీధిలో తన నివాసంలో బుధవారం ఉదయం నిద్రనుంచి స్నానానికి వెళ్లబోతుండగా దడ వచ్చి పడిపోయారని, తరువాత శ్వాస ఆడకపోవటంతో కన్నుమూసినట్టు తెలిసింది. బదరినాథ్ బాబు దేవస్థానంలో సాధారణ అర్చకుడిగా 1980లో ప్రవేశించారు. అక్కడి నుంచి 2009లో ప్రధాన అర్చకుడిగా నియామకం పొందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె. ఈ ఏడాది మేలో పదవీ విరమణ చేయనున్నారు. ఇంతలోనే ఆకస్మికంగా మృతిచెందారు. 6 నెలల క్రితం ఆయనకు వారసత్వపు హక్కులను కల్పిస్తూ దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసిం ది. ఆయన మృతి వార్త తెలుసుకున్న అర్చక, ఉద్యోగుల బృందం సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అంతిమయాత్రలో పలువరు అర్చకులు పాల్గొన్నారు. శాస్త్రవిహితంగా అంత్యక్రియలు జరిపారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, దుర్గగుడి ఈవో, గురువారం నుంచి ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు తీసుకోనున్న రామచంద్రమోహన్, తాజా మాజీ ఈవో కేఎస్ రామారావు, పలువురు అధికారులు బదరినాథ్ బాబు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మంత్రి రామనారాయణ రెడ్డి నివాళి

బదరీనాథ్ బాబు అకాల మరణం ఎంతో బాధాకరమని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. దుర్గమ్మ అలంకరణ, ఆచార వ్యవహారాల్లో అపార అనుభవంతో సేవలందించారన్నారు. బదరీనాథ్ బాబు కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు.

త్వరలో లాయర్లకు రక్షణ చట్టం!



అమల్లోకి రానున్న ముసాయిదా బిల్లుతో న్యాయవాదులకు భద్రత, సంక్షేమం

● సిద్ధం చేసిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)
● అధ్యయనం చేసిన బెజవాడ బార్ కౌన్సిల్

విజయవాడ లీగల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): న్యాయం పక్కన నిలబడినప్పుడో, అన్యాయంపై గట్టిగా వాదనలు వినిపించేటపుడో తమ పుట్టి మునిగిపోతోందనుకున్నపుడు న్యాయవాదులపై దాడులు జరుగుతున్న పరిస్థితి! చట్టాలకు లోబడి బాధితులకు అండగా వాదనలు వినిపించే న్యాయవాదులకే రక్షణ లేనపుడు ఆ చట్టాలే అపహాస్యం పాలౌతాయి. దేశ వ్యాప్తంగా న్యాయవాద సంఘాల పోరాట ఫలితంగా అతి త్వరలో న్యాయవాదులకు మంచి రోజులు రానున్నాయి. న్యాయవాదులపై దాడులకు పాల్పడకుండా వారి రక్షణ, సంక్షేమానికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) 2021లో ముసాయిదా బిల్లును సిద్ధం చేసింది. ఈ బిల్లు కేంద్ర కేబినెట్‌లో ప్రవేశపెట్టి, పార్లమెంట్‌లో ఆమోదం పొందాక చట్టంగా రూపుదిద్దుకొంటుంది. ఈ బిల్లును బెజవాడ బార్ కౌన్సిల్ అధ్యయనం చేస్తోంది. న్యాయవాదులకు నూరుశాతం రక్షణ కల్పించేలా ఉందని అభిప్రాయపడుతున్నారు. బీసీఐ సిద్ధం చేసిన బిల్లును ఒకసారి పరిశీలిస్తే ఐదు అంశాలు పరిగణలోని తీసుకొని రూపొందించినట్లు తెలుస్తోంది. ఎవరైనా సరే న్యాయవాదులను భయభ్రాంతులకు గురి చేయకూడదు. మానసికంగా, భౌతికంగా హింసించకూడదు. వివిధ రూపాల్లో ఒత్తిడి తేకూడదు. దాడులకు తెగపడకూడదు. తప్పుడు కేసులు పెట్టకూడదు. ఈ ఐదు కీలకాంశాలను దృష్టిలో పెట్టుకుని న్యాయవాదుల రక్షణ బిల్లు - 2021కు ముందడుగు పడింది.



న్యాయవాదుల బిల్లులోని ముఖ్యాంశాలు


న్యాయవాదులపై ఎవరైనా నేరాలకు పాల్పడితే 6 నెలల నుంచి ఐదేళ్ల వరకు జైలుశిక్ష, రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించవచ్చని తెలిపింది. న్యాయవాదులపై విచారణకు డీఎస్పీ లేక ఏసీపీ పై స్థాయి అధికారులే విచారణ చేయాలి. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన 30 రోజుల్లోపు విచారణ పూర్తిచేసి చార్జిషీటు దాఖలు చేయాలని బిల్లులో పేర్కొంది. న్యాయవాదులపై పోలీసులు ఎఫ్ఐఆర్ కట్టాలంటే చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అనుమతి తప్పనిసరని, న్యాయవాదులపై చేసే ఆరోపణలకు కానీ, ప్రైవేటు వ్యక్తులపై న్యాయవాదులు చేసే ఆరోపణలకు కానీ 'రెడ్రెసల్' (పరిష్కార కవిుటీ) కమిటీకి నివేదించాలి. ఈ కమిటీలు జిల్లా కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టు స్థాయిలో ఉంటాయన్నారు. ప్రజలు - న్యాయవాదుల వివాదాలను ఈ కమిటీల ద్వా రానే పరిష్కరించుకోవాలి. ఈ బిల్లు ప్రకారం న్యాయవాదికి ఊహించని నష్టం జరిగినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి నెలకు రూ.15వేలు తక్కువ లేకుండా ఆర్థిక సహకారం అందజేస్తాయి. దీన్నే బీసీఐ ముసాయిదా బిల్లులో 'సోషల్ సెక్యూరిటీ' కింద పరిగణించింది. ఈ బిల్లుపై పలువురు సీనియర్ న్యాయవాదులు తమ అభిప్రాయాలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు. ఆ వివరాలిలా ఉన్నాయి.

న్యాయవాదులపై దాడులుండవు
వి.గురునాథం, బెజవాడ బార్ మాజీ అధ్యక్షుడు




ఈ బిల్లు కేంద్ర కేబినెట్ ఆమోదం పొంది పార్లమెంట్‌లో చట్టరూపం దాల్చితే దేశంలోని ఏ న్యాయవాదిపైనా దాడులు జరగవు. ఇటీవల పోలీసులు న్యాయవాదులపై తప్పుడు కేసులు పెడుతున్నారు. వాటిని నియంత్రించేలా బిల్లులో రక్షణ కల్పించారు. దీంతో పోలీసులు న్యాయవాదులపై తప్పుడు కేసులు పెట్టేందుకు వెనుకాడతారు.

ఈ చట్టం ఎంతో ఉపయోగకరం
అరిగెల శివరాంప్రసాద్ (రాజా), బెజవాడ బార్ ప్రధాన కార్యదర్శి



ఈ రక్షణ చట్టం అమల్లోకి వస్తే న్యాయవాదులపై దాడులు కానీ, బెదిరింపులు కానీ, తప్పుడు కేసులు కానీ, హత్యలు కానీ జరగవు. న్యాయాన్ని పరిరక్షించే న్యాయవాదులకే రక్షణ లేకపోతే ఎలా? వీలైనంత త్వరగా ఈ చట్టాన్ని అమలులోకి తెస్తే ఎంతోమంది న్యాయవాదులకు ఉపయోగకరం.

బిల్లుతోనే రక్షణ, సంక్షేమం
చేకూరి శ్రీపతి, మాజీ బార్ అధ్యక్షుడు



న్యాయవాదుల రక్షణ చట్టం అమల్లోకి వస్తే కేవలం రక్షణ మాత్రమే కాకుండా సంక్షేమం కూడా అమలవుతుంది. న్యాయవాదులు ప్రమాదాల బారిన పడినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెలకు రూ.15వేలకు తక్కువ కాకుండా ఇవ్వాలని బిల్లులో పెట్టడం ముదావహం.

ఈ చట్టం త్వరగా అమల్లోకి రావాలి
బొమ్మసాని రవి, బార్ మాజీ ప్రధాన కార్యదర్శి



దేశంలోని అనేక రాష్ట్రాల్లోని న్యాయవాదులు ఎన్నాళ్లగానో కోరుకొంటున్న న్యాయవాదుల రక్షణ చట్టం ఇప్పటికైనా బీసీఐ ముసాయిదా బిల్లుతో బీజం పడింది. త్వరలోనే బిల్లు చట్టరూపం దాల్చితే న్యాయవాదులకు రక్షణ ఉంటుందనేది నిర్వివాదాంశం.

అయ్యప్ప స్వామి దేవాలయంలో హుండీ చోరీ

కోడూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కోడూరు అయ్యప్ప స్వామి దేవాలయంలో హుండీ చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆలయ ధర్మకర్త బడే భావన్నారాయణ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 15వ తేదీన శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లిన అనంతరం హుండీ చోరీ జరిగినట్లు తెలిపారు. అయ్యప్ప ఆలయం కింద ఉన్న కల్యాణ మండపంలో మాల ధరించిన స్వాములు నిత్యం పూజ చేసుకునేందుకు ఏర్పాటు చేసిన అయ్యప్ప పీఠం వద్ద ఉన్న హుండీని గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం కోడూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆలయం వద్ద ఉన్న సీసీ కెమెరాలు పరిశీ లించారు. హుండీ తీసుకువెళ్తున్న వ్యక్తి కనిపించగా, అతను ఎవరు అనేది తెలియలేదని తెలిపారు.

బస్సు బంపర్ తగిలి ఇరువురికి గాయాలు

పెదపారుపూడి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గుడివాడ - విజయవాడ వెళ్లే రహదారి మంచు కారణంగా బస్సు బంపరు తగిలి వాహనదారులకు గాయాలయ్యాయని గ్రామస్థులు తెలిపారు. వివరాల ప్రకారం గుడివాడ నుంచి విజయవాడ వెళ్లే నాన్ స్టాప్ వానపాముల గ్రామం వద్ద గోతుల కారణంగా బంపర్ తగిలి వెంట్రప్రగడ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తున్న క్రమంలో గాయపడ్డారు. చోరగుడి రజని, జుజ్జువరపు రాంప్రసాద్ ముతా పనికి గుడివాడ వెళ్తుండగా మార్గమధ్యలో గాయపడ్డారు. 108 ద్వారా గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భూషణగుళ్ల గ్రామం - పెదపారుపూడి మధ్య పెట్రోల్ బంకు వద్ద గోతులుండటం కారణంగా ఆటో బ్రేక్ వేయటంతో వెనుక బైక్ ఢీకొని గాయపడ్డారు.

రోడ్డు బాగు చేయాలని ఆందోళన

పెదపారుపూడి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గుడివాడ టూ విజయవాడ రోడ్డు వేయాలని మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. పెదపారుపూడి మండలం రహదారి చాలా అధ్వానంగా ఉందని, అనేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గుడివాడ వయా మానికొండ - విజయవాడ రహదారులు వేయాలని కోరారు. చాపరాల పుణ్యేశ్వరరావు, మదిరి భీమరాజ్ పాల్గొన్నారు.

మరో నగరవనానికి నాంది

● ఆధ్యాత్మిక కేంద్రం వేదాద్రి వద్ద ఏర్పాటు ● 125 ఎకరాల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు ● కొత్తూరు తాడేపల్లి 'వనం' విస్తరణకు ప్రణాళికలు



కొత్తూరు తాడేపల్లిలోని నగరవనం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా ప్రజలను కనువిందు చేయడానికి, స్వచ్ఛమైన పర్యావరణాన్ని పంచడానికి మరో నగరవనం తయారు కాబోతోంది. జిల్లాకు శివారున, తెలంగాణ నుంచి వచ్చే సందర్శకులకు స్వాగతం పలికేలా ముస్తాబు కాబోతోంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని వేదాద్రికి 5 కిలోమీటర్ల దూరంలో కొత్త నగరవనాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. ప్రతిపాదనలను కూడా తయారు చేసి అటవీ శాఖ ప్రధాన కార్యాలయానికి పంపారు. జిల్లాలో విజయవాడకు సమీపంలో మూడు నగరవనాలున్నాయి. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి వద్ద ఒక నగరవనం ఏర్పాటు చేశారు. రెండేళ్ల క్రితం ఇందులోకి ప్రజలను అనుమతించారు. అలాగే విజయవాడ-గుంటూరు జాతీయ రహదారికి పక్కన బందరు కాల్వ చెంతనే ఒక నగరవనాన్ని తయారు చేశారు. ఇది ఫొటోషూట్లకు మాత్రమే ఉపయోగపడుతుంది. చాలాతక్కువ సంఖ్యలో ప్రజలు వస్తున్నారు. తాజాగా మూలపాడులో సీతాకోకచిలుకల పార్కుతో కొత్త నగరవనాన్ని అందుబాటులోకి తెచ్చారు. సంక్రాంతి సమయంలో జిల్లా నలుమూలల నుంచి సందర్శకులు సందడి చేశారు. రోజురోజుకు ఈ సంఖ్య పెరుగుతోంది. దీంతో జిల్లాకు శివారున ఉన్న ప్రాంతంలో ఒక నగరవనాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య అధికారులకు సూచించారు. 125 హెక్టార్లలో ఏర్పాటు చేయాలన్న యోచనలో అధికారులున్నారు. ఇందులో నవ (తొ విృది) వనాలను (థీమ్ పార్కులు) ప్రజలకు చూపించాలని భావిస్తున్నారు. అటవీ ఉన్నతాధికారులు ఆమోదముద్ర వేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత నిధులు విడుదలవ్వగానే పనులను ప్రారంభిస్తామని అధికార వర్గాలు తెలిపాయి. అలాగే నక్షత్రవనంతోపాటు మరొ కొన్ని వనాలను అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందించారు. మొత్తం తొమ్మిది వనాలు ఇందులో కొలువుదీరబోతున్నాయి.





2015లో చంద్రబాబు ఆవిష్కరించిన శిలాఫలకం

ఇవీ థీమ్ పార్కులు

నగరవనాల్లో కొత్తగా రాశివనం, నక్షత్రవనం, పంచటి వనాలను ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. వేదాల ప్రకారం మనకు 12 రాశులు, 27 నక్షత్రాలున్నాయి. ఒక్కో రాశికి ఒక్కోవృక్షం సంకేతంగా ఉంది. అలాగే ఒక్కో నక్షత్రాన్ని ఒక్కో వృక్షం ఉంది. ఇలా 12 రాశులకు మొక్కలతో రాశివనం, 27 నక్షత్రాలకు మొక్కలతో నక్షత్రవనం తీర్చిదిద్దబోతున్నాయి. అలాగే పంచవటి వనం కూడా ఉంది. మర్రి, మారేడు, జమ్మి, వేప, ఉసిరి వృక్షాలు పంచవటి వనంలో ఉంటాయి.

కొత్తూరు తాడేపల్లి వనం విస్తరణ

వేదాద్రి వద్ద కొత్త నగరవనం ఏర్పాటుతో పాటు విజయవాడకు సమీపంలో కొత్తూరు తాడేపల్లిలో ఉన్న నగరవనాన్ని విస్తరించాలని అటవీ అధికారులు భావిస్తున్నారు. ఇక్కడ నగరవనాన్ని 50 ఎకరాల్లో తీర్చిదిద్దారు. నిబంధనల ప్రకారం నగరవనం 125 ఎకరాల్లో ఉండాలి. ఆ స్థాయి స్థలం ఉంటేనే నగరవనం లోపల థీమ్ పార్కుల ఏర్పాటుకు వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్తూరు తాడేపల్లి నగరవనం 50 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. దీన్ని మరో 50 ఎకరాలకు విస్తరింపజేస్తే మరింత ఆహ్లాదకర వాతావరణం ఉంటుందని భావిస్తున్నారు. ఆయా ప్రతిపాదనలను రూపొందించి ఉన్నతాధికారులకు అందజేశారు. త్వరలోనే పట్టాలు ఎక్కవచ్చని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



నాక్ బృందంతో కూచిపూడి కళాపీఠం ప్రిన్సిపాల్, నాట్య విద్యార్థులు

కూచిపూడి కోర్సులపై నాక్ బృందం అభినందనలు

కూచిపూడి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళాపీఠంలో అమలవుతున్న నాట్య కోర్సుల పట్ల నాక్ బృందం అభినందనలు తెలిపినట్లు కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని నాక్ బృందం పరిశీలించగా, కూచిపూడి కళాపీఠం విద్యార్థులు వైస్ ప్రిన్సిపాల్ చింతా రవిబాలకృష్ణ ఆధ్వర్యంలో తరంగం అంశాన్ని ప్రదర్శించటంతోపాటు కళాపీఠంలో అమలవుతున్న కోర్సులకు సంబంధించి నాట్య విద్యార్థులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నాక్ బృందానికి వివరించారు. ఈ సందర్భంగా నాక్ బృందం ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, నాట్య విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

మధురానగర్ రైల్వేస్టేషన్‌లో

రేపటి నుంచి పీఆర్ఎస్ కౌంటర్ ప్రారంభం

వన్‌టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడకు అనుబంధంగా ఉన్న మధురానగర్ రైల్వే స్టేషన్‌లో ఈనెల 24 నుంచి ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ కౌంటర్ (పీఆర్ఎస్‌సీ) పనిచేయనున్నట్టు విజయవాడ రైల్వే డివిజన్ కార్యాలయ పీఆర్‌వో నుస్రత్ ఎం.మండ్రూపకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు సత్యనారాయణపురంలో ఉన్న ఈ కౌంటర్‌ను ప్రయాణికుల సౌకర్యార్థం మధురానగర్‌కు తరలించినట్టు తెలిపారు. ఇక్కడ అన్ రిజర్వ్ టిక్కెటింగ్ సిస్టమ్‌తో పాటు ప్రయాణికులకు రిజర్వేషన్లు, టిక్కెట్ల రద్దు, తదితరాలతో సహా అన్ని రకాల సేవలందుతాయన్నారు. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, 2.15 నుంచి రాత్రి 8 గంటల వరకు, ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే కౌంటర్ పనిచేస్తుందన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపుపై హర్షం

● రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి

వన్‌టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మికులకు 340 మద్యం షాపులు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మద్యం షాపుల లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వడాన్ని గురుమూర్తి స్వాగతించారు. గౌడ సామాజిక వర్గానికిచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నామినేటెడ్ పోస్టుల్లో సైతం సముచితస్థానం కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో కల్లు గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం కేటాయిస్తామని చెప్పిన హామీని సీఎం నెరవేర్చారన్నారు. ఈ కేటాయింపుతో కల్లుగీత కార్మికుల కుటుంబాలకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందన్నారు.

స్వామి వివేకానంద పురస్కారానికి బుద్ధప్రసాద్ ఎంపిక

అవనిగడ్డ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ 'స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారం -2025'నకు ఎంపికయ్యారు. ఈ నెల 23న అనపర్తిలో శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పురస్కార ప్రదానోత్సవంలో శ్రీరామకృష్ణ మిషన్ - రాజమండ్రి అధ్యక్షులు స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతులమీదుగా ఈ పురస్కారం అందుకుంటారు.

26న రాష్ట్రస్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు

గొల్లపూడి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని ఎస్‌వీఎస్ఆర్‌సీ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న 6వ తరగతి నుంచి టెన్త్ విద్యార్థులకు వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మేధ-2025 పేరుతో క్విజ్, వ్యాసరచన, కథల పోటీలు నిర్వహించనున్నట్టు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఒక పాఠశాల నుంచి ముగ్గురితో ఉన్న ఒక టీమ్ మాత్రమే పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ నెల 24న సాయంత్రం 5 గంటలలోపు ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థుల పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9490336550ను సంప్రదించాలన్నారు.



విజయవాడ చేరుకున్న క్రీడాకారులు

లబ్బీపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్, ఉమ్మడి కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి 27 వరకు విజయవాడ నగరంలో జరగనున్న 68వ స్కూల్ గేమ్స్ అండర్-14 బాలబాలికల జాతీయ సెపక్ తక్రా పోటీలలో పాల్గొనే పలు రాష్ట్రాల క్రీడాకారులు బుధవారం నగరానికి చేరుకున్నారు. ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్ర, తమిళనాడు జట్లు రైల్వే స్టేషన్‌కు చేరుకోగా వారిని వ్యాయమ ఉపాధ్యాయులు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. క్రీడాకారులకు నగరంలోని పలు హోటళ్లల్లో వసతి ఏర్పాటు చేయగా వారికి అవసరమైన ఏర్పాట్లను జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు, రాష్ట్ర పాఠశాల క్రీడా సమైక్య కార్యదర్శి భానుమూర్తి రాజు పర్యవేక్షిస్తున్నారు. గురువారం ఉదయం నుంచి జట్లు రిజిస్ట్రేషన్, ధ్రువపత్రాల పరిశీలన జరుగుతాయని పోటీల నిర్వహణ కార్యదర్శి సింహాద్రి రమేష్ తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి



వజ్రమ్మ (102)

ఉంగుటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, కొయ్యగూరపాడుకు చెందిన శతాధిక వృద్ధురాలు పిడికిటి వజ్రమ్మ(102) మంగళవారం కన్నుమూశారు. ఈమె భర్త పిడికిటి పూర్ణచంద్రరావు స్వాతంత్ర్య సమరయోధుడిగా ఏడాదిపాటు బళ్లారి జైలులో జైలుశిక్ష అనుభవించారు. ఈయన 1993లో 77ఏళ్ల వయసులో చనిపోయారు. ఈ దంపతులిద్దరికీ పోతినేని వెంకటరత్నమ్మ (74) కొమ్మినేని సాయికుమారి (71) అనే ఇద్దరు కుమార్తెలున్నారు. వారిద్వారా ముగ్గురు మనవళ్లు, ఇద్దరు మనవరాళ్లు, పది మంది మునిమనవళ్లు, మనవరాళ్లు, ఇద్దరు మునిముని మనమళ్లతో నాలుగు తరాలను వజ్రమ్మ చూశారు. తన 102 ఏళ్ల వయసులోనూ తనపని తానే స్వయంగా చేసుకుంటూ ఎంతో ఆరోగ్యంగా జీవించారని కుటుంబసభ్యులు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా భర్త పూర్ణచంద్రరావు అందుకున్న పింఛను ఆయన మరణానంతరం వజ్రమ్మ అందుకుంటున్నట్టు చెప్పారు. కాగా వజ్రమ్మ అంత్యక్రియలు బుధవారం స్వగ్రామంలో కుటుంబసభ్యులు, బంధు మిత్రులు, గ్రామస్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.

కౌన్సెలింగ్

వెంట్రుకలు పెరగడం లేదెందుకు?

డాక్టర్! నా వయసు 45. మునుపటిలా వెంట్రుకలు పెరగడంలేదు. పెరుగుదల వేగం తగ్గినట్టు స్పష్టంగా గమనించగలుగుతున్నాను. ఈ మార్పు ఎందుకు? మునుపటిలా వెంట్రుకలు వేగంగా పెరిగే మార్గం లేదా?

- ఓ సోదరి, హైదరాబాద్

కోవిడ్, డెంగు, మలేరియా లాంటి రుగ్మతల బారిన పడినప్పుడు వెంట్రుకల కుదుళ్లు షాక్‌కు గురవుతాయి. దాంతో వెంట్రుకలు ఊడిపోవడంతో పాటు, పెరుగుదల కూడా బాగా మందగిస్తుంది. రుగ్మత నుంచి కోలుకున్న తర్వాత పోషకాహారాన్ని తీసుకోకపోయినా ఇలాగే జరుగుతుంది. అలాగే స్ట్రెయిటెనింగ్, స్ట్రీక్స్ చేయించుకోవడం లాంటి సౌందర్య చికిత్సల వల్ల కూడా వెంట్రుకలు రసాయనికంగా దెబ్బతిని, మధ్యకు తెగిపోతాయి. ఇలాంటప్పుడు కూడా వెంట్రుకలు పెరగవు. అలాగే పెరిగే వయసుతో పాటు వెంట్రుకలు పెరిగే వేగం తగ్గుతుంది. చిన్న వయసులో పెరిగినంత వేగంగా 40 ఏళ్ల తర్వాత వెంట్రుకలు పెరగవు. వెంట్రుకల చివర్లు చిట్లిపోయినప్పుడు, పొడవు పరంగా వ్యత్యాసాన్ని కనిపెట్టలేం. చిట్లిపోయిన చివర్లు కత్తిరిస్తే వెంట్రుకలు పెరుగుతాయని అనుకోవడం కూడా అపోహే! ట్రిమ్మింగ్ వల్ల వెంట్రుకలు ఆరోగ్యంగా కనిపిస్తాయి.

మూల కారణాన్ని సరిదిద్దాలి

వెంట్రుకలు పెరగకపోవడానికి హార్మోన్ సమస్యలు, ముందరి రుగ్మతలు, పోషకాహార లోపం, థైరాయిడ్, పిసిఒడి సమస్యలు.. ఇలా ఎన్నో కారణాలుండవచ్చు. వీటిని కచ్చితంగా కనిపెట్టి, చికిత్స తీసుకుంటే పరిస్థితి మెరుగు పడుతుంది. అలాగే వెంట్రుకలకు చేయించుకునే సౌందర్య చికిత్సలకు కూడా దూరంగా ఉండాలి. అలాగే పోషకాహారంలో బాగంగా



ఖర్జూరాలు, వాల్‌నట్స్, బాదం, షియా, నువ్వులు, షియా, అవిసె గింజలు, పాలు, పన్నీర్, పప్పుధాన్యాలు తీసుకోవాలి. అలాగే ఒత్తిడిని తగ్గించుకోవాలి. అన్నిటికంటే ముఖ్యంగా సమస్యను ప్రారంభంలోనే గుర్తించి సరిదిద్దుకుంటే, ఫలితం మరింత మెరుగ్గా ఉంటుంది.

గృహ చిట్కాలతో...

మందార పూలు, ఆకులు, మెంతులు లాంటివన్నీ కొన్ని పోషకవిలువలను కచ్చితంగా కలిగి ఉంటాయి. అయితే ఇవన్నీ వెంట్రుకలు ఒత్తుగా కనిపించేలా, మెత్తగా ఉండేలా సహాయపడతాయి తప్ప మూల కారణాన్ని సరిదిద్దలేవు. వెంట్రుకల పెరుగుదల ఆగిపోయినప్పుడు కచ్చితంగా మూల కారణాన్ని సరిదిద్దుకునే ప్రయత్నాలు చేపట్టాలి.

డాక్టర్ స్వప్న ప్రియ, కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్, కాస్మోస్యూర్ క్లినిక్, హైటెక్ సిటీ, హైదరాబాద్.

యాత్రలకు వెళుతున్నారా..!

శీతాకాలంలో యాత్రలు చేయడం అహ్లాదకరంగా ఉంటుంది. వాతావరణం చల్లగా ఉండడం వల్ల అలసట రాదు. ఉత్సాహంగా అనిపిస్తుంది. అయినప్పటికీ కొత్త ప్రదేశాలకు వెళ్లేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

- శీతాకాలంలో అన్ని ప్రాంతాల్లో చలి తీవ్రంగానే ఉంటుంది. చలి నుంచి రక్షణ కల్పించే ఉన్ని దుస్తులు, చేతి తొడుగులు, సాక్స్, క్యాప్ వెంట ఉంచుకోవాలి. అన్నింటినీ రెండు జతలు అదనంగా సిద్ధం చేసుకోవడం మంచిది. రాత్రి ప్రయాణమైతే మందంగా ఉండే దుప్పట్లు వెంట తీసుకెళ్లాలి.
- చల్లని వాతావరణంలో ప్రయాణిస్తున్నప్పుడు తరచూ కాఫీ, టీ, ఆల్కహాల్ సేవించకూడదు. విరివిగా వేడి పాలు తాగవచ్చు. కనీసం గంటకు ఒకసారైనా మంచి నీరు తాగుతూ ఉండాలి. లేదంటే శరీరంలో నిర్జలీకరణ స్థితి ఏర్పడుతుంది.
- నీటిని ఎక్కువ సమయం వేడిగా ఉంచే వాటర్ ఫ్లాస్కులు, థర్మల్ ఫ్లాస్కులు, గ్రీన్ టీ ప్యాకెట్లను వెంట తీసుకెళ్లాలి. ప్రయాణం చేస్తూ గ్రీన్ టీ తయారు చేసుకుని తాగడం మంచి అనుభూతినిస్తుంది. దీని వల్ల రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది.
- మంచు కురిసే ప్రదేశాలకు వెళ్లినప్పుడు ఆ వాతావరణంలో కొంతసేపు గడపాలి. అప్పుడే శరీరం ఉష్ణోగ్రతను సర్దుబాటు చేసుకుంటుంది. దీనివల్ల అనారోగ్య సమస్యలు రావు.
- కొత్త ప్రదేశాల్లో కావాల్సిన ఆహారం దొరకకపోవచ్చు. ముందు జాగ్రత్తగా డ్రై ఫ్రూట్స్, గింజలు వెంట తీసుకెళ్లాలి.
- పాదాలకు చలి తగలకుండా ఉన్ని సాక్స్‌తోపాటు మడమల వరకూ పూర్తిగా కప్పి ఉంచే షూస్ లేదా కాన్వాస్ షూస్ ధరించాలి. దీంతో పాదాలు వెచ్చగా మారి కీళ్ల నొప్పులు రాకుండా చేస్తాయి.



- ప్రయాణం చేసేటప్పుడు చలిగాలులు సోకి చర్మం పొడారిపోతుంది. మాయిశ్చరైజర్, లిప్‌బామ్ వెంట ఉంచుకోవాలి. సూర్యరశ్మి నుంచి కళ్లకు రక్షణ కల్పించే సన్ గ్లాస్ ధరించాలి.
- ఫోన్ ఛార్జింగ్‌కి ఇబ్బంది లేకుండా పవర్ బ్యాంక్ తీసుకెళ్లాలి.
- వైద్యుని సలహా మేరకు జలుబు, దగ్గు, జ్వరం, తలనొప్పి సమస్యలకు సంబంధించిన మందులను వెంట తీసుకెళ్లాలి.

ప్రేరణ



రొమ్ము క్యాన్సర్ పట్ల మహిళల్లో అవగాహన పెంచడం కోసం కేవలం వైద్య వృత్తికే పరిమితం కాకుండా సరికొత్త మార్గాన్ని ఎంచుకున్నారు హైదరాబాద్‌కు చెందిన బ్రెస్ట్ ఆంకాలజిస్ట్ **డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటి.** గ్రామీణ మహిళల కోసం ప్రత్యేకంగా 'బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్'ను నడుపుతున్న ప్రజ్ఞను 'నవ్య' పలకరించింది.

బస్సుతో భరోసా

"మన దేశంలో రొమ్ము క్యాన్సర్ కేసులు త్వరితంగా పెరిగిపోడానికి కారణం అవగాహనా రాహిత్యమే! మరీ ముఖ్యంగా గ్రామీణ మహిళల్లో ఈ వ్యాధి పట్ల అవగాహన చాలా తక్కువ. దాంతో ఎంతో ఆలస్యంగా వైద్యులను ఆశ్రయిస్తూ, వ్యాధి ముదిరిపోయి, మృత్యువాత పడుతున్న సందర్భాలు కోకొల్లలు. ఈ ధోరణికి అడ్డుకట్ట వేయాలనే సంకల్పంతో, వ్యాధి నిర్ధారణ పరీక్షలను మహిళలకు చేరువ చేయడం కోసం 'బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్' పేరిట ఒక బస్సును ప్రారంభించాను. రొమ్ము క్యాన్సర్ నివారణ వైపు నా ప్రయాణం సాగడం వెనకొక ఆసక్తికరమైన కథ ఉంది. దీనికి కారణం అమ్మ. 2012లో అమ్మకు రొమ్ములో సమస్య తలెత్తింది. దాంతో అమ్మ తనకు క్యాన్సర్ సోకిందేమోనని చాలా భయపడిపోయింది. వైద్యం కోసం ఏ డాక్టర్‌ను కలవాలో కూడా మాకు ఆ రోజుల్లో తెలియదు. దాంతో మేము క్యాన్సర్ వైద్య నిపుణుడిని కలిసాం. ఆయన కొన్ని పరీక్షలు రాశారు. ఆ పరీక్షలు చేయించుకుంటున్న సమయంలో కూడా విపరీతమైన భయం. ఆ పరిస్థితులు నాపై బలమైన ముద్ర వేశాయి. అమ్మకు క్యాన్సర్ లేదని పరీక్షల్లో తేలిపోయింది. దాంతో అందరం ఊపిరి పీల్చుకున్నాం. నేను వైద్య విద్య చదవాలని.. అది కూడా రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించిన స్పెషాలిటీ ఎంచుకోవాలని ఆ సమయంలో నిర్ణయించుకున్నా. అలా అమ్మకొచ్చిన అస్వస్థత నన్ను క్యాన్సర్ వైద్య విద్య వైపు నడిపించింది. చెన్నైలో రామచంద్ర మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి అయిన తర్వాత ముంబయిలోని టాటా మెమోరియల్‌లో ఫెలోషిప్ పూర్తి చేసుకున్నా. క్యాన్సర్ రోగులకు రొమ్ము పునర్‌నిర్మాణంలో నైపుణ్యం సాధించటం కోసం యూకేలో ఒక కోర్సు ఉంది. అది పూర్తి చేశాక, హైదరాబాద్ వచ్చి వైద్య వృత్తిని ప్రారంభించా.

మొదట్లో...

నేను వైద్య వృత్తిని ప్రారంభించిన రోజుల్లో రొమ్ము క్యాన్సర్‌పై ప్రజల్లో ఎక్కువ అవగాహన ఉండేది కాదు. క్యాన్సర్‌ను గుర్తించే పద్ధతులు కూడా ఎక్కువ ప్రచారంలో లేవు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఎంతో నష్టపోతున్నారని గమనించాం. ఎక్కువ మంది మహిళలు రొమ్ములలో సమస్యలతో డాక్టర్ల దగ్గరకు వెళ్లటానికి ఇబ్బంది పడుతూ ఉంటారు. డాక్టర్ల దగ్గరకు వారు రారు కాబట్టి.. మనమే వాళ్ల దగ్గరకు వెళ్తే బావుంటుందనే ఉద్దేశంతో బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించాం. దీనిలో అన్ని అత్యాధునిక రోగ నిర్ధారణ పద్ధతులు ఉంటాయి. వీటి ద్వారా మహిళలను పరీక్షించి వారికి ఏవైనా సమస్యలు న్నాయా అనే విషయాన్ని నిర్ధారిస్తారు. ఇలా ఇప్పటి దాకా తెలంగాణలోని అనేక జిల్లాలలో వేల సంఖ్యలో మహిళలను పరీక్షించాం. రొమ్ము క్యాన్సర్ ఉన్నవారికి ఉచితంగా చికిత్సను కూడా అందిస్తున్నాం. కేవలం గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళలకు మాత్రమే కాకుండా- వారితో మమేకమయిపోయిన ఆశా వర్కర్స్‌కు కూడా పరీక్షలు నిర్వహించాం. దీని వల్ల రెండు రకాల లాభాలు ఉంటాయి. ఆశా వర్కర్లకు సరైన వైద్య సదుపాయం లభిస్తుంది.. అంతే కాకుండా వారికి ఈ అంశంపై అవగాహన ఉండటం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఇతరులకు వారు ఈ సమస్య తీవ్రత చెప్పగలుగుతారు. దీని వల్ల మంచి ఫలితాలు లభించాయి.

మర్చిపోలేని అనుభవం

కొందరు మహిళలకు గర్భిణిగా ఉన్నప్పుడు, లేదా ప్రసవం తర్వాత ఏడాది లోపు రొమ్ము క్యాన్సర్ సోకవచ్చు. ఒక సారి 29 ఏళ్ల గర్భిణి నన్ను కలిసింది. ఆమెకు రెండు రొమ్ముల్లోను గడ్డలు ఉన్నాయి.



మొదట్లో అవి క్యాన్సర్‌కు సంబంధించినవి కావని వైద్యులు నిర్ధారించారు. కానీ నేను పరీక్షలు చేయిస్తే అవి క్యాన్సర్ గడ్డలని తేలింది. అప్పుడు వైద్యం మొదలుపెట్టి.. మళ్లీ ఆమెకు రొమ్ములు పునర్‌నిర్మించటానికి రెండేళ్ల సమయం పట్టింది. ఆ సమయంలో ఆమె తన స్థైర్యం కోల్పోలేదు. శరీరంలోని క్యాన్సర్‌తో పోరాడి గెలిచింది. ఇలాంటి వారు ఎంతో మంది ఉన్నారు. వారందరి గురించి ప్రపంచానికి తెలిస్తే- క్యాన్సర్ బాధితులకు స్ఫూర్తి కలుగుతుంది.

ఉచితంగానే...

రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించే పరీక్షలు కూడా ఒక క్రమ పద్ధతిలో సాగాలి. సాధారణంగా రొమ్ములో గడ్డ అనగానే వైద్యులు మామోగ్రాఫ్ పరీక్షనే సూచిస్తూ ఉంటారు. కానీ 40 ఏళ్ల లోపు మహిళలు మామోగ్రామ్ చేయించుకోవడం సరి కాదు. కాబట్టి మేం భౌతిక పరీక్షలు, ఇతరత్రా పరీక్షలతో వ్యాధిని అంచనా వేసి, అవసరమైన వారికే మామోగ్రామ్ చేపడతాం. పరీక్షలో వ్యాధి నిర్ధారణ అయిన పక్షంలో తదుపరి చికిత్సల గురించి వివరిస్తాం. ఆర్థిక పరిస్థితి సహకరించని వారికి మేమే ఉచితంగా పూర్తి చికిత్సను అందిస్తాం. కొన్ని సందర్భాల్లో రొమ్ముల్లో క్యాన్సర్ కాని గడ్డలు కూడా ఏర్పడుతూ ఉంటాయి. వాటికి సంబంధించిన చికిత్సలను కూడా ఉచితంగా అందిస్తున్నాం. మా దగ్గర చికిత్స పొంది మళ్లీ సాధారణ జీవితం జీవిస్తున్న వారిని చూస్తుంటే చాలా ఆనందంగా ఉంటుంది. ఇంకా మరింత మందికి సాయం చేయాలనే ఉత్సాహం కలుగుతుంది."

• గోగుమళ్ల కవిత



ప్రియా సరోజ్... ఈమె గురించి ఇప్పుడు నెట్టింట తెగ వెతికేస్తున్నారు. భారత క్రికెటర్ రింకూసింగ్‌తో ఆమె పెళ్లి నిశ్చయం కావడమే అందుకు కారణం. వాస్తవానికి అతడికి కాబోయే సతీమణిగానే కాదు... రాజకీయ నాయకురాలిగా... యువ పార్లమెంటు సభ్యురాలిగా... ప్రియాకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది.

రింకూ ప్రియ సఖి

తండ్రి వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చినా... నిత్యం జనం మధ్య ఉంటూ... వారి సమస్యలు తెలుసుకొంటూ... తనదైన ఒక మార్గాన్ని నిర్మించుకున్నారు ప్రియా సరోజ్. పద్దెనిమిదేళ్లకే రాజకీయాల్లోకి వచ్చిన ఆమె... గత యూపీ అసెంబ్లీ ఎన్నికలప్పుడు తండ్రి గెలుపులో కీలక పాత్ర పోషించారు. ఎంపీగా పోటీ చేసి తనూ విజయం సాధించారు.

ఉత్తరప్రదేశ్ వారణాసిలో పుట్టి పెరిగిన 26 ఏళ్ల ప్రియా... ఢిల్లీలోని 'ఎయిర్‌ఫోర్స్ గోల్డెన్ జూబ్లీ ఇనిస్టిట్యూట్‌'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేశారు. 'ఢిల్లీ విశ్వవిద్యాలయం' నుంచి బీఏ పట్టా పొందారు. నోయిడా 'అమిటి యూనివర్సిటీ'లో ఎల్ఎల్‌బీ చదివారు. అనంతరం న్యాయవాదిగా కొంత కాలం సుప్రీమ్‌కోర్టులో ప్రాక్టీస్ చేశారు.

ఆమె తండ్రి తుఫానీ సరోజ్ మూడుసార్లు ఎంపీ. ప్రస్తుతం సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన అడుగుజాడల్లో నడిచిన ప్రియా... బడికి వెళ్లే రోజుల్లోనే రాజకీయాలపై మక్కువ పెంచుకున్నారు. చిన్న వయసులోనే రాజకీయ వారసత్వాన్ని అందుకున్నారు. పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ... ప్రజల మధ్యనే ఉంటూ... ఎంతో అనుభవం గడించారు. యూపీ శాసనసభకు జరిగిన గత ఎన్నికల్లో తండ్రి తరుపున అన్నీ తానై ప్రచారం నిర్వహించారు. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకున్న పార్టీ... 2024 పార్లమెంటు ఎన్నికల్లో ఆమెకు సీటు ఇచ్చింది. మచిలీషహర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆమె... 35 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలుపొందడమే కాదు... పార్టీ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టారు. అంతేకాదు... లోక్‌సభకు ఎన్నికైన రెండో అతిపిన్న వయస్కురాలిగానూ చరిత్ర సృష్టించారు.

రింకూతో పరిచయం...

రెండేళ్ల కిందట జరిగిన ఐపీఎల్ మ్యాచ్ ఆఖరి ఓవర్‌లో ఐదు సిక్స్‌లు బాది కోల్‌కతా నైట్ రైడర్స్‌ను గెలిపించడంతో రింకూసింగ్ పేరు మారుమోగింది. గుజరాత్ టైటాన్స్‌తో తలపడిన ఆ పోరులో నైట్‌రైడర్స్ ఓటమి ఖాయమనుకున్నారు అంతా. అసాధ్యమనుకున్నది సుసాధ్యం చేసి చూపించిన రింకూ.. ఆ తరువాత భారత టీ20 క్రికెట్ జట్టులో సభ్యుడయ్యాడు. దిగువ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన ఈ యూపీ హార్డ్ హిట్టర్ గురించి అప్పట్లో ఎన్నో కథనాలు ప్రచురితమయ్యాయి. కష్టపడి ఎదిగిన అతడి నేపథ్యం ప్రియను ఆకట్టుకుంది.

రెండేళ్ల కిందట ప్రియా ప్రాణమిత్రులొకరు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇద్దరూ కలిశారు. ఆ ఫ్రెండ్ తండ్రి కూడా క్రికెటర్. తనే రింకూను ప్రియకు పరిచయం చేశారు. తరువాత ఇరువురి మాటలు కలిశాయి. అభిరుచులు కలిశాయి. ప్రాంతాలూ ఒక్కటే. ఒకరు రాజకీయ నాయకురాలు... ఇంకొకరు భారత బ్యాట్స్‌మన్... నేపథ్యాలు వేరైనా... కెరీర్ పరంగా ఇద్దరికీ ఎంతో ప్రజాదరణ. లక్షల్లో అభిమానులు. క్రమంగా వారి స్నేహం ప్రేమగా మారింది. ఈ ప్రేమను వివాహ బంధంగా మార్చుకొని.. జీవితాంతం కలిసి నడవాలని నిర్ణయించుకున్నారు. తమ ప్రేమ గురించి పెద్దలకు చెప్పి, వారి అనుమతి తీసుకున్నారు.



ఏఐ హడావుడి...

గత కొంత కాలంగా రింకూ పెళ్లి గురించి రకరకాల వార్తలు వస్తున్న నేపథ్యంలో... ఇటీవల ప్రియా తండ్రి ఆ విషయాన్ని నిర్ధారించారు. రింకూ తండ్రితో పెళ్లి గురించి మాట్లాడినట్టు ఆయన వెల్లడించారు. 'వారిద్దరికీ ఏడాదికి పైగా స్నేహం కొనసాగుతోంది. ఒకరినొకరు ఇష్టపడ్డారు. కుటుంబ సభ్యుల అనుమతితో ఒకటి కావాలనుకున్నారు' అంటూ తుఫానీ సరోజ్ చెప్పారు. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌తో రింకూ బిజీ. నెలాఖరులో ప్రారంభం కానున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాలతో ప్రియా కూడా బిజీ. ఈ నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాల అనంతరం నిశ్చితార్థం జరుపుతామని ప్రియా తండ్రి తెలిపారు. ఇదిలావుంటే... ఈ వార్త వచ్చినప్పటి నుంచీ వీరిద్దరి నిశ్చితార్థం జరిగిపోయిందంటూ ఏఐ సాయంతో రూపొందించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అదంతా నిజం కాదంటూ తుఫానీ వివరణ ఇవ్వాల్సివచ్చింది.

కళ్ల కింద నలుపు తగ్గాలంటే...

ఒత్తిడి, నిద్రలేమి, హార్మోన్ల మార్పుల కారణంగా కళ్ల కింద నల్లని వలయాలు ఏర్పడుతుంటాయి. పోషకాహారంతోపాటు సరైన నిద్ర ఉండేలా చూసుకుంటూ కొన్ని చిట్కాలు పాటిస్తే ఈ సమస్య నుంచి బయటపడవచ్చు.

- రాత్రి పడుకునేముందు రెండు చెంచాల ఆలివ్ నూనెని కొద్దిగా వేడి చేసి కళ్ల చుట్టూ రాయాలి. వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే కళ్ల చుట్టూ రక్త ప్రసరణ మెరుగై నలుపుదనం తగ్గుతుంది.
- ఒక చెంచా శనగపిండిలో రెండు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కళ్ల కింద రాసి పది నిమిషాలు ఆరిన తరవాత మంచి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండు రోజులకోసారి చేస్తే నల్లని వలయాలు తొలగిపోతాయి.
- కలబంద గుజ్జును తీసుకుని చల్లని నీళ్లలో ముంచి దానిని కళ్ల చుట్టూ పట్టించాలి. పదిహేను నిమిషాల తరవాత మంచినీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారం రోజులు చేస్తే ఫలితం కనిపిస్తుంది
- రెండు చెంచాల బియ్యం పిండిలో మూడు చెంచాల నీళ్లు పోసి ముద్దలా కలపాలి. ఈ మిశ్రమాన్ని కళ్ల చుట్టూ పరచాలి. ఇరవై నిమిషాలు ఆరిన తరవాత నీళ్లతో శుభ్రం చేసుకుంటే చాలు.
- అరకప్పు టమాటా రసంలో రెండు చెంచాల శనగపిండి కలపాలి. ఈ మిశ్రమంతో కళ్ల కింద మర్దన చేయాలి. పది నిమిషాల తరవాత మంచినీళ్లతో శుభ్రం చేసుకుంటే ప్రయోజనం కనిపిస్తుంది.
- రాత్రి పడుకునేముందు కళ్ల కింద కొబ్బరి నూనె రాసుకుని ఉదయాన్నే గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకుంటే సమస్య తగ్గుతుంది.



ఇలా చేస్తే వెంటనే ఉపశమనం

పిల్లలకు, పెద్దలకు ఆకస్మికంగా చిన్న ఆరోగ్య సమస్యలు ఎదురవుతుంటాయి. అలాంటప్పుడు ఇంట్లో ఉండే వాటితోనే కొన్ని చిట్కాలు పాటించి ఉపశమనం పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

వాంతులు



- చిన్న గ్లాసు నీళ్లలో నాలుగు లవంగాలు వేసి బాగా మరిగించాలి. గోరువెచ్చగా చల్లారిన తరవాత ఈ నీళ్లను వడకట్టి తాగితే వెంటనే వాంతులు ఆగిపోతాయి.

కడుపునొప్పి



- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి రెండు చెంచాల వాము వేసి దోరగా వేయించాలి. దీనికి అరచెంచా నల్ల ఉప్పు కలిపి కొద్ది కొద్దిగా నోట్లో వేసుకుంటూ బాగా నమిలి తినాలి. పావుగంటలో కడుపు నొప్పి, అపానవాయువుల సమస్యలు తగ్గిపోతాయి. కడుపులో జీర్ణక్రియ మెరుగవుతుంది కూడా.

తలతిరగడం



- రెండు చెంచాల సోంపులో ఒక చెంచా పటిక బెల్లం కలిపి తినాలి. వెంటనే శరీరంలో రక్తప్రసరణ సజావుగా జరిగి తలతిరగడం తగ్గుతుంది. తక్షణ శక్తి కూడా లభిస్తుంది.

విరేచనాలు



- అరకప్పు కమ్మని పెరుగులో ఒక చెంచా మెంతులు కలుపుకొని మెల్లగా తినాలి. పది నిమిషాల్లో విరేచనాలు తగ్గిపోతాయి. ఒక చెంచా పంచదారలో రెండు చుక్కల నీళ్లు కలిపి వేడిచేస్తే వచ్చే పాకం తిన్నా కూడా మంచి ఫలితం కనిపిస్తుంది.

న్యుమోనియా



- అరగ్లాసు గోరువెచ్చని నీటిలో చిటికెడు ఇంగువ కలుపుకొని తాగితే ముక్కులో శ్లేష్మం తగ్గి వెంటనే ఉపశమనం కలుగుతుంది.

పంటి నొప్పి



- చిన్న అల్లం ముక్కను తొక్కు తీసి సన్నగా తురమాలి. ఈ తురుముని వేళ్లతో పిండితే రసం వస్తుంది. రోజుకు రెండుసార్లు ఒక చెంచా అల్లం రసం తీసుకుంటే పంటినొప్పి, చిగుళ్ల వాపు క్రమంగా తగ్గుతాయి. ఈ రసాన్ని కొద్దిగా వేడిచేసి దాన్ని నొప్పి ఉన్న ప్రదేశంలో రాసినా ప్రయోజనం ఉంటుంది.


గాయాలు



- కూరలు తరిగేటపుడు చాకుతో వేలు కోసుకున్నా, పిల్లలు ఆడుకుంటూ దెబ్బలు తగిలించుకున్నా ఇలా ఏ చిన్న గాయమైనా వాటిపై కొద్దిగా పసుపును అద్దాలి. పసుపు యాంటీబయటిక్‌లా పనిచేసి గాయాన్ని త్వరగా మాన్పుతుంది.

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
విజయవాడ ● గురువారం 23 జనవరి 2025

బ్యాడ్ బాయ్‌గా నాగశౌర్య



నాగశౌర్య హీరోగా రామ్‌దేశినా దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. చిత్రబృందం బుధవారం టైటిల్‌ను ప్రకటించింది. ఈ యాక్షన్ ఎంటర్టైనర్ కు 'బ్యాడ్ బాయ్ కార్తీక్' అనే టైటిల్‌ను నిర్ణయించారు. విధి కథానాయిక. శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. బుధవారం నాగశౌర్య పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించి, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఇందులో నాగశౌర్య సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. నుదుటిపై మూడు గోవింద నామాలు, చేతులపై రక్తంతో ఉన్న ఆయన లుక్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. సముద్రఖని, వీకే నరేశ్, సాయికుమార్, వెన్నెల కిశోర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

కుంభమేళా మోనాలిసాకు సినిమా అవకాశం



సహజ సౌందర్యం, అమాయకపు చిరునవ్వుతో దేశం దృష్టిని ఆకర్షించిన కుంభమేళా వైరల్ గర్ల్ మోనాలిసా భోంస్లేకు మరో అరుదైన అవకాశం దక్కింది. ప్రయాగ్‌రాజ్‌లో ఆమె రుద్రాక్ష మాలలు, ముత్యాల హారాలు అమ్ముతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. బాలీవుడ్ సినీ ప్రముఖులను సైతం ఆ వీడియోలు ఆకర్షించడంతో ఓ బాలీవుడ్ సినిమాలో నటించే అవకాశం ఆమెను వెతుక్కుంటూ వచ్చింది. తను త్వరలో తెరకెక్కించబోతున్న 'మణిపూర్ డైరీస్' చిత్రంలో మోనాలిసా భోంస్లేకు ఓ పాత్ర ఇస్తానని దర్శకుడు సనోజ్ మిశ్రా ప్రకటించారు. బాలీవుడ్‌లోని మురికిని ప్రోత్సహించే బదులు ఇలాంటి నిరుపేద అమ్మాయికి నా తదుపరి చిత్రంలో అవకాశం ఇద్దామనుకుంటున్నాను అని ఆయన ట్వీట్ చేశారు. త్వరలో ఆమెను కలసి తన ప్రతిపాదన తెలియజేస్తాననీ, ఆమెకు నటన రాకుంటే శిక్షణ ఇచ్చి తన సినిమాలో నటింపజేస్తానని ఆయన చెప్పారు. మోనాలిసా కుంభమేళా నుంచి తన ఇంటికి వెళ్లిపోయారు. ఆమెను చూసేందుకు, ఫొటోలు దిగేందుకు జనాలు ఎగబడుతుండడంతో వ్యాపారం దెబ్బతినడంతో పాటు, మోనాలిసా కూడా ఇబ్బందిపడ్డారు. దాంతో తండ్రి ఆమెను సొంతూరుకు పంపారు.



అది నా పూర్వజన్మ సుకృతం

నందమూరి బాలకృష్ణ

కోట్లాది మందికి ఆరాధ్యులు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, తెలుగు ప్రజల గుండె చప్పుడు అయిన మహానుభావుడి కడుపున జన్మించడం తన పూర్వజన్మ సుకృతమని హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. అనంతపురం నగరంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన డాకూ మహరాజ్ సినిమా విజయోత్సవాలలో ఆయన ప్రసంగించారు. చిత్రయూనిట్‌తో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని టీడీపీ నాయకులు, బాలయ్య అభిమానులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. తన సినిమా, రాజకీయ, సేవా కార్యక్రమాలకు ఎన్టీఆర్ స్ఫూర్తి అని అన్నారు. తన సినిమా రికార్డులు, రివార్డులు, కలెక్షన్స్ అన్నీ ఒరిజినలేనని, తన అభిమానులకు ఈ విషయం ఎరుక అని అన్నారు. కోట్లాది మంది అభిమానులను చూస్తే తనకు ఎంతో గర్వంగా ఉంటుందని, తన జీవితం ధన్యమైందని అన్నారు. విజ్ఞానం, వినోదం అందించే చిత్రాలతో అందరూ బాగుండాలి, అందులో మనం ఉండాలనే కాన్సెప్ట్‌తో ముందుకు వెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రద్ధా శ్రీనాథ్, చిన్నారి వేద అగర్వాల్‌తో పాటు నటీనటులు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి)

నెలాఖరున మదగజరాజా



హీరో విశాల్ నటించిన తాజా చిత్రం 'మదగజ రాజా'. సుందర్ సి దర్శకత్వంలో జెమినీ ఫిలిం సర్క్యూట్ బేనర్‌పై రూపొందింది. వరలక్ష్మీ శరత్‌కుమార్, అంజలి కథానాయికలుగా నటించారు. సంతానం, సోనూసూద్ కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈనెల 31న తెలుగులో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. సత్యకృష్ణ ప్రొడక్షన్స్ తెలుగు హక్కులు దక్కించుకుంది. విశాల్ యాక్షన్, సంతానం కామెడీ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి అని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ ఆంటోని, సినిమాటోగ్రఫీ: రిచర్డ్ ఎం నాథన్

నా పదేళ్ల కెరీర్‌లో అత్యంత ఇష్టమైన సినిమా ఇదే

అనుపమ పరమేశ్వరన్



'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'పరదా'. అనుపమ పరమేశ్వరన్, దర్శన రాజేందర్, సంగీత ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పి.వి, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. బుధవారం ఈ చిత్ర టీజర్‌ను దుల్కర్ సల్మాన్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అనుపమ మాట్లాడుతూ "ఈ టీజర్ చూస్తూ భావోద్వేగానికి లోనయ్యాను. నా పదేళ్ల ప్రయాణంలో నాకు అత్యంత ఇష్టమైన సినిమా ఇదే. అలాగే, ఇందులో పోషించిన 'సుబ్బు' నాకు ఇష్టమైన పాత్ర. కుటుంబంతో కలసి చూడాల్సిన చిత్రమిది" అని చెప్పారు. "ఈ సినిమాలో కంటెంట్ మాట్లాడుతుంది. ప్రవీణ్ చాలా పెద్ద దర్శకుడు అవుతాడు" అని నిర్మాత విజయ్ అన్నారు. "మహిళా ప్రాధాన్యమున్న సినిమాలు 'పరదా' తర్వాత మరిన్ని తెరకెక్కుతాయి. ఈ సినిమాలో నటించిన నటీనటుల నుంచి అద్భుతమైన ప్రదర్శనను చూస్తారు" అని ప్రవీణ్ కండ్రేగుల తెలిపారు.

ఆ విషయంలో శ్రీమంతుడ్ని

- అనిల్ రావిపూడి



'పటాస్' సినిమాతో దర్శకుడిగా అడుగుపెట్టారు అనిల్ రావిపూడి. ఇటీవలే వెంకటేశ్ కథానాయకుడిగా నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాను తెరకెక్కించి ఘనవిజయం అందుకున్నారు. ఆయన ఇండస్ట్రీలో దర్శకుడిగా 10 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా బుధవారం మీడియాతో ముచ్చటించారు. "దర్శకుడిగా ఈ పదేళ్ల అనుభవం ఎంతో అద్భుతంగా సాగింది. నేను పనిచేసిన ప్రతీ హీరోతో బలమైన అనుబంధం ఏర్పడింది. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా ఇచ్చిన విజయోత్సాహం జీవితాంతం మరిచిపోలేనిది. ఇంతటి విజయం కేవలం ప్రేక్షకుల ప్రేమ వల్లే సాధ్యమైంది. ఈ పదేళ్లలో నేను వారి అంతులేని ప్రేమాభిమానాలను సంపాదించుకోగలిగా. ఆ పరంగా చూస్తే నేనో శ్రీమంతుడ్ని. నిజానికి కెరీర్ మొదలుపెట్టినప్పుడు ఒక్క సినిమాకు దర్శకుడిగా పనిచేస్తే చాలనుకున్నా. ఇప్పుడు ఏకంగా ఎనిమిది వరుస విజయాలు అందుకోవడం ఎంతో సంతోషకరమైన విషయం. ఈ సినిమా చూసిన ప్రేక్షకులు చాలా మంది నన్ను దిగ్గజ దర్శకుడు ఈవీవీ సత్యనారాయణతో పోల్చడం నేను అందుకున్న గొప్ప ప్రశంసల్లో ఒకటి. మెగాస్టార్ చిరంజీవితో చేసే సినిమా గురించి ఇప్పుడే ఏం చెప్పలేను. ఆయనను ఇంతవరకూ ఎవరూ చూపించని విధంగా చూపించాలని మాత్రం ప్రయత్నిస్తున్నా. ప్రస్తుతం ఎలాంటి జానర్ సినిమా చేస్తే బాగుంటుంది అన్న దానిపైనే దృష్టిపెట్టా" అని చెప్పారు.

వీరుడొస్తున్నాడు



తమిళ హీరో విక్రమ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'వీర ధీర శూరన్ 2'. ఎస్.యూ అరుణ్‌కుమార్ దర్శకత్వంలో రియా శిబు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. మార్చి 27న ఎన్వీఆర్ సినిమాస్ ద్వారా ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ బుధవారం తెలిపారు. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో దుషార విజయన్ కథానాయిక. ఎస్. జే సూర్య కీలకపాత్ర పోషిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: తేని ఈశ్వర్.



వీల్‌ఛైర్‌లో రష్మిక

కథానాయిక రష్మిక మందన్న ఇటీవలే జిమ్‌లో కసరత్తులు చేస్తూ గాయపడినట్లు వెల్లడించిన విషయం తెలిసిందే. ముంబైలో జరుగుతున్న 'ఛావా' చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం ఆమె హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చారు. కాలికి పెద్ద కట్టుతో నడవలేని స్థితిలో ఆమె కనిపించారు. కారులో నుంచి దిగి ఒంటికాలిపై గెంతుతూ వెళ్లి వీల్‌ఛైర్‌లో కూర్చున్నారు. సహాయకులు అక్కడి నుంచి ఆమెను విమానాశ్రయం లోపలకు తీసుకెళ్లారు. ఆసమయంలో బయట ఎవరూ గుర్తుపట్టకుండా రష్మిక తన ముఖానికి మాస్క్, తలపైన టోపీ ధరించారు. ముంబైలో జరిగిన 'ఛావా' చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమంలోనూ రష్మిక మెట్లపై ఒంటికాలిపై గెంతుతూ వేదికపైకి ఎక్కారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో రష్మిక త్వరగా కోలుకోవాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.



నేనున్నానని గుర్తుంచుకో

'నీకెప్పుడు ఏ అవసరం వచ్చినా నేనున్నానని గుర్తుంచుకో' అని తన ప్రాణాలు కాపాడిన ఆటో డ్రైవర్ భజన్ సింగ్ రానాకు సైఫ్ అలీఖాన్ కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యాక ఆయన భజన్‌సింగ్‌ను కలిశారు. సైఫ్ స్వయంగా భజన్‌సింగ్‌కు ఫోన్ చేసి తమ ఇంటికి రావలసిందిగా ఆహ్వానించారు. సైఫ్ కుటుంబ సభ్యులంతా కలసి భజన్ సింగ్‌ను ఆత్మీయంగా సత్కరించారు. వారిద్దరూ కలసి దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కత్తిపోట్లకు గురై రక్తమోడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న సైఫ్ అలీఖాన్‌ను సమయానికి భజన్‌సింగ్ తన ఆటోలో ఆస్పత్రికి చేర్చి ప్రాణాలను కాపాడిన విషయం తెలిసిందే.

రెండో రోజూ ఐటీ సోదాలు

- నవీన్ ఏర్నేని, యలమంచలి రవిశంకర్, చెర్రీ, దిల్ రాజు తదితరుల నివాసాల్లో సోదాలు
- నిర్మాతల బినామీల బ్యాంకుఖాతాల గుర్తింపు
- కలెక్షన్లు, ఐటీకి సమర్పించిన వివరాల్లో వ్యత్యాసం

సినీ రంగానికి చెందిన ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాల్లో ఆదాయపు పన్ను (ఐటీ) అధికారులు రెండోరోజైన బుధవారం కూడా సోదాలు కొనసాగించారు. 55 బృందాలుగా విడిపోయి వివిధ ప్రాంతాల్లో సోదాలు జరిపారు. ఇటీవల విడుదలైన చిత్రాలు పుష్ప 2, సంక్రాంతికి వస్తున్నాం, గేమ్ చేంజర్, వారసుడు సినిమాలకు సంబంధించిన లెక్కలపై ప్రధానంగా దృష్టి సారించారు. పుష్ప 2 సినిమా దర్శకుడు సుకుమార్ బుధవారం హైదరాబాద్ చేరుకోవటంతో శంషాబాద్ విమానాశ్రయంలోనే ఐటీ అధికారులు ఆయనను కలుసుకొని.. నేరుగా తన ఇంటికి తీసుకుని వచ్చారు. పుష్ప 2 సినిమాకు సుకుమార్ తీసుకున్న పారితోషికం గురించి వారు ఆరా తీసినట్లు సమాచారం. శ్రీ వెంకటేశ్వర సినీ క్రియేషన్స్, మైత్రి మూవీ మేకర్స్, మ్యాంగో మీడియా సంస్థలకు సంబంధించిన కార్యాలయాలతో పాటు నిర్మాతలు నవీన్ ఏర్నేని, యలమంచలి రవిశంకర్, చెర్రీ, దిల్ రాజుతోపాటు ఆయన కుటుంబసభ్యుల నివాసాల్లో అధికారులు సోదాలు నిర్వహించారు. కాగా, ఏరియాల వారీగా సినిమాను విక్రయించే విషయంలో డిస్ట్రిబ్యూటర్లతో జరిగే ఒప్పందాల్లో చాలావరకు నల్లధనం ఉంటుందని అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ క్రమంలో నిర్మాతలకు బినామీలుగా వ్యవహరిస్తున్న వారి బ్యాంకు ఖాతాల మీద దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. సినిమాలకు సంబంధించిన పెట్టుబడి, అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయాన్ని పరిశీలిస్తున్నపుడు పలు అవకతవకలు బయటపడినట్లు సమాచారం. ఇటీవల విజయవంతమైన సినిమాల బ్యాలెన్స్‌షీట్లు, ఐటీ శాఖకు ఆయా నిర్మాణ సంస్థలు అందించిన వివరాల్లో కూడా భారీ వ్యత్యాసమున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. సినిమా కలెక్షన్లకు సంబంధించిన జీఎస్టీ రిటర్నుల్లో కూడా వ్యత్యాసాలు గుర్తించినట్లు సమాచారం.

భారీ కలెక్షన్లపై దృష్టి

తక్కువ పెట్టుబడితోనే నిర్మాణం పూర్తి చేసుకున్న 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు తొలి వారంలోనే రూ.200 కోట్ల కలెక్షన్లు, పుష్ప 2 సినిమాకు ఇప్పటి వరకూ రూ.1850 కోట్ల కలెక్షన్లు వచ్చినట్లుగా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో వాటిపైనా ఐటీ అధికారులు దృష్టి సారించారు. తమిళ హీరో విజయ్ నటించిన వారసుడు సినిమాకు సంబంధించి దిల్ రాజు సంస్థ చూపించిన లెక్కలపైనా అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. మరోవైపు, ఐటీ సోదాలు తనను ఒక్కడినే లక్ష్యంగా చేసుకొని జరగడం లేదని, సినీ రంగంలో చాలాచోట్ల జరుగుతున్నాయని నిర్మాత దిల్‌రాజు పేర్కొన్నారు. ఐటీ అధికారులు అడిగిన అన్ని వివరాలు, బ్యాంకు ఖాతాలు, లాకర్లకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఇచ్చామని, పన్ను చెల్లింపునకు సంబంధించి తేడాలుంటే వారిచ్చే నోటీసుల ఆధారంగా వ్యవహరిస్తామన్నారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

2024లో అసాధారణ వాతావరణం

ప్రకృతి వైపరీత్యాలతో 3,204 మంది మృతి

- పలు రాష్ట్రాల్లో జాతీయ సగటు కంటే అధిక ఉష్ణోగ్రత
- 15 అత్యంత వేడి సంవత్సరాల్లో పది ఈ దశాబ్దంలోనే
- అసాధారణ వర్షాలతో పలు నగరాలు అతలాకుతలం
- భారత వాతావరణ శాఖ 2024 వార్షిక నివేదిక

విశాఖపట్నం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గతేడాది వానలు దంచికొట్టాయి... ఎండలు మండిపోయాయి.. ప్రకృతి వైపరీత్యాలూ విరుచుకుపడ్డాయి. వెరసి... దేశంలో 2024లో అసాధారణ వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రకృతి వైపరీత్యాలకు దేశవ్యాప్తంగా 3,204 మంది చనిపోయారు. పిడుగులు పడి బిహార్‌లో, వరదలకు కేరళలో భారీగా మృత్యువాత పడ్డారు. పలు రాష్ట్రాల్లో అసాధారణ ఎండలు కాసి, జాతీయ వార్షిక సగటు కంటే ఒక డిగ్రీ ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రెండు రుతుపవనాల సీజన్లలో పలుచోట్ల రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. 2024 సంవత్సరం... శీతాకాలం (జనవరి నుంచి ఫిబ్రవరి), రుతుపవన ముందస్తుకాలం (మార్చి నుంచి మే), నైరుతి రుతుపవన కాలం (జూన్ నుంచి సెప్టెంబరు), ఈశాన్య రుతుపవన కాలం (అక్టోబరు నుంచి డిసెంబరు) సీజన్లలో సంభవించిన అసాధారణ పరిస్థితులపై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) నివేదిక విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల ప్రభావంతో ఏటేటా అసాధారణంగా ప్రకృతి విపత్తులు సంభవించి ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవిస్తున్నాయి. 2024లో ప్రకృతి విపత్తుల ప్రభావానికి దేశంలో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. పిడుగుపాటుకు 1,374 మంది, వరదలు, భారీవర్షాలకు 1,287, వడగాడ్పులకు 459, తుఫాన్‌లకు 70 మంది, శీతలగాలులు, పెనుగాలులకు ఏడుగురు, వడగళ్లకు ఇద్దరు, మంచు ప్రభావానికి ఒకరు చనిపోయారు. పిడుగుల కారణంగా బిహార్‌లో, వరదల వల్ల కేరళలో ఎక్కువమంది మృత్యువాత పడగా.. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఏపీలో సుమారు 50 మంది, తెలంగాణలో 150 మంది చనిపోయారు.

రోజుల తరబడి రికార్డు ఉష్ణోగ్రతలు

1901 నుంచి పరిశీలిస్తే దేశంలో 15 అత్యంత వేడి సంవత్సరాల్లో గత దశాబ్దకాలంలోనే పది ఉండడం గమనార్హం. జాతీయ వార్షిక సగటు కంటే 2024లో 0.65 డిగ్రీలు, 2016లో 0.54, 2009లో 0.40, 2010లో 0.39, 2017లో 0.36 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. గడచిన పది సంవత్సరాలను అత్యంత వేడి కాలంగా ఐఎండీ పేర్కొంది. ఇంకా 1901 నుంచి చూస్తే గతేడాది అక్టోబరు నెలలో జాతీయ సగటు కంటే 1.23 డిగ్రీలు ఎక్కువ ఉష్ణోగ్రత నమోదై అత్యంత వేడి నెలగా రికార్డు నెలకొల్పింది. భూతాపం ప్రభావంతో గతేడాది అనేక నగరాలు, ప్రాంతాలు తీవ్రమైన వడగాడ్పుల్లో చిక్కుకోగా రోజుల తరబడి రికార్డు ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. చురు (రాజస్థాన్)లో 50.5, గంగానగర్‌లో 49.4, వారాణసీలో 47.8, గయలో 47.4, సుల్తాన్‌పూర్‌లో 47 డిగ్రీలు నమోదయ్యాయి. ఇవి గతం కంటే అధికం. గతేడాది జూలై 19న పోరుబందర్‌లో 485.8 మి.మీ., డిసెంబరు 1న పుదుచ్చేరిలో 483.7, జూలై 20న ద్వారకా (గుజరాత్)లో 418.6 మి.మీ. రికార్డు స్థాయి వర్షపాతం నమోదు కావడంతో ఆయా నగరాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

- గతేడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఒక తుఫాన్, మూడు తీవ్ర వాయుగుండాలు, రెండు వాయుగుండాలు, ఒక తీవ్ర అల్పపీడనం, ఆరు అల్పపీడనాలు ఏర్పడ్డాయి. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో ఒక తీవ్ర తుఫాన్, ఒక తుఫాన్, మూడు వాయుగుండాలు, రెండు తీవ్ర అల్పపీడనాలు, రెండు అల్పపీడనాలు వచ్చాయి. మొత్తం 2024లో రీమెల్, దానా తీవ్ర తుఫాన్‌లు, అస్నా, ఫెంగల్ తుఫాన్‌లు సంభవించాయి.



ఎండలు మండిపోయాయి..

ఏడాదిలో ఎక్కువ రోజులు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగానే నమోదయ్యాయి. వాతావరణ శాఖ వద్ద ఉన్న వివరాల ప్రకారం 1901 నుంచి ఇప్పటి వరకూ నమోదైన జాతీయ వార్షిక సగటు కంటే 2024లో 0.65 డిగ్రీలు ఎక్కువగా నమోదైంది. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్‌లోని తూర్పు ప్రాంతం, పశ్చిమబెంగాల్, సిక్కిం, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కర్ణాటక, మధ్య మహారాష్ట్ర, బిహార్, రాయలసీమ, కేరళ వాతావరణ సబ్ డివిజన్‌లలో జాతీయ వార్షిక సగటు కంటే ఒక డిగ్రీ ఎక్కువగా నమోదయ్యాయి. ఆయా డివిజన్‌లలో అసాధారణ పరిస్థితులు నెలకొనడం ఆందోళన కలిగిస్తున్న అంశమని వాతావరణ నిపుణులు విశ్లేషించారు.

'అగ్రి ఇంజనీరింగ్ డైరెక్టరేట్'పై

మీనమేషాలు!



గతంలోనే తయారైన ముసాయిదా

- అటకెక్కించిన వైసీపీ సర్కార్
- డైరెక్టరేట్ ఏర్పాటును గుర్తు చేస్తున్న కేంద్రం
- 'అది ఏర్పాటైతేనే నిధులు' అని స్పష్టీకరణ!
- చాలా రాష్ట్రాలు ముందంజ.. ఏపీ జాప్యం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ అనుబంధ శాఖల్లో సాంకేతికతను పర్యవేక్షించే ఇంజనీరింగ్ యంత్రాంగాన్ని ఒకే గొడుకు కిందకు తేవడం ద్వారా అగ్రికల్చర్ ఇంజనీరింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా గతంలో టీడీపీ ప్రభుత్వం ఒక ముసాయిదాను రూపొందించింది. పెద్దగా ఖర్చు లేకుండా, కేవలం వ్యవసాయ ఇంజనీరింగ్ అధికారుల సర్దుబాటు, హోదాల సవరణలతో జరిగే ప్రక్రియ ఇది. కానీ గత వైసీపీ ప్రభుత్వం ఈ ముసాయిదాను అటకెక్కించింది. ఇప్పుడు ప్రభుత్వం మారినా ఇంకా దీనిపై దృష్టి పెట్టకపోవడంతో ముసాయిదా కాగితాలకే పరిమితమైంది. దీని ఏర్పాటుపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం ఎందుకో అర్థం కావడంలేదు!!.

తాజాగా కేంద్రం నుంచి లేఖలు!

సన్నచిన్నకారు రైతులకు మేలు చేసేలా, వ్యవసాయ యాంత్రీకరణ బలోపేతానికి అన్ని రాష్ట్రాల్లోనూ వ్యవసాయ ఇంజనీరింగ్ డైరెక్టరేట్‌లు ఏర్పాటు చేయాలన్న పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫారసును అమలు చేయాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి దేవేష్ చతుర్వేది రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు తాజాగా లేఖలు రాశారు. దీంతో వ్యవసాయ ఇంజనీరింగ్ అధికారులు, విద్యార్థుల్లో ఆశలు చిగురించాయి. వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగం రాష్ట్రానికి చాలా ముఖ్యమైంది. కేంద్రం వ్యవసాయ యాంత్రీకరణకు వివిధ ప్రాజెక్టు ద్వారా ఏటా వేల కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ నిధుల్ని వాడాలంటే ఆశాఖ ఉండాలి. కానీ రాష్ట్రంలో నూతన యంత్ర పరికరాలను అందుబాటులోకి తెచ్చే నిపుణులు, నైపుణ్యం కొరవడిందన్న విమర్శలున్నాయి. ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలో వ్యవసాయ ఇంజనీరింగ్ కాలేజీలు బాపట్ల, మడకశిరలోనే ఉన్నాయి. అక్కడి నుంచి ఏటా 100మంది దాకా ఇంజనీరింగ్ పట్టభద్రులు తయారవుతున్నారు. కానీ వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రభుత్వపరంగా లేవు. దీంతో అగ్రికల్చర్ బీఎస్సీ చేసిన వారు ప్లాంట్ పారామీటర్స్ మాత్రమే చూస్తున్నారు. వ్యవసాయ రంగంలో ప్రాధాన్యమున్న నూతన యాంత్రీకరణను రైతులకు అందుబాటులోకి తేవడం లేదా వారికి అవగాహన కల్పించే వారు కరువయ్యారు. అదే వ్యవసాయ ఇంజనీరింగ్‌కు ప్రత్యేక సంస్థ ఉంటే వారి అవసరం, వారికి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని చెప్తున్నారు. కొత్తగా డ్రోన్స్, రోబోస్, సెన్సార్ బేస్ట్ యాంత్రీకరణ వస్తున్న నేపథ్యంలో వ్యవసాయ ఇంజనీరింగ్‌కు ప్రత్యేక సంస్థ ఉంటేనే నిధులిస్తామని కేంద్రం చెప్తోంది. దీంతో చాలా రాష్ట్రాల్లో ప్రత్యేక డైరెక్టరేట్లు ఏర్పాటవుతున్నాయి. పొలం చదును నుంచి పంట కోత, ఉత్పత్తుల శుద్ధి, మార్కెటింగ్ వరకు యాంత్రీకరణ వరకు ఉపయోగపడే యంత్రాలు వస్తున్నాయి. కానీ వాటిపై రైతుకు అవగాహన కల్పించడం లేదు. విత్తనం వేసేటప్పుడు ఎలా పడితే అలా వేయకుండా, తగిన లోతు, వరుస క్రమంలో నాటే యంత్రాలున్నాయి. అంతర సాగులో కలుపు నివారణ పద్ధతులు కూడా కొత్త సాంకేతికత వస్తోంది. పండ్ల తోటల్లో చేతులతో కోయడంతో పండ్లు పాడైపోతున్నాయి. ఎగుమతులకు అవకాశం లేకుండా పోతోంది. భూమిలో మిత్ర పురుగులు సంరక్షణ, చీడపురుగుల నివారణ వంటి చర్యల్లో సంప్రదాయ పద్ధతుల కన్నా ఆధునిక సాంకేతిక ఉందని చెప్తున్నారు. పొలాలు, తోట నుంచి పంట ఉత్పత్తుల తరలింపు, గోదాముల్లో నిల్వ చేసే పద్ధతుల్లోనూ సాంకేతికతను వినియోగించే విధానాలు కొన్ని దేశాలు పాటిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నూతన సాంకేతికత, ఊబరైజేషన్‌కు ప్రాధాన్యమిచ్చే సీఎం చంద్రబాబు వ్యవసాయ ఇంజనీరింగ్ డైరెక్టరేట్‌పై దృష్టి పెడితే.. రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఇంజనీరింగ్ విద్యార్థులు, నిపుణులు సూచిస్తున్నారు.

రిజిస్ట్రేషన్ల శాఖలో

అధికారులందరూ డమ్మీలే

- దిగువ స్థాయి ఉద్యోగులపై సర్వాధికారాలూ ప్రభుత్వానికే
- అధికార కేంద్రీకరణ ఉత్తర్వులపై సర్వత్రా విమర్శ



అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): 'పాలన, అధికారాల వికేంద్రీకరణ జరగాలి. మరింత పారదర్శకంగా, తేలికగా ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరాలి. అందులో ఎలాంటి అవినీతికి ఆస్కారం ఉండకూడదు'.. ప్రభుత్వాధినేత సీఎం చంద్రబాబు పదేపదే చెపుతున్న మాట ఇది. అందుకు విరుద్ధంగా, మరే శాఖలోనూ లేనివిధంగా అధికార కేంద్రీకరణకు నాంది పలుకుతూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమయింది. జనవరి 8వ తేదీన జారీ అయిన ఆ ఉత్తర్వుల్లో 'ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు, డిప్యూటేషన్లపై ఉన్న ఆంక్షలను పదే పదే ఉల్లంఘిస్తున్నారు. ఆంక్షల స్ఫూర్తిని దెబ్బ తీస్తున్నారు. ఈ నేపథ్యంలో జూనియర్ అసిస్టెంట్లు, ఆపై స్థాయి ఉద్యోగుల బదిలీలు, డిప్యూటేషన్లకు సంబంధించిన ప్రతిపాదనలు ఇక నుంచి ప్రభుత్వానికి పంపించాలి. ప్రతిపాదన సక్రమమేననడానికి అనువైన అన్ని వాదనలనూ అందులో పొందుపరచాలి. ప్రభుత్వం దానిని పరిశీలించి సంబంధిత అధికారి తగు చర్యలు తీసుకోవడానికి అనుమతి ఇస్తుంది. దీనిని ఉల్లంఘించిన వారిపై తీవ్రమైన చర్యలు ఉంటాయి' అంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అసలు వివాదమంతా దీనిలోనే ఉంది. బదిలీలపై నిషేధం ఉన్న సమయంలో వివిధ కారణాల పేరుతో డిప్యూటేషన్ అంటూ నిషేధం స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని భావిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకొనే హక్కు ప్రభుత్వానికి ఎప్పుడూ ఉంటుంది. ఆ దిశగా చర్యలు తీసుకోకుండా ఐజీ, డీఐజీ, డీఆర్‌ల అధికారాలను వారి నుంచి లాగేసుకోవడం అంటే వ్యవస్థను కూలదోయడమే. స్థానిక అధికారులు దిగువ స్థాయి ఉద్యోగులపై పట్టుకోల్పోతారు. తమ అవసరాలకు నేరుగా పైనే పైరవీలు చేసుకోవచ్చన్న ధీమా వచ్చిన తరువాత క్షేత్రస్థాయిలోని అధికారులకు ఇవ్వవలసిన విలువ ఇవ్వరు. ఇప్పటికే ఈ శాఖలో ప్రభుత్వ అనుమతితో చేసిన సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు అత్యంత వివాదాస్పదం అయ్యాయి. ఇప్పుడు జూనియర్ అసిస్టెంట్లు, ఆ పైస్థాయి ఉద్యోగుల డిప్యుటేషన్లకూ ప్రభుత్వం అనుమతి అవసరం అన్న ఆదేశాలు జారీ చేయడం దేనికోసమన్న సందేహం వ్యక్తమవుతోంది.

త్వరలో సీఐలకు పదోన్నతి



- మహిళలపై నేరాలు అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు: డీజీపీ

కర్నూలు క్రైం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే సీఐలకు, డీఎస్పీలుగా పదోన్నతులు కల్పించేందుకు కసరత్తు జరుగుతోందని డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం కర్నూలు, నంద్యాల జిల్లా కేంద్రాల్లో డీజీపీ పర్యటించారు. కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో డీఐజీ కోయ ప్రవీణ్‌తో కలిసి జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మీడియాతో మాట్లాడారు. 'విదేశాల్లో వాడుతున్న సాంకేతికతను ఉపయోగించుకుని జిల్లా పోలీసు శాఖ కొత్త తరహాగా పని చేసేందుకు సిద్ధమవుతోంది. కొత్త నేరాలు వస్తుండటంతో వాటిని అరికట్టేందుకు ఈ టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతుంది. మహిళలు, చిన్న పిల్లలపై జరిగే లైంగిక నేరాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఈ మేరకు ప్రతి జిల్లాలో ప్రత్యేకంగా పోలీసు బృందం ఏర్పాటు చేశాం. ఈ పోలీసు బృందాలు సంఘటన జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంటాయి.' అని తెలిపారు. డీజీపీ వెంట కర్నూలు ఎస్పీ బిందుమాధవ్, నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ ఆదాయాన్ని పెంచండి.. వ్యయాన్ని తగ్గించండి

- ప్రమాద బీమా 30 లక్షల నుంచి కోటికి పెంపు: ఎండీ

కర్నూలు రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): 'ఏపీఎస్‌ఆర్టీసీలో వ్యయాన్ని తగ్గించి, ఆదాయాన్ని పెంచాలి. నేను ఎండీగా బాధ్యతలు చేపట్టి 44 నెలలు కావస్తోంది. ఈ కాలంలో కార్పొరేషన్‌లో అనేక సంస్కరణలు తీసుకొచ్చా' అని సంస్థ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు అన్నారు. బుధవారం కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కర్నూలు-1 డిపో గ్యారేజీలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల సమావేశంలో ప్రసంగించారు. 'ఈ సంక్రాంతి పండుగకు రూ.23.70 కోట్ల దాకా కార్పొరేషన్‌కు ఆదాయం తీసుకొచ్చి చరిత్ర సృష్టించింది. ఇలాంటి రాబడి మునుపెన్నడూ రాలేదు. ఇది కార్పొరేషన్‌లో మైలురాయిగా నిలిచింది. ప్రమాద బీమా రూ.30 లక్షలు మాత్రమే ఉండేది. దానిని రూ.కోటి వరకు తెచ్చాం. దాదాపు 1,600 మందికి లబ్ధిచేకూర్చాం. ఇప్పటికే సీపీఎస్‌కు దాదాపు రూ.169 కోట్లు చెల్లించాం. 2017లో ఎరియర్స్ 50 శాతం ఇచ్చాం. మిగిలిన 50 శాతం త్వరలోనే ఇప్పించి నైట్ అవుట్ అలవెన్స్‌లు కూడ మంజూరు చేస్తాం. పీఎఫ్ ట్రస్టుకు రూ.960 కోట్ల బకాయిలు చెల్లించాం' అని ద్వారకా తిరుమలరావు తెలిపారు.

కల్కి ట్రస్ట్‌పై ఎన్‌జీటీలో కేసు: నార్నె వెంకట సుబ్బయ్య

విజయవాడ వన్‌టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అంజూర్ అటవీ భూములను ఆక్రమించిన కల్కి ట్రస్ట్‌పై జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ)లో కేసు నమోదైందని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లా కళ్లివెట్టులోని అంజూర్ అటవీశాఖ భూమిని కల్కి ట్రస్ట్ ఆక్రమించినా అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. 20.75 ఎకరాలను ఆక్రమించి పెద్దపెద్ద కట్టడాలు నిర్మించిందన్నారు. ఆర్టికల్ 51ఎ(హెచ్) ప్రకారం ఎన్‌జీటీలో కేసు వేశానని, తిరుపతి కలెక్టర్, కల్కి ట్రస్ట్, అటవీ శాఖ అధికారులకు కోర్టు నోటీసులు పంపిందని తెలిపారు.

క్లస్టర్ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణకు కమిటీ

- చైర్మన్‌గా పీఆర్ అడిషనల్ కమిషనర్... ఉత్తర్వులు జారీ

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పంచాయతీల ఆదాయం ఆధారంగా 2010లో ఏర్పాటుచేసిన క్లస్టర్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించేందుకు కమిటీని ఏర్పాటుచేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించి కలెక్టర్లు ఇప్పటికే ప్రతిపాదనలు సమర్పించారు. ఈ ప్రతిపాదలను పరిశీలించాల్సిన అవసరముంది. పునర్వ్యవస్థీకరణ సిఫారసుల నిమిత్తం నలుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీరాజ్ అడిషనల్ కమిషనర్ డి.సత్యనారాయణ చైర్మన్‌గా, డిప్యూటీ కమిషనర్ వి.నాగార్జునసాగర్ కన్వీనర్‌గా, కమిషనర్ ఓఎస్‌డీ కె.ఆనంద్, అసిస్టెంట్ కమిషనర్ కె.శ్రీదేవి కమిటీ సభ్యులుగా నియమిస్తూ ఆదేశాలిచ్చారు.

నెత్తురోడిన కర్ణాటక రహదారులు

- యాక్సిల్ రాడ్డు విరిగి బోల్తా పడిన వాహనం
- ముగ్గురు వేద విద్యార్థులు, డ్రైవర్ దుర్మరణం
- మంత్రాలయం నుంచి హంపిలో ఆరాధనోత్సవాలకు వెళ్తుండగా దారుణం
- మరో ప్రమాదంలో లారీ బోల్తాపడి పది మంది మృతి
- 18 మందికి గాయాలు.. ఉత్తర కన్నడ జిల్లాలో ఘోరం
- మృతుల కుటుంబాలకు ప్రధాని, సీఎం 5 లక్షలు పరిహారం



ఘటనా స్థలంలో బోల్తాపడిన వాహనం, మృతులు గుంజల్లి సుజయీంద్ర, హయవదన, అభిలాష్, కంసాలి శివ

మంత్రాలయం/ బళ్లారి/ రాయచూరు/ బెంగళూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో రహదారులు రక్తసిక్తమయ్యాయి. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రెండు ఘోర రోడ్డు ప్రమాదాల్లో 14 మంది దుర్మరణం పాలయ్యారు. వీరిలో కర్నూలు జిల్లా మంత్రాలయంలోని సంస్కృత పాఠశాలకు చెందిన వేద విద్యార్థులు ముగ్గురు, ఒక డ్రైవర్ ఉండగా మరో పదిమంది కర్ణాటక వాసులు. పోలీసుల కథనం మేరకు... మధ్వాచార్యుల ప్రత్యక్ష ప్రథమ శిష్యులైన శ్రీనరహరితీర్థుల ఉత్తరారాధన పూజల కోసం మంత్రాలయం నుంచి 20 వాహనాల్లో వేద విద్యార్థులు, పట్టణ ప్రముఖులు, నాయకులు, మఠం సిబ్బంది కలసి దాదాపు 300 మంది మంగళవారం రాత్రి హంపి వెళ్లారు. ఒక వాహనంలో గురుసార్వభౌమ సంస్కృత పాఠశాల వేద విద్యార్థులు 13మంది ఉన్నారు. అర్ధరాత్రి సమయంలో రాయచూరు జిల్లా పోతనాల గ్రామం వద్ద యాక్సిల్ రాడ్డు విరగడంతో వాహనం రోడ్డుపై మూడు పల్టీలు కొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో మంత్రాలయానికి చెందిన డ్రైవర్ కంసాలి శివ(20) అక్కడికక్కడే మృతిచెందగా, గుంజెల్లి సుజయీంద్ర (22), బళ్లారికి చెందిన హయవదన(19), కొప్పళకు చెందిన అభిలాష్ (20) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఇదే వాహనంలో ప్రయాణిస్తున్న కర్ణాటక, ఏపీ, తెలంగాణకు చెందిన మరో 10 మంది వేద విద్యార్థులు సింధనూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బళ్లారికి చెందిన వేద విద్యార్థి జయసింహ పరిస్థితి విషమంగా ఉండటంతో రాయచూరు ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, సిద్దరామయ్య, రేవంత్ రెడ్డి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సీఎం సిద్దరామయ్య రూ.5లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు.

కన్నీరు పెట్టుకున్న పీఠాధిపతి

సంస్కృత పాఠశాల విద్యార్థులు మృతిచెందడంపై పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు కన్నీరు పెట్టుకున్నారు. నరహరి తీర్థుల ఆరాధన పూజలపై సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రావడంతో సంబరాలు చేసుకునే సమయంలో ఈ ఘటనతో సంబరాలు రద్దు చేసుకున్నారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని పీఠాధిపతి చెప్పారు.

పది మంది ఉసురు తీసిన పొగమంచు

పండ్లు, కూరగాయలు తరలిస్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో పది మంది మృతిచెందారు. 18మంది తీవ్రంగా గాయపడ్డారు. ఉత్తర కన్నడ జిల్లా గుళ్ళాపుర వద్ద బుధవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. దట్టమైన పొగమంచు కారణంగా, ఎదురుగా వస్తున్న వాహనానికి దారి వదిలే క్రమంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని, లారీ గుంతలోకి బోల్తా పడింది. దీంతో పండ్లు, కూరగాయల సంచులపై కూర్చున్నవారు వాటి కింద ఇరుక్కుని, ఊపిరాడక విలవిల్లాడారు. అక్కడికక్కడే 9మంది చనిపోగా, ఆస్పత్రిలో మరొకరు మరణించారు. పొగమంచు కారణంగా సుమారు గంటపాటు ఎవరూ ఘటనను గుర్తించలేకపోయారు. దీంతో మృతుల సంఖ్య పెరిగిందని పోలీసులు చెప్పారు. మృతులను ఫయాజ్ ఇమాంసాబ్ జమఖండి(45), వసీమ్ విరుల్లా ముడగేరి(35), ఇజాజ్ ముస్తాక్ ముళ్ళ(20), సాదిక్ బాషా (30), గులాం హుసేన్ జవళి(40), ఇంతియాజ్ మంజఫర్ ముళకే (36), అల్ఫాజ్ జాఫర్ మండక్కి(25), జిలాని అబ్దుల్ జఖాతి(25), అస్లాం బాబులి బెన్ని(24), జలాల్ తార(30)గా గుర్తించారు. వీరంతా సంతల్లో వ్యాపారాలు చేస్తుంటారు. ప్రమాదంపై సీఎం సిద్దరామయ్య విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.3లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు చొప్పున, క్షతగాత్రులకు రూ.50వేలు చొప్పున ప్రధాని మోదీ పరిహారం ప్రకటించారు.



గొర్లె మన్మథరావు, అరుణకుమారి

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

- ఇసుకలో జారిన బైక్... 10మీ. ఈడ్చుకెళ్లిన లారీ

కూర్మన్నపాలెం(విశాఖపట్నం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): బ్యాంకు పని మీద బయలుదేరిన దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. విశాఖపట్నం నగర పరిధిలోని అగనంపూడి వద్ద ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పార్వతీపురం మన్యం జిల్లా గడిసింగుపురానికి చెందిన గొర్లె మన్మథరావు(41), అరుణకుమారి (34) దంపతులు అగనంపూడి సమీపాన పినమడకలో నివసిస్తున్నారు. బుధవారం మన్మథరావు, అరుణకుమారి బ్యాంకు పని మీద బైక్‌పై గాజువాక బయలుదేరారు. అగనంపూడి టోల్‌గేటు దాటాక ఇసుకలో బైక్ జారడంతో ఇద్దరూ కిందపడిపోయారు. అదే సమయంలో పక్క నుంచి వెళుతున్న లారీ వారిని సుమారు పది మీటర్లు ఈడ్చుకెళ్లింది. దీంతో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మలేసియాలో చిక్కుకుపోయిన అన్నదమ్ములు!

- జీవనోపాధి కోసం పరాయి దేశానికి పర్యాటక వీసాపై తీసుకెళ్లి వదిలేసిన ఏజెంట్
- పోలీసులు పట్టుకున్నారంటూ ఇంటికి ఫోన్
- లబోదిబోమంటున్న తల్లిదండ్రులు
- మంత్రులు పవన్, లోకేశ్ ఆదుకోవాలని వేడుకోలు



పవన్, సింహాద్రి(ఫైల్)

రాపూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వరుసకు సోదరులైన ఇద్దరు యువకులు పొట్టకూటి కోసం మలేసియా వెళ్లి చిక్కుల్లో పడ్డారు. వారిని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రక్షించి స్వదేశానికి తీసుకురావాలని వారి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. నెల్లూరు జిల్లా రాపూరు మండలం తెగచర్ల గ్రామానికి చెందిన కరిపం పెంచలయ్య, కరిపం పెద్దయ్య అన్నదమ్ములు. వీరి పిల్లలు కరిపం పవన్‌కుమార్ (23), కరిపం సింహాద్రి(22) జీవనోపాధి కోసం ఏడు నెలల క్రితం మలేసియా వెళ్లారు. తిరుపతికి చెందిన ఏజెంట్ వెంకటేశ్వర్లు వీరిని పర్యాటక వీసాపై మలేసియాకు తీసుకెళ్లి మోసం చేశాడని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. పర్యాటక వీసా గడువు ముగియడంతో వారిని ఏజెంట్ మలేసియాలో వదిలేసి వెళ్లిపోయాడని, దిక్కుతోచని తమ బిడ్డలు అక్కడే ఉండిపోయారని తెలిపారు. 20 రోజుల క్రితం తమను పోలీసులు పట్టుకున్నారంటూ పవన్‌కుమార్, సింహాద్రి ఫోన్ చేసి చెప్పారన్నారు. బుధవారం వెంకటగిరిలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను కలిసి విషయం తెలియజేశామని పెంచలయ్య, పెద్దయ్య తెలిపారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ స్పందించి తమ బిడ్డలను కాపాడాలని వారు వేడుకుంటున్నారు.

యూజీసీ ప్రతిపాదనలను వ్యతిరేకించండి!

- సీఎం చంద్రబాబుకు సీపీఐ రామకృష్ణ లేఖ

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో వైస్ చాన్సలర్ల నియామకానికి సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ముసాయిదా-2025 నిబంధనలను వ్యతిరేకించడం ద్వారా విద్యా వ్యవస్థ ప్రమాణాలను కాపాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశంపై శాసనసభలో చర్చించి ఏకగ్రీవ తీర్మానాన్ని చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు బుధవారం ఆయన లేఖలు రాశారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వాలు వీసీల నియామకానికి గవర్నర్లకు సిఫారసులు చేసేవని, అయితే, ఈ అధికారాన్ని నేరుగా గవర్నర్లకు ఇస్తూ యూజీసీ తాజాగా ప్రతిపాదనలు చేసిందని తెలిపారు. దీనివల్ల తగిన అర్హతలు లేనివారిని అందలమెక్కించే ఆస్కారముందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాఖ్య స్ఫూర్తికి విఘాతంగా మారిన యూజీసీ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ కేరళ, తమిళనాడు రాష్ట్రాలు ఇప్పటికే అసెంబ్లీల్లో తీర్మానాలు చేశాయని తెలిపారు.

రాజకీయ ఎజెండాతో విధాన నిర్ణయాలు తగవు

- సీపీఎం 27వ మహాసభల్లో వక్తలు

గవర్నర్‌పేట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమగ్రాభివృద్ధికి విధాన నిర్ణయాలు తీసుకునేటప్పుడు ప్రభుత్వం రాజకీయ ఎజెండా ప్రాతిపదికగా ముందుకు సాగడం దురదృష్టకరమని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. సీపీఎం రాష్ట్ర 27వ మహాసభల సందర్భంగా బుధవారం విజయవాడలో రాష్ట్ర సమగ్రాభివృద్ధి-ప్రత్యామ్నాయ విధానాలపై సదస్సు జరిగింది. సదస్సులో శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల్లో ప్రగతి సాధించడానికి రాజకీయ నిర్ణయాలు సరికాదన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం చొరవ చూపి ప్రతి జిల్లాలో మేధావులతో సమావేశాలు జరిపి అభిప్రాయాలు సేకరించాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీ ధనవంతులు ఇతర ప్రాంతాలకు పోకుండా రాష్ట్రంలోనే పెట్టుబడులు పెట్టేలా చంద్రబాబు చర్యలు తీసుకోవాలన్నారు. యూనివర్సిటీల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా ప్రైవేట్ వర్సిటీలను ప్రభుత్వం ప్రోత్సహిస్తూ, విద్యారంగాన్ని నాశనం చేస్తోందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విమర్శించారు.

ఏపీఆర్‌ఈఏటీకు 14 పోస్టులు మంజూరు

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఏపీఆర్‌ఈఏటీ)కు 14 పోస్టులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రిజిస్ట్రార్, కోర్టు ఆఫీసర్, ఇద్దరు సెక్షన్ ఆఫీసర్లు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 4, సీనియర్ స్టెనో ఒకరు, రికార్డు అసిస్టెంట్ ఒకరు, ఆఫీసు సబార్డినేట్ పోస్టులు మూడు... మంజూరు చేస్తూ మున్సిపల్ శాఖ ఆదేశాలిచ్చింది.

పోలవరానికి మరో 2,500 కోట్లు!

- కేంద్రం సూత్రప్రాయ అంగీకారం
- వారంలోగా విడుదల చేసే అవకాశం
- నేడు ప్రాజెక్టు సందర్శనకు మంత్రి నిమ్మల



అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు కోసం కేంద్రం ఈ ఆర్థిక సంవత్సరంలో ఇచ్చేందుకు అంగీకరించిన రూ.5,000 కోట్ల అడ్వాన్సులో మిగతా రూ.2,500 కోట్లు కూడా విడుదల చేయనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇప్పటికే తొలివిడతగా రూ.2,348 కోట్లు అడ్వాన్సుగా ఇచ్చిన సంగతి తెలిసిందే. రీయింబర్స్‌మెంట్ కింద మరో రూ.459 కోట్లను కూడా మంజూరు చేసింది. అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు ప్రారంభమైనందున అడ్వాన్సుగా ఇవ్వాల్సిన మిగతా రూ.2500 కోట్లను కూడా మంజూరు చేయాలని ఇటీవల కేంద్రాన్ని కోరినట్లు జల వనరుల శాఖ వర్గాలు తెలిపాయి. ఇందుకు జలశక్తి శాఖ సూత్రప్రాయంగా అంగీకరించిందని వెల్లడించాయి. నిధులు విడుదల చేయాలన్న నిర్ణయం కూడా తీసుకుందని.. వారం రోజుల్లోపే ఆ మొత్తం రాష్ట్రానికి ఇచ్చే అవకాశం ఉందని పేర్కొన్నాయి. కాగా.. దావోస్ పర్యటన నుంచి వచ్చాక పోలవరం పనులు పరిశీలించేందుకు వెళ్తానని సీఎం చంద్రబాబు చెప్పిన నేపథ్యంలో జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం ప్రాజెక్టును సందర్శించనున్నారు. ఇంకోవైపు.. డయాఫ్రం వాల్ నిర్మాణ పనులకు టీ-16 ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమాన్ని నిర్మాణ సంస్థ బావర్ వాడుతోందని ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి తెలిపారు. అంతర్జాతీయ నిపుణుల సూచన మేరకు కేంద్ర జలసంఘం ఆదేశాలతో బుధవారం నుంచి ఈ మిశ్రమాన్ని వినియోగిస్తున్నట్లు వెల్లడించారు.



అమరావతికి హడ్కో రుణం 11 వేల కోట్లు

బోర్డు సమావేశంలో నిర్ణయం.. టిడ్కో ఇళ్లకు రూ.4,400 కోట్లు
మంత్రి నారాయణ వెల్లడి

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(హడ్కో) రూ.11 వేల కోట్ల రుణం ఇచ్చేందుకు అంగీకరించిందని మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. రాజధాని నిర్మాణానికి ఈ మేరకు నిధులు విడుదల చేయాలని ముంబైలో జరిగిన హడ్కో బోర్డు సమావేశంలో నిర్ణయించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. హడ్కో ద్వారా రూ.11 వేల కోట్ల రుణం కోసం ప్రభుత్వం సంప్రదింపులు జరిపిందని గుర్తు చేశారు. ఇందుకు హడ్కో సానుకూలంగా స్పందించిందన్నారు. హడ్కో నిర్ణయంతో రాజధాని అమరావతి పనులు వేగవంతమవుతాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం అమరావతి రాజధానిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని, ఆంధ్రప్రదేశ్ రాజధాని ఏది అంటే సమాధానం చెప్పలేని పరిస్థితిని కల్పించిందన్నారు. కేంద్రంలో ఎన్డీయే సర్కార్, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక రాష్ట్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో కూడా అమరావతి నిర్మాణానికి నిధులు కేటాయిస్తోందన్నారు.

టిడ్కోకు రుణాలు

అమరావతితో పాటు రాష్ట్రవ్యాప్తంగా గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను పూర్తి చేసేందుకు, ఇళ్ల సముదాయాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు టిడ్కోకు హడ్కో 4,400 కోట్ల రుణం మంజూరు చేసిందని మంత్రి నారాయణ తెలిపారు. ఈ నిధులతో పనులు చేపట్టి టిడ్కో ఇళ్ల సముదాయాలను నివాసయోగ్యంగా తయారు చేయవచ్చని తెలిపారు.

మైనార్టీల ఆర్థికాభివృద్ధికి రుణాలు

- 50 శాతం సబ్సిడీతో మంజూరు : మంత్రి ఫరూక్



అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మైనార్టీల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి మైనార్టీల స్వయం ఉపాధి, నైపుణ్య, ఉపాధి కల్పన కోసం రూ.326 కోట్లు ఖర్చు చేసేందుకు మైనార్టీ సంక్షేమ శాఖ చర్యలు చేపట్టిందని బుధవారం తెలిపారు. ప్రభుత్వం తరపున రూ. 152.50 కోట్లు, బ్యాంకుల ద్వారా రూ. 152.50 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. బ్యాంకు లింకేజీ ద్వారా రాయితీ రుణాలను 19,790 మందికి, నైపుణ్య శిక్షణ ఉపాధి కల్పన ద్వారా 29,428 మందికి మొత్తం 49,218 మందికి చేయూత ఇవ్వబోతున్నట్లు తెలిపారు.

డిస్కంలను ట్రాన్స్‌కో పరిధిలోకి తీసుకురండి

- మంత్రి గొట్టిపాటికి తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం విజ్ఞప్తి



అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం నేతలు బుధవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో అమరావతి సచివాలయంలో భేటీ అయ్యారు. తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన ముందు ఉంచారు. తమ సమస్యలను పరిష్కారించాలంటూ విజ్ఞప్తి చేశారు. 'సచివాలయాల పరిధిలో ఉన్న సుమారు 7,400 మంది గ్రేడ్-2 జూనియర్ లైన్‌మెన్‌లను విద్యుత్తు శాఖలో విలీనం చేయాలి. నాలుగు డిస్కంలను ట్రాన్స్‌కో పరిధిలోకి తీసుకురావాలి. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు ఇవ్వాల్సిన నిధుల నుంచి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్‌కు గత ప్రభుత్వం చెల్లించిన రూ.25,000 కోట్లను కూడా తిరిగి సంస్థలో జమ చేయించేలా చర్యలు తీసుకోవాలి' అంటూ నేతలు విజ్ఞప్తి చేశారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి గొట్టిపాటి, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాగా, అధికలోడ్ ట్రాన్స్‌ఫార్మర్ రుసుములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలంటూ పలువురు ఆక్వా రైతులు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను బుధవారం అమరావతి సచివాలయంలో కలిసి తమ సమస్యలను వివరించారు.

ఎంఎస్‌ఓల సమస్యలు పరిష్కరిస్తాం

- స్మార్ట్ టీవీలు లేనివారికి ఐపీ బాక్సులు: ఫైబర్‌నెట్ చైర్మన్ జీవీ రెడ్డి



అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫైబర్ నెట్ సేవలను విస్తరించేందుకు వీలుగా మల్టీపర్పస్ సర్వీస్ ఆపరేటర్ (ఎంఎస్‌ఓ)ల సమస్యలను పరిష్కరిస్తామని సంస్థ చైర్మన్ జీవీ రెడ్డి స్పష్టం చేశారు. విజయవాడలోని రాష్ట్ర ఫైబర్‌నెట్ ప్రధాన కార్యాలయంలో ఎండీ దినేశ్ కుమార్‌తో పాటు ఎంఎస్‌ఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఫైబర్‌నెట్ సంస్థ తీరుపై ఎంఎస్‌ఓలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. సెట్ టాప్, ఐపీ బాక్సులకు నెలకు రూ.59 రెంటల్ వసూలు, కమిషన్ చెల్లింపు వంటి సమస్యలను పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సెటాప్ బాక్సుల స్థానంలో యాప్‌ను తీసుకురావడం వల్ల స్మార్ట్ టీవీలు లేని వినియోగదారులకు సేవలు అందని పరిస్థితి నెలకొందని వారు తెలిపారు. దీనిపై దినేశ్‌కుమార్, జీవీరెడ్డి మాట్లాడుతూ... 'సెట్‌టాప్ బాక్సులను పూర్తిగా నిలిపివేయడం లేదు. సాధారణ టీవీ వినియోగదారులందరికీ సెట్ టాప్ బాక్సులు అందిస్తాం. అదేవిధంగా సెట్ టాప్ బాక్సు ధర రూ.5,000ను నెలవారీ రెంటల్ రూ.59 రూపంలో వసూలు చేసేవాళ్లం. మొత్తం చెల్లింపు పూర్తయిన తరువాత కూడా గత ప్రభుత్వంలో వాయిదాలు కొనసాగిస్తూ వచ్చారు. ఇలా అధిక మొత్తంలో వసూలు చేసిన సొమ్మును ఎంఎస్‌ఓలకు వాపస్ ఇస్తాం. ఎస్ఎంఓలను వేధించేలా పంపిన డిమాండ్ నోటీసుల సమస్యను పరిష్కరిస్తాం. ఎంఎస్‌ఓల నుంచి ఫైబర్‌నెట్ సిబ్బంది డబ్బులు వసూలు చేసినట్లు రుజువైతే క్రమశిక్షణా చర్యలు తీవ్రంగా ఉంటాయి' అని హెచ్చరించారు.

ప్రజాప్రతినిధులు గుర్తించిన గ్రూపులకే కిసాన్ డ్రోన్లు

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై అగ్రి డైరెక్టర్ స్పందన

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజాప్రతినిధులు ధ్రువీకరించిన గ్రూపులకే కిసాన్ డ్రోన్లు ఇస్తామని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.డిల్లీరావు స్పష్టం చేశారు. కిసాన్ డ్రోన్ల లబ్ధిదారుల ఎంపికపై బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో.. ఇంకా అదే విధేయత-674 కిసాన్ డ్రోన్లు వైసీపీ వాళ్లకే' శీర్షికతో వచ్చిన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. 2024-25లో 875 కిసాన్ డ్రోన్ యూనిట్లు ఇస్తున్నామని, యూనిట్ ధరలో 80% సబ్సిడీ ఉంటుందని తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 'వాస్తవానికి 2023-24లో 40% సబ్సిడీతో కిసాన్ డ్రోన్లు ఇవ్వాలనుకున్నాం. కానీ నాటి రాష్ట్ర ప్రభుత్వం వాటా ఇవ్వకపోవడంతో అవి గ్రౌండింగ్ కాలేదు. ఒక్కో గ్రూపులో 4-5మంది సభ్యులతో 674 గ్రూపులు ఏర్పాటయ్యాయి. 674 మంది డ్రోన్ పైలట్‌లకు శిక్షణ కూడా ఇచ్చాం. ఒక్కో పైలట్‌పై శిక్షణకు రూ.17వేలు వెచ్చించాం. ప్రస్తుతం ఉన్న గ్రూపులు, పైలట్‌లను పునఃపరిశీలించమని జిల్లా వ్యవసాయ అధికారులకు సూచించాం. స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించి, ఖాళీ అయిన గ్రూపుల్లో సభ్యుల భర్తీ ప్రక్రియ చేపట్టాలని చెప్పాం. కొత్త పైలట్‌లకు శిక్షణ ఇవ్వడానికి ఆర్పీటీవోని కోరుతున్నాం' అని వివరించారు.

ఆధునికీకరణ దిశగా వ్యవసాయ విద్య


- ఐసీఏఆర్ 6వ డీన్స్ కమిటీ సిఫారసులు అమలు
- ఆచార్య ఎన్జీ రంగా అగ్రి వర్సిటీ వీసీ శారదా జయలక్ష్మి

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జాతీయ విద్యా విధానం-2020 కింద ఐసీఏఆర్ 6వ డీన్స్ కమిటీ సిఫారసులను అమలు చేస్తున్నట్లు ఇన్‌చార్జి వీసీ శారదా జయలక్ష్మి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర, డీమ్డ్ వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో ఒకే విధమైన విద్యాప్రమాణాలు అవలంబించాలనే లక్ష్యంతో ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి వ్యవసాయ విద్యలో కాలానుగుణంగా పాఠ్యాంశాలను సవరించినట్లు బుధవారం వెల్లడించారు. 'కళాశాలల్లో చేరిన వెంటనే విద్యార్థుల్లో బెరుకును పోగొట్టడానికి, వ్యక్తిత్వ వికాసానికి 2వారాల 'దీక్షారంభ్' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాం. బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు ప్రయోగ అంశాలు నేర్చుకోవటానికి వీలుగా 60% సమయాన్ని కేటాయిస్తాం. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ప్రాథమిక కోర్సులతో పాటు నైపుణ్యాభివృద్ధి కోర్సులను ప్రవేశపెట్టాం. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, యోగా వంటి అంశాలు తీసుకువచ్చాం. నాలుగో ఏడాది విద్యార్థుల ఇష్టప్రకారం కోర్సులను ఎంచుకుని, వ్యవసాయంలో ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే అవకాశాలు కల్పిస్తాం. నాలుగేళ్లలో కనీసం 10 ఆన్‌లైన్ కోర్సులు... వ్యవసాయం, అనుబంధ శాస్త్రాలు, బేసిక్ సైన్సెస్, హ్యూమానిటీస్, సైకాలజీ, ఆంత్రోపాలజీ, ఎకనామిక్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, ఫారెన్ లాంగ్వేజ్, కమ్యూనికేషన్ స్కిల్స్, సంగీతంలో నైపుణ్యం సాధించవచ్చు. మల్టిపుల్ ఎంట్రీ, ఎగ్జిట్ సిస్టమ్, కోర్సుల ఎంపికలో వెసులుబాటు... విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయి' అని వీసీ వివరించారు.

'బనకచర్ల'పై బాబు గురి!

కేంద్రం నుంచి నిధుల సాధనకు కసరత్తు

- దావోస్ నుంచి తిరిగొస్తూ రేపు ఢిల్లీలో ఆగాలని నిర్ణయం
- వీలైతే ప్రధాని మోదీని కలిసే యోచన
- కేంద్ర ఆర్థిక మంత్రి, ఇతర మంత్రులను కూడా..
- ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.80 వేల కోట్లు
- ఇందులో సగం కేంద్రం భరిస్తే మిగతాది ఇతర మార్గాల్లో సేకరణ



అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. దీనికి కేంద్ర నిధుల సాధనకు మరోసారి ప్రయత్నం చేయాలని నిర్ణయించారు. దావోస్ నుంచి తిరుగు ప్రయాణంలో ఆయన ఢిల్లీలో ఆగనున్నారు. పోలవరం నుంచి గోదావరి జలాలను నాగార్జున సాగర్ కుడికాలువ గుండా బనకచర్లకు తీసుకెళ్లి.. అక్కడి నుంచి రాయలసీమకు తరలించేందుకు ఉద్దేశించిన ఈ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి కొంతకాలంగా కసరత్తు చేస్తున్నారు. మంత్రివర్గ సమావేశాలు, మీడియా సమావేశాలు, పార్టీ సమావేశాల్లో ఇప్పటికే విపులంగా వివరించి చర్చించారు. ఈ భారీ ప్రాజెక్టుకు సుమారుగా రూ.80 వేల కోట్లు ఖర్చవుతాయని ప్రాథమిక అంచనా. ఇందులో సగం కేంద్ర ప్రభుత్వం భరిస్తే మిగిలిన మొత్తం ఇతర మార్గాల్లో సమీకరించవచ్చని ఆయన భావిస్తున్నారు. దీనిని చేపట్టడం ఆలస్యమైనకొద్దీ అంచనా వ్యయం ఇంకా పెరిగిపోతుందని, భవిష్యత్‌లో ఇక చేపట్టలేనంతగా పెరిగిపోవచ్చని ఆయన ఆందోళన చెందుతున్నారు. గత వారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా అమరావతికి వచ్చినప్పుడు.. చంద్రబాబు విజయవాడలో ఆయన బస చేసిన హోటల్‌కు వెళ్లి మరీ ఓ లేఖను అందజేశారు. ఈ ప్రాజెక్టు వివరాలతో ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. 'ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు లభిస్తాయి. కరవు నుంచి రక్షణ లభిస్తుంది. సాగు ప్రాంతం పెరిగి రాష్ట్రానికి, దేశానికి ఆహార ధాన్యాల లభ్యత పెరుగుతుంది. వెనుకబడిన రాయలసీమలో ఉద్యానవన పంటల సాగును లాభదాయకంగా మార్చడం వీలవుతుంది. ఈ లాభాల దృష్ట్యా దీనిని కేంద్ర ప్రాజెక్టుగా చేపట్టాలి' అని లేఖలో అభ్యర్థించారు. కేంద్రం నదుల అనుసంధానాన్ని ప్రాధాన్య కార్యక్రమంగా చేపట్టినందున.. దాని కింద బనకచర్లను పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసి.. ఆ అనుభవంతో దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో నదుల అనుసంధానం చేపట్టవచ్చని సూచించారు. దీనిపై పరిశీలన జరుపుతామని అమిత్ షా ఆయనకు హామీ కూడా ఇచ్చారు. అంతకు ముందు ప్రధాని మోదీని ఢిల్లీలో కలిసినప్పుడు ఆయనకు కూడా చంద్రబాబు ఈ ప్రాజెక్టు గురించి వివరించారు. ఇప్పుడు ఢిల్లీలో మరోసారి ఆగి ఈ ప్రాజెక్టు విషయాన్ని ఇంకోసారి కేంద్రం వద్ద ప్రస్తావించాలని ఆయన అనుకుంటున్నట్లు సమాచారం. గురువారం రాత్రికి దావోస్‌లో ఆయన సమావేశాలు ముగుస్తాయి. శుక్రవారం (24న) ఆయన బయల్దేరి ఢిల్లీ రానున్నారు. ఆ రోజు అక్కడ ఆగి వీలైతే ప్రధానిని, కేంద్ర ఆర్థిక మంత్రిని, సంబంధిత ఇతర మంత్రులను కలవాలని నిర్ణయించారు. అవసరమైతే ఆ రాత్రి అక్కడే బస చేసి ఇంకా ఎవరినైనా కలవాల్సి ఉంటే కలిసి 25న అమరావతికి తిరిగి వస్తారని అధికార వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. ఈలోపు కలిసి మాట్లాడితే బడ్జెట్‌లో సదరు ప్రాజెక్టుకు కొంతయినా కేటాయింపులు చేస్తారని చంద్రబాబు ఆశిస్తున్నారు. దీనితోపాటు ఏవైనా పథకాల కింద కేంద్రం వద్ద ఖర్చు కాకుండా నిధులు మిగిలిపోయి ఉంటే.. వాటిని రాబట్టుకోవడంపై కూడా ఆయన దృష్టి పెట్టనున్నారు. వివిధ ప్రాజెక్టుల కింద ప్రపంచ బ్యాంకు మన దేశానికి మంజూరు చేసిన రుణంలో కొంత భాగం ఖర్చు కాలేదు. కేంద్రం అనుమతిస్తే అందులో కొంత బనకచర్ల ప్రాజెక్టుకు తీసుకోవాలని ఆయన యోచిస్తున్నారు.

కేంద్ర నిధులపై కన్ను!

కమీషన్ల కోసం కక్కుర్తి

- మొదలుకాని బ్లాస్ట్ ఫర్నేస్‌కు ఇప్పటి నుంచే సరకుల కొనుగోళ్లు
- మారని స్టీల్ ప్లాంటు పెద్దల తీరు.. ఆందోళన బాటలో ఉద్యోగులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ స్టీల్‌ప్లాంటులో కొందరు ఉన్నతాధికారుల తీరు ఏమాత్రం మారడం లేదు. ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కడానికి కేంద్రం రూ.11,440 కోట్ల సాయం అందించడానికి ముందుకురాగా వాటిని ఏదోవిధంగా ముందే ఖర్చుచేసేసి.. కమీషన్లు కొట్టేయాలని యత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ప్లాంటులో 3 బ్లాస్ట్ ఫర్నేస్‌లు ఉండగా వాటిలో రెండు(కృష్ణా, గోదావరి) పనిచేస్తున్నాయి. మూడో ఫర్నేస్‌లో ఆగస్టు నుంచి ఉత్పత్తి ప్రారంభిస్తామని కేంద్రం ప్రకటించింది. స్టీల్‌ప్లాంటుకు శాశ్వత సీఎండీని కమిటీ ఎంపిక చేయగా, ఆయన్ను పక్కనపెట్టి ఎంవోఐఎల్ నుంచి ఒకరిని తీసుకువచ్చి ఇన్‌చార్జి సీఎండీగా నియమించారు. త్వరలో ఆయన ఇక్కడినుంచి వెళ్లిపోవలసి ఉంది. ఈలోగానే బీఎఫ్-3కి అవసరమైన ముడిపదార్థాలు కొనుగోలు చేయాలని ఓ బృందం యత్నిస్తోంది. ఇలాంటి భారీ కొనుగోళ్లలో కమీషన్లు ముడతాయని ఉద్యోగులు చెబుతున్నారు. బ్లాస్ట్ ఫర్నేస్-3 కోసం 3లక్షల టన్నుల కోక్, 4.5లక్షల టన్నుల పెల్లెట్లు కొనడానికి సిద్ధమయ్యారు. స్టీల్‌ప్లాంటుకు అవసరమైన కోక్‌ను సింటర్ ప్లాంట్ల ద్వారా తయారు చేస్తారు. బొగ్గును విదేశాల నుంచి దిగుమతి చేసుకుని సింటర్ ప్లాంట్లలో కోక్ ఉత్పత్తి చేస్తారు. మూడు సింటర్ ప్లాంట్లు ఉండగా వాటిలో రెండు పనిచేస్తున్నాయి. ఇటీవల సింటర్ ప్లాంటులో ప్రమాదం జరిగి కన్వేయర్ డక్ట్ కూలిపోయింది. కోక్‌ను శాశ్వత ప్రాతిపదికన తయారు చేసుకోవడానికి సింటర్ ప్లాంటుకు, చాలాకాలంగా మూతపడిన బ్లాస్ట్ ఫర్నేస్-3కి కేపిటల్ రిపేర్లు చేపట్టాల్సి ఉంది. వీటిని సిద్ధం చేసుకున్నాక మూడో ఫర్నేస్ ప్రారంభానికి 2నెలల ముందు ముడిపదార్థాలు తెప్పించుకుంటే సరిపోతుంది. కానీ, ఉన్నతాధికారులు మరమ్మతులపై దృష్టి పెట్టకుండా కమీషన్లపై ఆసక్తి చూపిస్తున్నారు. కోక్ బయటకొంటే టన్నుకు అదనంగా రూ.5వేలు భారం పడుతుంది. స్వయంగా తయారు చేసుకుంటే టన్నుకు రూ.5వేలు మిగులుతుంది. అధికారులు ఈ ఆలోచన చేయడం లేదని కార్మికులు చెబుతున్నారు. పైగా కోక్‌ను ముందుగానే తెచ్చిపెట్టుకుంటే.. నాణ్యత తగ్గిపోతుందంటున్నారు. కోక్‌ను ఎప్పుడూ లక్ష నుంచి 1.5 లక్షల టన్నుల కంటే నిల్వ పెట్టిన సందర్భాలు లేవు. ఇప్పుడు ఏకంగా 3లక్షల టన్నులు కొనాలని చూస్తున్నారు. ఉన్నతాధికారుల తీరుకు భయపడి కొందరు అధికారులు రాజీనామా చేసి వెళ్లిపోతామని చెబుతున్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా సొంత లాభం చూసుకోవడం, ప్లాంటు ఎలా పోతే మాకేంటి? అనే ధోరణితో వ్యవహరించడం పట్ల ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ సమస్యలపై అధ్యయనానికి కలెక్టర్లతో ఆరు కమిటీలు!

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ పరిధిలోని సమస్యలపై అధ్యయనానికి ప్రభుత్వం జిల్లా కలెక్టర్లతో కమిటీలు వేయనుంది. సీఎం ముఖ్య కార్యదర్శి రవిచంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సుల్లో భారీ సంఖ్యలో వచ్చిన దరఖాస్తులను ఎలా పరిష్కరించాలన్న అంశంపై చర్చ జరిగింది. ఇప్పటివరకూ వచ్చిన 1.80 లక్షల దరఖాస్తులను ఆరు రకాలుగా వర్గీకరించారు. ఈ అంశాలపై కలెక్టర్లతో ఆరు కమిటీలు వేయాలని నిర్ణయించారు. ఈ కమిటీలు తమకు అప్పగించిన అంశాలపై పరిశీలన చేసి నివేదికలు అందజేస్తాయి. వీలైతే కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లోపు దీనిపై అధ్యయనం పూర్తి చేయాలని సూచించే అవకాశం ఉంది.

సదరన్ జోనల్ కౌన్సిల్ సలహాదారుగా బాలసుబ్రహ్మణ్యం

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సదరన్ జోనల్ కౌన్సిల్ సలహాదారుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్.బాలసుబ్రహ్మణ్యంను ప్రభుత్వం నియమించింది. రాష్ట్రాల విభజన చట్టంలోని సెక్షన్ 16, సబ్ సెక్షన్ సి ప్రకారం ఆయనను నియమిస్తూ సీఎస్ కె.విజయానంద్ బుధవారం గెజిట్ జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి సదరన్ జోన్ సమావేశం జరుగుతుంది. ఆ సమావేశంలో ఆయా రాష్ట్రాల సమస్యలను కేంద్ర హోంమంత్రి సమక్షంలో చర్చించి, పరిష్కరిస్తారు. అంతర్రాష్ట్ర సమస్యలు వివిధ విభాగాలకు సంబంధించి ఉంటాయి. వీటికి పరిష్కార మార్గాలు, రాష్ట్రానికి అనుకూలంగా మార్చడం తదితరాలపై సలహాదారు ప్రభుత్వానికి సలహాలు ఇవ్వనున్నారు.

ప్రజల ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించండి

- పరిష్కార తీరును ఉన్నతస్థాయిలో పరిశీలిస్తాం
- ఫిబ్రవరిలో కలెక్టర్ల సమావేశం: సీఎస్ విజయానంద్

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే వివిధ ఫిర్యాదులు, అర్జీలను సకాలంలో హేతుబద్ధంగా పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. బుధవారం అమరావతి సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రతి శాఖా నోడల్ అధికారిని నియమించాలన్నారు. ఫిర్యాదులు పరిష్కరించే తీరుపై శాంపిల్ తనిఖీలు చేస్తామన్నారు. కాగా, ఫిబ్రవరి రెండు లేదా మూడో వారంలో కలెక్టర్ల సమావేశం జరిగే అవకాశం ఉందని చెప్పారు. వివిధ శాఖల్లో అమలయ్యే పథకాలు, కార్యక్రమాలపై అధ్యయనం చేసి పూర్తి అవగాహనతో కలెక్టర్లు సమావేశానికి వస్తే చర్చించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ విజన్‌కు అనుగుణంగా అధికార యంత్రాంగమంతా సమర్థవంతంగా, వేగంగా పని చేయాలన్నారు. స్వర్ణాంధ్ర-2047 నాటికి 15శాతం వృద్ధిరేటు సాధనే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే శాఖలు, సెక్టార్లు, జిల్లాల వారీగా డేటాను సిద్ధం చేశామని తెలిపారు. సుమారు 525 కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లను గుర్తించామని, వాటి లక్ష్య సాధనకు ఆయా శాఖలు కృషి చేయాలని చెప్పారు.

పంచాయతీ ప్రక్షాళన

- ఒకే గొడుగు కిందకు వ్యవస్థలు
- జిల్లాల్లో ఒకే చోట కార్యాలయాలు
- సంస్కరణలకు సంఘాలు ఓకే.. ఏకగ్రీవ ఆమోదం

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖను ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఆ శాఖను సమూల సంస్కరణల దిశగా నడిపించేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రంగంలోకి దిగారు. స్థానిక సంస్థల పాలన ప్రజలకు చేరువ కావడంతోపాటు పారదర్శకతకు, జవాబుదారీతనానికి పెద్దపీట వేయనున్నారు. ఈ శాఖకు సంబంధించిన వ్యవస్థలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురానున్నారు. నిపుణులతో సంప్రదించిన ఉపముఖ్యమంత్రి 'ఎవరికి వారే' అన్నచందంగా ఉన్న పంచాయతీరాజ్ సంస్థలన్నింటినీ ఒకే చోటకు చేర్చే ప్రయత్నాలు ప్రారంభించారు. బుధవారం ఈ శాఖలో భాగస్వాములుగా ఉన్న డీఎల్‌డీవో, ఎంపీడీవో, డీపీవో, డిప్యూటీ సీఈవో, డీఎల్‌పీవో, ఈవోపీఆర్‌డీల ఉద్యోగ సంఘాలు, పంచాయతీరాజ్ అసోషియేషన్ జేఏసీ నేతలతో తాడేపల్లి కార్యాలయంలో కమిషనర్ కృష్ణతేజ, ఉపముఖ్యమంత్రి ఓఎస్‌డీ వెంకటకృష్ణ భేటీ అయ్యారు. ప్రభుత్వం ప్రతిపాదించిన సంస్కరణలను అధికారులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సంస్కరణలను కమిషనర్ కృష్ణతేజ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

సమూల మార్పులు

రాష్ట్రంలోని అన్ని శాఖల కంటే పంచాయతీరాజ్ శాఖ చాలా పెద్దది. లక్షమందికి పైగా ఉద్యోగులున్న ఈ శాఖలో పాలన ఒక తాటి మీద లేకపోవడంతో గ్రామీణాభివృద్ధి సజావుగా సాగనిపరిస్థితి నెలకొంది. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాలు, ఉన్నతాధికారులు ఈ శాఖను సంస్కరించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థలన్నీ ఒకేచోట ఉండాలని పవన్ కల్యాణ్.. నిర్ణయించారు. ఈ క్రమంలోనే సంస్కరణలకు ప్రాధాన్యం ఇచ్చారు. జిల్లాస్థాయిలో సచివాలయాలను పర్యవేక్షిస్తున్న డీఎల్‌డీవోలకు కార్యాలయాలు లేవు. డీపీవోలకు కూడా భవనాలు లేవు. జడ్పీలు, ఇంజనీరింగ్ విభాగాలకు మాత్రమే కార్యాలయాలున్నాయి. దీంతో జిల్లా స్థాయిలో ఆయా విభాగాలను పర్యవేక్షించేందుకు కలెక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో జడ్పీ సీఈవో, డీఎల్‌డీవో, డీపీవో, పీఆర్ ఇంజనీరింగ్, ఎస్ఈ కార్యాలయాలన్నింటినీ ఒకే కాంపౌండ్‌లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

కేడర్ పోస్టులకు ఒకే హోదా

పంచాయతీరాజ్ విభాగంలో డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీఎల్‌డీవో)ను ఇక నుంచి డీడీవోగా పిలవనున్నారు. అదే విధంగా డీడీవోలు, డిప్యూటీ సీఈవోలు, డీపీవోలను ఒకే కేడర్ కిందకు చేర్చారు. వారు పదోన్నతి పొంది జడ్పీ సీఈవోలు అవుతారు. ఎంపీడీవోలు, డీఎల్‌పీవోలను ఇకనుంచి ఒకే కేడర్ కింద పరిగణిస్తారు. వారికి పదోన్నతి లభిస్తే డీఎల్‌డీవోలు, డిప్యూటీ సీఈవోలు, డీపీవోలు అవుతారు. మండలస్థాయిలో ఈవో పీఆర్ అండ్ ఆర్డీ అధికారులను ఇకనుంచి మండల పంచాయతీ అధికారులుగా పిలుస్తారు. అయితే, ఎంపీడీవోలను దేశవ్యాప్తంగా బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు(బీడీవో)లుగా పిలుస్తున్నందున రాష్ట్రంలోనూ అలాగే పరిగణించాలని సంఘాలు కోరాయి. పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. తాజా సంస్కరణల్లో భాగంగా ఎంపీడీవో పోస్టులు పదోన్నతుల ద్వారానే భర్తీ చేయాలని నిర్ణయించారు. ఇకనుంచి వారిని నేరుగా నియమించే విధానానికి స్వస్తి పలకనున్నారు. ఎంపీడీవో స్థాయి కంటే కింద ఈవో పీఆర్ అండ్ ఆర్డీ, సూపరింటెండెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు వేలమంది ఉన్నందున వారికి పదోన్నతులు దక్కేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. డీఎల్‌డీవో పోస్టులను సర్వీసు కమిషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. అదేసమయంలో పదోన్నతుల ద్వారా కూడా భర్తీ చేస్తారు. రెవెన్యూ విభాగంలో ఆర్డీవోకు ఏ స్థాయి అధికారాలు ఉంటాయో, పంచాయతీరాజ్‌లో డీఎల్‌డీవోలకు అవే అధికారాలు కల్పిస్తారు. మొత్తంగా అధికారాల్లో ఎలాంటి మార్పులు చేయరు.

మంచి పరిణామం: సంఘాలు

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ శాఖలో సంస్కరణలు తీసుకురావడం సంతోషంగా ఉందని పంచాయతీరాజ్ జేఏసీ నేత కేఎస్ వరప్రసాద్ తెలిపారు. అధికారులు, ఉద్యోగులు కోరుకుంటున్నట్టుగా సంస్కరణలు ప్రారంభమయ్యాయన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థల ప్రక్షాళనను స్వాగతిస్తున్నామని డీఎల్‌డీవోల సంఘం నేతలు వరప్రసాద్, సూర్యనారాయణ తెలిపారు. ఇది మంచి పరిణామమని, దీంతో ఉద్యోగుల పదోన్నతుల విషయంలో ఇబ్బందులు తొలగుతాయని పంచాయతీరాజ్ జేఏసీ నేత వైవీడీ ప్రసాద్ అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థలు మరింత బలపడేందుకు సంస్కరణలు దోహదపడతాయని జేఏసీ నేత వెంకట్రావు పేర్కొన్నారు. అడిషనల్ కమిషనర్ సుధాకర్, సత్యనారాయణ, డీఎల్‌డీవో, ఎంపీడీవో, డీపీవో, డీఎల్‌పీవో, ఈవోపీఆర్ అండ్ ఆర్డీ, పంచాయతీ కార్యదర్శుల సంఘాలు, పీఆర్ మినిస్టీరియల్ యూనియన్ నేతలు బండి శ్రీనివాస్, జడ్పీ మినిస్టీరియల్ యూనియన్ నేతలు హాజరయ్యారు.

నారా లోకేశ్ చొరవతో చిన్నారికి శస్త్ర చికిత్స



ప్రజాదర్బార్‌లో చిన్నారి అబ్దుల్‌ను పలకరిస్తున్న నారా లోకేశ్ (ఫైల్)



శస్త్ర చికిత్స అనంతరం కోలుకున్న చిన్నారితో ఎన్టీఆర్ వైద్యసేవ అధికారులు

తాడేపల్లి టౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో తాడేపల్లికి చెందిన చిన్నారి అబ్దుల్‌కు ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా అధికారులు శస్త్ర చికిత్స చేయించారు. గతంలో చిన్నారి తల్లిదండ్రులు నూర్ అహ్మద్, పరాన్ అల్లాబి ఉండవల్లి ప్రజాదర్బార్‌లో లోకేశ్‌ను కలిశారు. తమ కుమారుడి ముక్కు మీద ఉన్న కణితి తొలగించేందుకు శస్త్రచికిత్స అవసరమని, సాయం చేయాలని కోరారు. చిన్నారి సమస్యను పరిష్కరించాలని లోకేశ్ ఆదేశించడంతో ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా శస్త్రచికిత్సను నిర్వహించారు. అబ్దుల్ కోలుకున్నాడని ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ సి.విజయప్రకాశ్ తెలిపారు.



విమానాశ్రయం ఎదురు హైవేపై దట్టంగా పొగమంచు

పొగమంచుతో విమానాల రాకపోకల ఆలస్యం

గన్నవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): దట్టమైన పొగమంచు కారణంగా విమానాల రాకపోకలు ఆలస్యమయ్యాయి. ల్యాండింగ్ అయ్యేందుకు విజిబిలిటీ లేకపోవటంతో కొన్ని విమానాలు గాలిలో చక్కర్లు కొట్టి ఆలస్యంగా ల్యాండింగ్ అయ్యాయి.. హైదరాబాద్ నుంచి ఇండిగో విమానం ఉదయం 7.05కి రావాల్సిన ఉండగా 11.41కి వచ్చింది. చెన్నై నుంచి 7.10కి రావాల్సిన విమానం 12.11కి, బెంగళూరు నుంచి 8.35కి రావాల్సిన విమానం 9.50కి, హైదరాబాద్ నుంచి 10.05కు వచ్చే విమానం 2.44కు వచ్చింది. ముంబై నుంచి 10.20కి రావాల్సిన విమానం 11.49కి, వైజాగ్ నుంచి 10.55కి రావాల్సిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం 11.21కి వచ్చింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్‌తో చంద్రబాబు, టీజీ భరత్



పెట్రోనాస్ సీఈవో మొహమ్మద్ తౌసిక్‌తో సమావేశంలో సీఎం చంద్రబాబు



డీపీ వరల్డ్ సెంటర్ ఆసియా, ఆఫ్రికా ఎండీ రిజ్వాన్ సమర్‌తో చర్చిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన మంత్రి టీజీ భరత్, తదితరులు



పెప్సికో సీఈవో విల్లెంసన్‌తో సమావేశమైన సీఎం చంద్రబాబు

విశాఖలో డిజైన్ కేంద్రం పెట్టండి

ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు,సాంకేతికంగా తమ రాష్ట్రాన్ని బలోపేతం చేసేందుకు ముందుకు రావాలంటూ దావోస్ వేదికగా ప్రతిష్ఠాత్మక కంపెనీలను సీఎం చంద్రబాబు కోరారు. సర్వర్ల కోసం సొంత చిప్‌లను రూపొందిస్తున్న గూగుల్ క్లౌడ్ సంస్థ తన డిజైన్ కేంద్రాన్ని ఏపీలో ఏర్పాటుచేసే విషయం యోచించాలని ఆ సంస్థ సీఈవో థామస్ కురియన్‌కు సూచించారు. క్లౌడ్ ప్రొవైడర్‌లో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద సంస్థ ఇది. ఢిల్లీ, ముంబైల్లో 2కేంద్రాలను ఇప్పటికే నెలకొల్పింది. విశాఖలో డేటా సిటీ ఏర్పాటుకు; ఏఐ వినియోగాన్ని అభివృద్ధి చేయడానికి, రాష యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను పెంచడానికి ప్రభుత్వంతో గూగుల్ ఇప్పటికే పలు ఒప్పందాలు చేసుకుంది. ఈ క్రమంలోనే సీఈవో కురియన్‌తో చంద్రబాబు చర్చలు జరిపారు. రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన యువత అందుబాటులో ఉందని ఆయనకు చంద్రబాబు చెప్పారు. డిజైన్ కేంద్రానికి విశాఖ అత్యంత సానుకూలమైనదని చెప్పారు.

పెట్రోనాస్‌కు మూలపేట అనుకూలం

మలేసియాకు చెందిన ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీ పెట్రోనాస్ సీఈవో , ప్రెసిడెంట్ మహమ్మద్ తౌఫిక్‌తో చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పెట్రోనాస్ కంపెనీ నేచురల్ గ్యాస్, గ్రీన్ మాలిక్యూలస్ ఉత్పత్తులకు ప్రసిద్ధి చెందింది. సముద్రతీర ప్రాంతం అత్యధికంగా కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోనాస్ అనుబంధ సంస్థను ఏర్పాటు చేయాలని తౌఫిక్‌ను చంద్రబాబు కోరారు. ఇందుకు కొత్తగా ఓడరేవును నిర్మిస్తున్న మూలపేట అనువుగా ఉంటుందని సూచించారు. 2030 నాటికల్లా ఏడాదికి ఐదు మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేయాలని పెట్రోనాస్ లక్ష్యంగా పెట్టుకుంది. కాకినాడ ప్లాంటులో రూ.13వేల కోట్ల నుంచి రూ.15వేల కోట్ల పెట్టుబడి పెడుతుంది. పెట్రోకెమికల్ హబ్‌గా అవతరిస్తున్న మూలపేటలోను, గ్లోబల్ ఫెసిలిటీ సెంటరులోను పెట్టుబడులు పెట్టాలని తౌఫిక్‌ను చంద్రబాబు కోరారు.

స్మార్ట్ కంటైనర్ టెర్మినల్ నిర్మించండి

రాష్ట్రంలో స్మార్ట్ కంటైనర్ టెర్మినల్‌ను నిర్మించాలని దిగ్గజ కంపెనీ డీపీ వరల్డ్‌ను సీఎం చంద్రబాబు కోరారు. దావోస్ సదస్సులో ఆ సంస్థ సెంట్రల్ ఆసియా, ఆఫ్రికా మేనేజింగ్ డైరెక్టర్ రిజ్వాన్ సూమూర్‌తో ఆయన చర్చలు జరిపారు. భారతదేశంలో డీపీ వరల్డ్‌కు ఐదు కంటైనర్ టెర్మినల్స్ ఉన్నప్పటికీ, ఏపీలో ఇప్పటిదాకా ఒక్క కంటైనర్ కూడా లేదని చంద్రబాబు గుర్తు చేశారు. కాకినాడ, మూలపేట, కృష్ణపట్నంలో స్మార్ట్ కంటైనర్‌ను ఏర్పాటు చేసేందుకు అవకాశాలు ఉన్నాయని సూమూర్‌కు సూచించారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న సీపోర్టులోను, ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్‌లోను పెట్టుబడులు పెట్టాలని కోరారు. డీపీ వరల్డ్ ప్రపంచవ్యాప్తంగా 82 మెరైన్, ఇన్‌ల్యాండ్ టెర్మినళ్లను నిర్వహిస్తోంది. గ్లోబల్ కంటైనర్ వ్యాపారంలో దాదాపు పది శాతం మార్కెట్ డీపీ వరల్డ్ సొంతం. రాష్ట్రానికి ఈ సంస్థ వస్తే అంతర్జాతీయ వాణిజ్యానికి దోహదపడుతుందని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి.

డిజిటల్ హబ్ ఏర్పాటు చేయండి

పెప్సికో ఇంటర్నేషనల్ బేవరేజస్ సీఈవో యూజీన్ విల్లెంసెన్, పెప్సికో ఫౌండేషన్ చైర్మన్ స్టీవెన్ కెహోతోలతో చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రపంచంలోనే రెండో పెద్ద బేవరేజెస్ సంస్థ పెప్సికో ఇప్పటికే శ్రీసిటీలో బాట్లింగ్ ప్లాంట్ నిర్వహిస్తోంది. విశాఖపట్నాన్ని గ్లోబల్ డెలివరీ సెంటర్‌గా చేసుకుని అక్కడ పెప్సికో డిజిటల్ హబ్‌ను ఏర్పాటు చేయవచ్చని చంద్రబాబు సూచించారు. గ్లోబల్ బిజినెస్ సర్వీస్ సెంటర్‌ను విశాఖకు విస్తరించాలని కోరారు. కుర్కురే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌తోపాటు, సప్లై చైన్ ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ఏపీసీఎన్ఎఫ్‌తో భాగస్వామి కావాలని సూచించారు. బహ్రెయిన్ ప్రధాని కార్యాలయ ప్రతినిధి హమద్ అల్ మహ్మద్ ముంరాలకత్, సీఈవో అబ్దుల్లా బిన్ ఖలీఫాతోనూ చర్చలు జరిపారు. పారిశ్రామిక పాలసీలను వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కోసం ఏపీకి రావాలని ఆహ్వానించారు.

మాతో కలిసి రండి



బిల్‌గేట్స్‌ను సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

మైక్రోసాఫ్ట్ కేఫ్‌లో ఈ భేటీ జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా ఉన్నప్పుడు తమపై నమ్మకంతో మైక్రోసాఫ్ట్ ఐటీ కేంద్రాన్ని నెలకొల్పడంతో హైదరాబాద్ రూపురేఖలు మారిపోయిన విషయాన్ని బిల్‌గేట్స్‌కు చంద్రబాబు గుర్తుచేశారు. ఏపీలో ఏర్పాటు చేయనున్న కృత్రిమమేధ యూనివర్సిటీ సలహాదారుల మండలిలో భాగస్వామ్యం కావాలని గేట్స్‌ను చంద్రబాబు ఆహ్వానించారు. అంతర్జాతీయ ఆవిష్కరణలను స్థానికంగా వినియోగించుకునేలా బిల్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ ద్వారా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బిల్ విలిందా గేట్స్ ఫౌండేషన్‌కు దక్షిణాది రాష్ట్రాలకు ఏపీని ముఖద్వారంగా చేసుకునేందుకు పూర్తిగా సహకరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్ర పురోగతిలో బిల్ విలిందా గేట్స్ భాగస్వామ్యం కోసం ఏపీ ఎదురు చూస్తోందన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఏపీలో ఐటీ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని మంత్రి లోకేశ్ బిల్‌గేట్స్‌ను కోరారు. ఏపీలో ఏర్పాటు చేయబోతున్న ప్రపంచ స్థాయి ఏఐ యూనివర్సిటీ సలహా మండలిలో భాగస్వామ్యం కావాలని గేట్స్‌ను ఆహ్వానించారు. ఆఫ్రికాలో హెల్త్ డ్యాష్ బోర్డుల తరహాలో ఏపీలోనూ ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ ఎకో సిస్టమ్‌ను ఏర్పాటు చేయడానికి బిల్ విలిందా గేట్స్ ఫౌండేషన్ తరపున నైపుణ్య సహకారాన్ని అందించాలని కోరారు. ఫౌండేషన్ కార్యకలాపాలకు ఏపీని గేట్‌వేగా చేసుకోవాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఈ భేటీపై బిల్‌గేట్స్ స్పందిస్తూ.. విజనరీ లీడర్ చంద్రబాబును చాలా కాలం తర్వాత కలవడం ఆనందంగా ఉందన్నారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తమ నుంచి సానుకూల స్పందన ఉంటుందని హామీ ఇచ్చారు. చాలా రోజుల తర్వాత బిల్‌గేట్స్‌ను కలవడం తనకూ ఆనందంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు.

యూనీలీవర్ చీఫ్‌తో బాబు భేటీ

ప్రపంచవ్యాప్తంగా వినియోగ వస్తువులు విక్రయించే యూనీలీవర్ చీఫ్ సప్లయ్ చైన్ ఆఫీసర్ విల్లెం ఉజ్జెన్‌తో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఏపీలో హిందూస్థాన్ లీవర్ రూ.330 కోట్లతో పామాయిల్ ఇండస్ట్రీని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. దీంతోపాటు బ్యూటీ పోర్టు ఫోలియోకు సంబంధించి టెక్నాలజీ సెంటర్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్, బ్యూటీ, హోంకేర్ ఉత్పత్తుల తయారీకి రాష్ట్రం అనుకూలంగా ఉంటుందని వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు రావాల్సిందిగా ఉజ్జెన్‌ను ఆహ్వానించారు.

సెన్మట్ సీఈవోతోనూ...

ప్రపంచ ఆర్థిక సదస్సు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు, సెంటర్ ఫర్ ఎనర్జీ అండ్ మెటీరియల్స్(సెన్మట్) హెడ్ రాబర్టో బోకాను సీఎం చంద్రబాబుతో సమావేశమయ్యారు. గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజీ, సోలార్ ప్యానల్స్ ఉత్పత్తి రంగాల్లో ఏపీకి అంతర్జాతీయ పెట్టుబడులు తరలివచ్చేలా సెన్మట్ సహకారం అందించాలని కోరారు. క్లీన్ ఎనర్జీ నాలెడ్జ్-స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌కు డబ్ల్యూఈఎఫ్ మద్దతు ఇవ్వాలని కోరారు.



ట్రాఫిక్ జాం కావడంతో దావోస్ సదస్సులో పాల్గొనేందుకు నడిచి వెళ్తున్న మంత్రి లోకేశ్

గడ్డకట్టే చలిలో లోకేశ్ నడక

- దావోస్‌లో ట్రాఫిక్‌లో చిక్కుకున్న మంత్రి
- కాలినడకన సదస్సుకు హాజరు

మైనస్ 7 డిగ్రీల ఉష్ణోగ్రత.. గడ్డ కట్టే చలి.. అంత చలిలోను మంత్రి నారా లోకేశ్ దావోస్ వీధుల్లో నడుస్తూనే సదస్సుకు చేరుకున్నారు. అసలేం జరిగిందంటే.. ప్రపంచ ఆర్థిక సదస్సు సమావేశాలకు హాజరవ్వడానికి బయలుదేరిన లోకేశ్ మార్గమధ్యలో ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. తాను పాల్గొనాల్సిన సెషన్‌కు సమయం దగ్గర పడుతోంది. దీంతో ఆయన కారు దిగి కాలినడకనే సమావేశ మందిరానికి చేరుకున్నారు.

ఏఐకి ఏపీ

గమ్యస్థానం

- బెంగళూరుకు ఐటీ ఎలాగో అమరావతికి ఏఐ అలా.. అనేలా తీర్చిదిద్దుతున్నాం: లోకేశ్

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా 26 శాతం గ్లోబల్ కంపెనీలు తమ ఉత్పాదకతను పెంచుకునేందుకు, నూతన ఆవిష్కరణల కోసం కృత్రిమ మేధను (ఏఐ) ఉపయోగిస్తున్నాయని మంత్రి లోకేశ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం, నాస్కామ్ భాగస్వామ్యంతో విశాఖపట్నంలో ఐవోటీ, ఏఐ అభివృద్ధి కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేశామని, ఇది డీప్‌టెక్ ఆవిష్కరణల్లో గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు. 'బిల్డింగ్ ద ఎకో సిస్టమ్ ఫర్ ఇంటెలిజెంట్ ఇండస్ట్రీస్', 'షేపింగ్ ద ఫ్యూచర్ నెక్స్ట్ జెన్ ఏఐ- ఇన్నోవేషన్ హబ్, డేటా ఫ్యాక్టరీ అండ్ ఏఐ యూనివర్సిటీ' అనే అంశాలపై దావోస్ కాంగ్రెస్ సెంటర్‌లో నిర్వహించిన సదస్సుల్లో లోకేశ్ పాల్గొని ప్రసంగించారు. అమరావతి, విశాఖ, తిరుపతిలో 3నాలెడ్జి సిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఏఐ యూనివర్సిటీ, నేషనల్ సెంటర్ ఫర్ ఏఐ, ఐదు ప్రపంచ స్థాయి మల్టీ డిసిప్లినరీ విద్య, పరిశోధన విశ్వవిద్యాలయాలు ఉంటాయని వివరించారు. కృత్రిమ మేధలో ఏపీని ప్రపంచస్థాయిలో నిలపాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. డీప్‌టెక్ గ్లోబల్ హబ్‌గా నిలబెట్టేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌కోలో ఏఐ అండ్ ఎంఎల్ వినియోగం ద్వారా 15 నిమిషాల్లో విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

ఏఐకి భారీ డిమాండ్

2027 నాటికి భారత్ ఏఐ మార్కెట్ 17 బిలియన్ డాలర్లకు చేరే అవకాశముందని లోకేశ్ అన్నారు. పెరుగుతున్న ఏఐ మార్కెట్‌కు అనుగుణంగా ఏఐ డేటా సెంటర్లకూ రాబోయే రోజుల్లో డిమాండ్ పెరగనుందని తెలిపారు. 2030 నాటికి గ్లోబల్ ఏఐ మార్కెట్ 1.6 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్నారు. ప్రస్తుతం 1 మిలియన్ ఏఐ వృత్తినిపుణుల కొరత ఉందన్నారు. తాజా నివేదికల ప్రకారం బెంగళూరులోని సిలికాన్ వ్యాలీ ప్రపంచంలో టాప్ ఇన్నోవేషన్ హబ్‌గా ఉందని, అమరావతిని ఏఐ సిటీ ఆఫ్ ఇండియాగా మార్చాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారని, విశాఖలో ఏఐ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేయబోతున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించి తాము ఎన్‌విడియా సంస్థతో ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు తెలిపారు. ఏపీలో ప్రస్తుతం రెండువేలకు పైగా గుర్తింపు పొందిన రిజిస్టర్డ్ స్టార్టప్ కంపెనీలు ఉన్నాయనీ, భారత్‌లో అతిపెద్ద టాలెంట్ పూల్ కలిగిన రాష్ట్రంగా ఏపీ గుర్తింపు పొందిందన్నారు. పెన్షనర్ల గుర్తింపు, పెన్షన్ల పంపిణీ కోసం ఏఐ ఆధారిత రియల్ టైమ్ బెనిఫీషియరీ ఐడెంటిఫికేషన్ సిస్టమ్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

3 ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లకు 255 కోట్లు

దావోస్‌లోని కుర్‌పార్కు విలేజ్‌లో జరిగిన ఎడ్యుకేషన్ గవర్నర్ల సమావేశంలో లోకేశ్ మాట్లాడారు. ఏపీలో ఏఐ శిక్షణకు మద్దతు ఇవ్వడానికి, శిక్షణ పొందిన ఏఐ వర్క్‌ఫోర్సును రూపొందించడానికి, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి 3 ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. దీనికోసం రూ.255 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. 2047 నాటికి 95 శాతం నైపుణ్యం కలిగిన శ్రామికశక్తిని తయారు చేయాలని ఏపీ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఐఐటీ మద్రాసు భాగస్వామ్యంతో ఏఐ ఆధారిత ప్రపంచ ఆర్థికవ్యవస్థలో నాయకత్వం వహించడానికి ఏపీ తన శిక్షకులను సిద్ధం చేస్తోందని లోకేశ్ పేర్కొన్నారు.

సీఆర్డీయే పరిధిలో అంతర్జాతీయ విమానాశ్రయం పెట్టండి

- 3 నుంచి 5 వేల ఎకరాలు సమకూరుస్తాం.. ఎయిరిండియా ఎండీ, సీఈవోతో లోకేశ్

'ఏపీ రాజధాని అమరావతి శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని సీఆర్డీయే పరిధిలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పెట్టండి. దుబాయ్ విమానాశ్రయాన్ని తలదన్నేలా ఉండాలి. మీకు 3 వేల నుంచి 5 వేల ఎకరాలను సమకూరుస్తాం' అని రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్ ఎయిరిండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో క్యాంప్ బెల్ విల్సన్‌ను కోరారు. దావోస్‌లో ఆయన విల్సన్‌తో భేటీ అయ్యారు. విశాఖ విమానాశ్రయంలో ప్రాంతీయ మెయింటెనెన్స్, రిపేర్స్ ఓవర్‌హాల్ హబ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సీఆర్డీయే పరిధిలో దుబాయ్ తరహా విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తే ఏపీకి అంతర్జాతీయ పెట్టుబడులు వస్తాయన్నారు. పైలెట్లు, విమానయాన సాంకేతిక సిబ్బంది కోసం శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. విల్సన్ స్పందిస్తూ.. విశాఖలో ఎంఆర్‌వో హబ్ ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలిస్తామని, సీఆర్డీయే పరిధిలో విమానాశ్రయం సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తామన్నారు.



రాష్ట్రంలో ట్రేడ్ హబ్

- వరల్డ్ ట్రేడ్ సెంటర్లను ఏర్పాటుచేయండి
- విశాఖ, తిరుపతిల్లో డేటా సెంటర్లు
- ఏపీలో మెడిసిన్ ఫ్రమ్ ద స్కై సేవలు
- దావోస్‌లో దిగ్గజ కంపెనీలను కోరిన లోకేశ్

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దావోస్ సదస్సు వేదికగా దిగ్గజ కంపెనీల అధినేతలతో రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్ వరుస సమావేశాలు నిర్వహించారు. పెట్టుబడులకు తమ రాష్ట్రం గమ్యస్థానమంటూ కంపెనీలను ఏపీకి ఆకర్షించేందుకు ప్రయత్నించారు. తెలిపారు. ఏపీలో సమర్థవంతమైన పవర్ ట్రాన్స్‌మిషన్ కోసం హైవోల్టేజి డైరెక్ట్ కరెంట్(హెచ్‌వీడీసీ) వంటి అధునాతన సాంకేతికతలను అమలు చేయడంలో సహకరించాలని హిటాచీ ఇండియా ఎండీ భరత్ కౌశల్‌ను మంత్రి కోరారు. వైజాగ్ మెట్రో ప్రాజెక్టు, గ్రీన్ ఎనర్జీ కార్యక్రమాలకు సాంకేతిక సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో మూడు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల (కడప, అనంతపురం, తాడేపల్లిగూడెం) ఏర్పాటుకు సంబంధించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. భరత్ కౌశల్ స్పందిస్తూ.. ఇప్పటికే జాన్సన్ కంట్రోల్స్, హిటాచీ ఎయిర్ కండిషనింగ్ ఇండియా లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి, విజయవాడ, కాకినాడలో బహుళ నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ప్రారంభించిందని, త్వరలో అనంతపురం, బొబ్బిలిలో మరో రెండు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. 2018లో ఏపీలో మూడు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను నిర్మించేందుకు హిటాచీ ఇండియా కాంట్రాక్టులను పొందిందని, త్వరలో వీటి పనులు ప్రారంభిస్తామన్నారు. ఏపీలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ, విజయవాడ, తిరుపతి నగరాల్లో వరల్డ్ ట్రేడ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని వరల్డ్ ట్రేడ్ సెంటర్ గ్లోబల్ చైర్మన్ జాన్ డ్రూను లోకేశ్ కోరారు. ఆగ్నేయాసియా, పశ్చిమాసియాతో భారత్ మార్కెట్‌ను అనుసంధానించడానికి వీలుగా ఏపీలో ట్రేడ్ హబ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. జాన్ డ్రూ స్పందిస్తూ.. భారత్‌లో 13 సెంటర్లు పనిచేస్తున్నాయని, మరో 7 నిర్మాణంలో ఉన్నాయని, వీటికి అదనంగా మరో 9 సెంటర్లను పెట్టే ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. ఏపీలో సెంటర్లను, ట్రేడ్ హబ్ పెట్టే ప్రతిపాదనను పరిశీలిస్తామన్నారు. కాగా, ఏపీని హెల్త్‌కేర్ టెక్నాలజీ హబ్‌గా మార్చేందుకు డబ్ల్యూఈఎఫ్ తరఫున సహకారం అందించాలని లోకేశ్ ఆ సంస్థ అధినేత శ్యాం బిషన్‌ను కోరారు. శ్యాం బిషన్ స్పందిస్తూ.. భారత్‌లో మెడిసిన్ ఫ్రమ్ ద స్కై కార్యక్రమాన్ని ప్రారంభించాలని భావిస్తున్నామని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

డేటా సెంటర్ల ఏర్పాటుకు సహకరించండి

ఏపీలో టెమాసెక్ గ్రూపు అనుబంధ సంస్థ క్యాపిటాల్యాండ్ ద్వారా ఇండస్ట్రియల్ పార్కులు, డేటా సెంటర్లలో పెట్టుబడులు పెట్టాలని లోకేశ్.... టెమాసెక్ స్ట్రాటజిక్ హెడ్ రవి లాంబాను కోరారు. టెమాసెక్ మరో అనుబంధ సంస్థ సెంబ్‌కార్ప్‌తో కలిసి రెన్యువబుల్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. విశాఖ, తిరుపతిలో సెమాటెక్ టెలీ మీడియా ద్వారా డేటా సెంటర్లు, డేటా సెంటర్ పార్కుల ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రవిలాంబా స్పందిస్తూ.. రాబోయే మూడేళ్లలో భారత్ ఫైనాన్షియల్ సర్వీసెస్, హెల్త్‌కేర్ రంగాల్లో 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్నామని, 2028 నాటికి క్యాపిటాల్యాండ్ ద్వారా భారత్ రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు రెట్టింపు చేయాలని అనుకుంటున్నట్లు తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తప్పకుండా సానుకూలంగా స్పందిస్తామన్నారు.

విప్రో రిషద్ ప్రేమ్‌జీతో భేటీ

ఏపీలోని విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో ఐటీ కార్యకలాపాలను ప్రారంభించాలని విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీని లోకేశ్ కోరారు. రిషద్ ప్రేమ్‌జీ విప్రో మాజీ చైర్మన్ అజీమ్ ప్రేమ్‌జీ తనయుడు. విశాఖ, విజయవాడలో గ్లోబల్ డెలివరీ సెంటర్లను, ఆర్ అండ్ డీ హబ్‌లను ఏర్పాటు చేయాలని రిషద్‌ను లోకేశ్ కోరారు. ప్రస్తుతం ఏపీలో ఐటీ సంస్థలకు పూర్తి అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. రిషద్ ప్రేమ్‌జీ స్పందిస్తూ.. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామన్నారు. ఏపీ యువతను నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించేందుకు, నైపుణ్యం కలిగిన యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్రంలో రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రి లోకేశ్..... స్నైడర్ కంపెనీ సీఈవో దీపక్ శర్మను కోరారు. ఆయన స్పందిస్తూ.. ప్రతిపాదనలపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

స్విస్ కంపెనీలు తీసుకురండి

స్విట్జర్లాండ్‌తో వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకోవాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోందని లోకేశ్ అన్నారు. తమ రాష్ట్రంలో నెస్లే, రోషే, నోవార్టిస్, క్లారియంట్, తదితర స్విస్ కంపెనీల కార్యకలాపాలు ప్రారంభించేలా చూడాలని స్విట్జర్లాండ్ నేషనల్ కౌన్సిల్ మెంబర్ నికలస్ శామ్యూల్ గగ్గర్‌ను కోరారు. హెల్త్‌కేర్ రంగంలో, రియల్ ఎస్టేట్, స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టాలని యాక్సెస్ హెల్త్‌కేర్ సీఈవో అనురాగ్ జైన్‌ను ఆహ్వానించారు. మచిలీపట్నం ఓడరేవులో కంటైనర్ టెర్మినల్‌ను అభివృద్ధి చేయాలని కోరగా జైన్ సానుకూలంగా స్పందించారు. ఏపీలోని విశ్వవిద్యాలయాలతో కలిసి పరిశోధన కార్యక్రమాలు చేపట్టాలని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాథ్యూ ఉక్‌చాంగ్‌ను లోకేశ్ కోరారు.

దావోస్ వేదికగా

'టీమ్ ఇండియా'

- ఉమ్మడి మీడియా సమావేశంలో చంద్రబాబు, ఫడణవీస్
- తెలంగాణ, తమిళనాడు మంత్రులు కూడా!
- భారత్‌కు ఇది స్వర్ణయుగం
- అవకాశాలను వదులుకోవద్దు: చంద్రబాబు
- మార్గదర్శిగా చంద్రబాబు: కేంద్ర మంత్రి వైష్ణవ్

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): "ఆర్థికంగా మహారాష్ట్ర, తలసరి ఆదాయంలో తెలంగాణ బలంగా ఉన్నాయి. వీటితో పోల్చితే ఆంధ్రప్రదేశ్ చాలా కష్టపడాలి. అయినా... ప్రగతి సాధిస్తామనే నమ్మకం, విశ్వాసం ఉన్నాయి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. దావోస్ ఆర్థిక సదస్సుకు హాజరైన 'టీమ్ ఇండియా' బృంద సభ్యులు బుధవారం రాత్రి ప్రత్యేకంగా మీడియాతో మాట్లాడారు. పెట్టుబడుల కోసం రాష్ట్రాలుగా పోటీ పడుతున్నప్పటికీ... 'టీమ్ ఇండియా'గా తామంతా ఒక్కటే అని చాటి చెప్పారు. సీనియర్ నేతగా చంద్రబాబు తామందరికీ మార్గదర్శిగా నిలుస్తున్నారని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఏపీ మంత్రి లోకేశ్, తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు తమిళనాడు, కేరళ, ఇతర రాష్ట్రాల మంత్రులు, స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్, అధికారులు పాల్గొన్నారు. "దావోస్ ఆర్థిక సదస్సుకు హాజరవుతున్న నేతల్లో నేనే అత్యంత సీనియర్. 1997లోనే మొదటిసారి ఇక్కడికి వచ్చాను" అని చంద్రబాబు నవ్వుతూ అన్నారు. ఆ తర్వాత రాష్ట్రాల మధ్య పోటీ మొదలైందన్నారు. "దావోస్ ఆర్థిక సదస్సులో భారత బృందానికి ఈసారి చక్కటి ఆహ్వానం, ప్రాధాన్యం లభించాయి. రాజకీయ పార్టీలుగా వేర్వేరు అయినప్పటికీ... ఇండియా ఫస్ట్, పీపుల్ ఫస్ట్ నినాదంతో దావోస్‌కు వచ్చాం. గతంలో ప్రపంచ ఆర్థిక సదస్సుకు ఒకరిద్దరు కేంద్ర మంత్రులు మాత్రమే వచ్చేవారు. ఈసారి... ప్రధాని మోదీ అత్యుత్తమమైన బృందాన్ని ఎంచుకుని పంపించారు" అని చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో చీఫ్ మినిస్టర్స్ డైలాగ్ పేరుతో ఒకసారి ముఖ్యమంత్రుల సమావేశం జరిగిందని గుర్తు చేశారు. "ఇది మంచి సంప్రదాయం. ప్రపంచ పరిణామాలను గమనించి, తగిన నిర్ణయాలు తీసుకునేందుకు దీని వల్ల అవకాశం లభిస్తుంది" అని తెలిపారు. మోదీ నాయకత్వంలో భారత్ శరవేగంగా ముందుకు వెళుతోందన్నారు. "ఇంక్రిమెంటల్ జీడీపీ గ్రోత్‌లో భారత్ 2028 నాటికి ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంటుందని బ్లూంబర్గ్ సంస్థ అంచనా వేసింది. మోదీ నాయకత్వంలో స్థిరమైన అభివృద్ధి సాధిస్తున్నాం" అని చెప్పారు. భారత్‌కు స్వర్ణయుగం ప్రారంభమైందని... దావోస్‌లో మన దేశానికి లభించిన గౌరవమే దీనికి సంకేతమని చెప్పారు. పెట్టుబడుల కోసం రాష్ట్రాలుగా పోటీపడుతూనే... 'ఇండియా ఫస్ట్' నినాదంతో తామంతా కలిసి వెళతామని చెప్పారు. "2047 నాటికి భారత్ మొదటి లేదా రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం ఖాయం. ఇప్పుడు మా దేశంలో పెట్టుబడులు పెట్టడాన్ని మిస్ చేసుకోవద్దు. ఇది మంచి అవకాశం. ఏ రాష్ట్రం అనుకూలంగా ఉంటే అక్కడే పెట్టుబడులు పెట్టండి. ఏపీ, కేరళ, తెలంగాణ, మహారాష్ట్ర... దేనినైనా ఎంచుకోండి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.



ఎయిర్ ఇండియా సీఈవో క్యాంప్ బెల్ విల్సన్‌తో భేటీ అయిన మంత్రి లోకేశ్



డబ్ల్యూటీసీఏ చైర్మన్ జాన్ డ్రూనుతో మంత్రి లోకేశ్

మహారాష్ట్ర, తెలంగాణ సీఎంలతో బాబు

పెట్టుబడులను ఆకర్షించేందుకు దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబును.. బుధవారం అక్కడ వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) వేదిక వద్దకు వచ్చిన మహారాష్ట్ర, తెలంగాణ సీఎంలు దేవేంద్ర ఫడణవీస్, రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పరస్పరం కుశల ప్రశ్నలు వేసుకున్నారు. సంబంధిత ఫొటోను చంద్రబాబు పోస్టు చేశారు. పెట్టుబడులు రాబట్టేందుకు ముఖ్యమంత్రులుగా పోటీ పడుతున్న ముగ్గురు నేతలూ కలుసుకున్న అరుదైన దృశ్యాన్ని ఫొటోగ్రాఫర్ 'క్లిక్'మనిపించారు. ఈ చిత్రం చంద్రబాబుకు బాగా నచ్చింది. వెంటనే దానికి 'టీమ్ ఇండియా ఎట్ ప్రపంచ ఆర్థిక వేదిక' అనే శీర్షిక పెట్టి 'ఎక్స్'లో విడుదల చేశారు.

ఏటికొప్పాక బొమ్మలతో ఏపీ శకటం

ఢిల్లీలోని గణతంత్ర వేడుకల్లో ప్రదర్శనకు ఎంపిక

దక్షిణాది నుంచి ఏపీ, కర్ణాటకకు మాత్రమే అవకాశం

తెలంగాణ శకటానికి దక్కని చోటు



న్యూఢిల్లీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఏటికొప్పాక బొమ్మలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీర్చిదిద్దిన శకటం గణతంత్ర దినోత్సవం నాడు ఢిల్లీలో నిర్వహించే పరేడ్‌లో అలరించనుంది. సహజసిద్ధమైన రంగుల వాడకం, జీఐ ట్యాగింగ్ వంటి ప్రత్యేకతలు ఉన్న ఏటికొప్పాక బొమ్మలతో రూపొందించిన శకటాన్ని రక్షణ శాఖ అధికారులు ఈఏడాది రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికచేశారు. పరేడ్‌లో ప్రదర్శించే శకటాలను రక్షణ శాఖ అధికారులు మీడియా ప్రతినిధులకు ఇక్కడి రాష్ట్రీయ రంగశాల క్యాంప్‌లో బుధవారం చూపించారు. "ఏటికొప్పాక బొమ్మలు-పర్యావరణహిత చెక్క బొమ్మలు" నేపథ్యంతో ఏపీ ప్రభుత్వం రూపొందించిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఏపీ శకటంపై తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి, వినాయకుడి విగ్రహాలు దర్శనమివ్వనున్నాయి. ఏటికొప్పాక బొమ్మలు తయారు చేసే పని వారు, బొమ్మలతో ఆడుకుంటున్న చిన్న పిల్లలు, తదితర అంశాల మేళవింపుతో శకటాన్ని రూపొందించారు. గతంలో మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ ఏటికొప్పాక బొమ్మల ప్రాధాన్యం గురించి ప్రస్తావించిన విషయం తెలిసిందే. ఈసారి దక్షిణాది రాష్ట్రాల నుంచి కేవలం ఏపీ, కర్ణాటక శకటాలను పరేడ్‌లో ప్రదర్శించనున్నారు. తెలంగాణ శకటానికి చోటు దక్కలేదు.

కలగాపులగంగా తెలంగాణ శకటం

రాష్ట్రాల ఔన్నత్యం, వారసత్వ సంపద, సంస్కృతిని చాటే శకటాల ప్రదర్శనలో తెలంగాణకు నిరాశే ఎదురైంది. సరైన థీమ్ లేకుండా రుద్రమదేవి, రామప్ప గుడి, పేరిణి నృత్యకారులు, ఏటీసీలు, పర్యాటక ప్రదేశాల చిత్రాలతో కలగాపులగంగా ఉందంటూ తెలంగాణ శకట నమునాను రక్షణ శాఖ తిరస్కరించినట్లు తెలిసింది. గణతంత్ర వేడుకల్లో భాగంగా ఎర్రకోట ప్రాంగణంలో జరిగే భారత్ పర్వ్‌లో మాత్రం తెలంగాణ శకటాన్ని ప్రదర్శించనున్నారు. "స్వర్ణిమ్ భారత్: విరాసత్ ఔర్ వికాస్" అనే థీంతో జనవరి 26న గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో 16 రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన 10 శకటాలను ప్రదర్శించనున్నారు.

కల్లోల దండకారణ్యం

- నక్సల్స్‌కు దడ పుట్టిస్తున్న యూఏవీ డ్రోన్లు
- డే అండ్ నైట్..కారడవిలో ఆపరేషన్స్
- ఎదురుకాల్పులు తప్ప అన్నీ చేయగలవు
- మావోయిస్టుల వేటలో 28 డ్రోన్ల మోహరింపు
- చీకట్లోనూ చీల్చుకెళ్లి ఫొటో, వీడియో, లైవ్‌స్ట్రీమింగ్
- దట్టమైన అడవుల్లోని శిబిరాలు, దళాలపైనా నిఘా
- గట్టి భద్రతలోని చలపతిని సైతం ఛేదించి ఎన్‌కౌంటర్‌కు సహకరించిన ఏరియల్ సర్వైలెన్స్
- కూంబింగ్‌లో బలగాల పైచేయికి ఇదే కారణం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

మావోయిస్టుల ఏరివేతపై కేంద్రం మరింత పట్టుబిగుస్తోంది. 'టచ్' చేయలేరు అనుకున్న మావోయిస్టు అగ్రనేతలను సైతం ఎన్‌కౌంటర్లలో కడతేర్చేస్తోంది. సాయుధ తీవ్రవాదంపై ఎట్టకేలకు పై చెయ్యి సాధించగలిగింది. ఈ ఆపరేషన్‌లో భద్రతా బలగాలకు ప్రధానంగా డ్రోన్లు సహకరిస్తున్నాయి. అడవులు, కొండలు, గుట్టలు, నదీ ప్రాంతాలు...ఇలా ఎంతో సంక్లిష్టమైన ప్రాంతంలో కూడా ఇవి టార్గెట్‌ను గుర్తించగలవు. నిజానికి, దేశ సరిహద్దు ప్రాంతాలు, వ్యూహాత్మక రక్షణ ప్రాంతాల వద్ద ఏరియల్ సర్వైలెన్స్‌ను వాడతారు. అయితే, కేంద్రం 2022 నుంచే దీనిని దండకారణ్యంలోకి తీసుకొచ్చింది. దాని ప్రభావంతో కూంబింగ్ ఆపరేషన్స్‌లో ఉన్న కష్టాలు తొలగిపోయాయి. ఇన్‌ఫార్మర్ వ్యవస్థ అవసరం ఇప్పుడు పెద్దగా అవసరం లేకుండా పోయింది. ఇప్పుడంతా యూఏవీ ప్రభావం. అవును....ఆకాశంలో ఉదయం, రాత్రి తేడాలేకుండా ఆకాశం నుంచే టార్గెట్ ఆనవాళ్లు , కదలికలను గుర్తించి ప్రత్యక్ష సమాచారం, పక్కా లోకేషన్‌ను అందించగల మానవ రహిత డ్రోన్ (యూఏవీ)లు దండకారణ్య సర్వైలెన్స్‌లో పనిచేస్తున్నాయి. అవి ఒకటో రెండో కాదు...28 యూఏవీలు మోహరించాయి. అందుకే అంత ధీమాగా 2026 నాటికి మావోయిస్టులు అడవిలో లేకుండా చేస్తామని కేంద్రం పదేపదే ప్రకటనలు చేస్తోంది. ఈ తెగువ వెనుక ఉన్న అసలైన బలం..స్విచబుల్ యూఏవీలు. ఇప్పుడు మావోయిస్టుల గుండెకాయ దండకారణ్యంలో కల్లోలాన్ని రాజేస్తున్నాయి.ఈ రోజు ఎవరు? రేపు మరెవరు? అన్న భయానక ఆందోళనకర పరిస్థితిని మావోయిస్టులకు తీసుకొచ్చాయి.

సైలెంట్ కిల్లర్

ఒకసారి ఆకాశంలోకి టేకాఫ్ అయితే ఏకధాటిగా రెండున్నర గంటలపాటు ఫొటోలు, వీడియో, లైవ్ స్ట్రీమింగ్‌ను స్విచ్ యూఏవీ డ్రోన్లు ఇవ్వగలవు. సగటున భూమి నుంచి నాలుగు కిలోమీటర్ల ఎత్తులో ప్రయాణించగలవు. టేకాఫ్ అయినప్పుడు తప్ప ఆకాశంలో ఉన్నప్పుడు ఇవి శబ్దం చేయవు. అదే వీటి ప్రత్యేకత. స్టెల్త్‌మోడ్‌లో పనిచేస్తాయి. డ్రోన్ హైడెఫినేషన్ కెమెరాకు 25 ఎక్స్ జూమ్ సామర్థ్యం ఉంటుంది. ఆకాశం నుంచి నేలపై లేదా అడవి, నదిలో వెయ్యిమీటర్ల దూరంలో ఉన్న టార్గెట్‌ను కూడా గుర్తించి లక్ష్యంగా చేసుకోగలగడం దీని ప్రత్యేకత. రాత్రి వేళల్లో, ఇంకా విపరీతమైన వాతావరణ ంలో సైతం నేలపై ఉన్న టార్గెట్‌లు, మనుషులను స్పష్టంగా గుర్తించగలిగేలా థర్మల్ కెమెరా ఉంటుంది. దీని సాయంతో అర్ధరాత్రిళ్లు కూడా నేలపై ఉండే మనుషులు, ఇతర టార్గెట్‌ల కదలికలు, గుర్తించి ఫొటోలు తీయగలదు. రూట్ మ్యాప్ ఇవ్వగలదు.

బలగాలకు బలం..

ఏరియల్ సర్వైలెన్స్ కోసం 2022లో కేంద్రం 220కిపైగా స్విచ్ యూఏవీలను భారత సైన్యానికి అందించింది. ఇవి కాకుండా సీఆర్‌పీఎఫ్, బీఎస్‌ఎఫ్‌లకు మరో 40 డ్రోన్స్‌ను ఇచ్చింది. కార్యక్షేత్రంలో వీటి పనితీరు అద్భుతంగా ఉందని నిర్ధారణ కావడంతో తొలుత 10 డ్రోన్లను దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్స్‌లో పాల్గొంటున్న కమాండ్ కంట్రోల్‌కు ఇచ్చింది. వీటిని చూసి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బెంగాల్, జార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలు విడివిడిగా ఈ డ్రోన్‌లను సమకూర్చుకున్నాయి. అధికారిక సమాచారం ప్రకారం మావోయిస్టు ఏరివేత ఆపరేషన్స్ చేస్తోన్న దండకారణ్యం కమాండ్ కంట్రోల్ పరిధిలో 28 డ్రోన్‌లు ఇప్పుడు ఆకాశ నిఘా నిర్వహిస్తున్నాయి.


కారడవుల్లోనూ చురుగ్గా నిఘా..

ఓ టెక్ అనే కంపెనీ స్విచ్ యూఏవీని తయారు చేస్తోంది. ఇచ్చిన టాస్క్‌ను చడీచప్పుడు చేయకుండా పూర్తిచేయగల పనితనం దీని సొంతం. ఆకాశం నుంచి నిఘా నిర్వహించడంలో దీనికిదే సాటి. ప్రయోగించిన ప్రాంతం నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో ఇది ఏరియల్ సర్వైలెన్స్ నిర్వహిస్తుంది. ఇన్నీ ఫీచర్లు ఉన్నాయి కాబట్టే కమాండ్ కంట్రోల్ ఈ డ్రోన్స్‌ను నక్సల్స్ ఏరివేత ఆపరేషన్స్‌కు వాడుతోంది. ఇవి దండకారణ్యంలో మావోయిస్టులకు బాగా పట్టున్న డీప్ ఫారెస్ట్ ఏరియాలపై సర్వైలెన్స్ సేవలో ఉన్నాయి. ఇద్దరులేదా అంతకన్నా ఎక్కువ సంచరిస్తున్నా, అందులో మహిళలు ఉన్నా, వారి వద్ద ఆయుధాలు, ఇతర సామాగ్రి ఉన్నా డ్రోన్లు సులువుగా గుర్తించి ఫొటోలు తీస్తుంది.

ఆరేడు నెలలకే సీన్ రివర్స్..

ఒకప్పుడు దండకారణ్యం అంటే భద్రతా బలగాలకు వణుకు. ఇప్పుడు టెక్నాలజీ వాడకంతో సీన్ రివర్స్ అయింది. గత ఆరేడు నెలల కాలంలో భద్రతా బలగాలు డ్రోన్ల సేవలపైనే ప్రధానంగా ఆధారపడుతున్నాయి. ఇటీవలి కాలంలో ఆరు ప్రధాన ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఈ ఘటనల్లో మావోయిస్టులకు భారీ నష్టం జరగడంలో అత్యంత కీలకపాత్ర మావన రహిత యూఏవీ డ్రోన్‌లదే. దీంతో మావోయిస్టు కదలికలను కనిపెట్టి తక్కువ సమయంలోనే వారున్న ప్రాంతాలకు చేరుకోవడం భద్రతా బలగాలకు సులువుగా మారింది. ఫలితంగా మావోయిస్టులు కోలుకోలేని దెబ్బలు తింటున్నారు.

చలపతి సెక్యూరిటీని ఛేదిస్తూ...



మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులకు గట్టి భద్రత ఉంటుంది. తాజాగా ఛత్తీస్‌గఢ్- ఒడిశా సరిహద్దుల్లో భద్రతా బలగాలు కేంద్ర కమిటీ సభ్యుడు చలపతిని ఎన్‌కౌంటరు చేశాయి. చలపతికి మూడు అంచెల భద్రత ఉంది. స్విచ్ యూఏవీ డ్రోన్ ఇచ్చిన డేటాతో ఇందులో ఒక్కో అంచెను ఛేదించుకుంటూ బలగాలు ముందుకు వెళ్లాయి. డీకేలో ఎదురుకాల్పుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు మరణించడం ఇదే తొలిసారి. గతంలో అనేకమంది అగ్రనేతలు అనారోగ్యంతో, ఇతర కారణాలతో మరణించిన సందర్భాలున్నాయి. కానీ, ఇప్పుడు అందుకు భిన్నం. ఈ నెలలోనే దండకారణ్యం పరిధిలో మూడు భారీ ఎన్‌కౌంటర్‌లు జరిగాయి. సగటున 12 మంది, అంతకంటే ఎక్కువే మరణించారు. కొత్తగా వస్తున్న ఆధునిక టెక్నాలజీని, దాని తీవ్రతను మావోయిస్టుపార్టీ అంచనావేయలేకపోతోందని, అందువల్లే ఇపటికీ గుంపులుగా మావోయిస్టులు తిరుగుతూ తేలి గ్గా టార్గెట్ అవుతున్నారని నిపుణులు చెబుతున్నా రు. ఇదే పరిస్థితి కొనసాగితే అబూజ్‌మడ్, కాంకేర్, సహా అనేక పట్టున్న ప్రాంతాల్లో మావోయిస్టుల ఉనికి పెనుముప్పులో పడిపోవచ్చునని ప్రజాసంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మావోయిస్టుల పాలిట మాజీలే విలన్లు!

చింతూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ముల్లును ముల్లుతోనే తీయడం అంటే ఇదేనేమో! నిన్నటిదాకా మావోయిస్టుల్లో పనిచేసి లొంగిపోయిన మాజీలు డీఆర్‌జీ (డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్స్) బలగాల రూపమెత్తి అగ్రనేతలను వణికిస్తున్నారు. దండకారణ్యంలో నాలుగువేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న అబూజ్‌మడ్ మావోయిస్టులకు పెట్టని కోట. మొన్నటివరకు ఇక్కడి అడవుల్లోకి అడుగు పెట్టడానికి బలగాలు వెనుకంజ వేశాయి. నాగా, మిజో బలగాలను మావోయిస్టు ఆపరేషన్లకు ఉపయోగించినా.. భాషా సమస్య వల్ల పెద్దగా ముందుకెళ్లలేకపోయారు. ఈ పరిస్థితుల్లో.... అడవులపై గట్టి పట్టు, స్థానికంగా పరిచయాలు కలిగిన మాజీలతో డీఆర్‌జీ నిండి ఉండటం బలగాలకు బాగా కలిసి వచ్చింది. డీఆర్‌జీ గార్డులను ముందు పెట్టుకుని ఎనిమిది వేల మంది బలగాలు అణువణువు గాలిస్తు న్నాయి. దొరికిన వారిని దొరికినట్లుగా చంపేస్తున్నాయి. రెడ్ కారిడార్‌ను తుపాకుల మోతలతో వణికిస్తున్నాయి. బస్తర్‌లోని పలు గ్రామాల్లో సాధారణ పౌరుల కంటే బలగాల సంఖ్యే అధికంగా ఉంది. దీంతో మావోయిస్టులు ఊపిరిపీల్చుకోలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఏది సురక్షిత ప్రాంతమో ఏది ప్రమాద ప్రాంతమో తేల్చు కోలేని అయోమయానికి గురవుతున్నారు. ఇదే అదునుగా ఛత్తీస్‌గఢ్ పోలీసు ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీచేస్తున్నారు. లొంగిపోతే పునరావాసం....లేకుంటే నిర్మూలించేస్తామని స్పష్టం చేస్తున్నారు. ప్రధానంగా మావోయిస్టు పార్టీని నడిపిస్తున్న తెలుగు అగ్రనేతలపైనే టార్గెట్ పెట్టారు.

మావోయిస్టుల శిక్షణా శిబిరం కూల్చివేత

- అగ్రనేత కటకం సుదర్శన్ స్థూపం నేలమట్టం



మావోయిస్టుల శిక్షణా శిబిరాన్ని కూల్చివేస్తున్న బలగాలు

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా బట్టిగూడెం పరిసర ప్రాంతంలో మావోయిస్టులు ఏర్పాటుచేసుకున్న హైటెక్ శిక్షణా శిబిరాన్ని భద్రతాబలగాలు కూల్చివేశాయి. ఇక్కడ రిక్రూట్‌మెంట్లు జరపడంతో పాటు వారికి శిక్షణ ఇస్తున్నారని భావిస్తున్నారు. శిక్షణకు అవసరమయ్యే హైటెక్ హంగులను మావోయిస్టులు సమకూర్చుకున్నారు. శాశ్వత కట్టడాలతోపాటు తాత్కాలిక గుడిసెలు కూడా ఏర్పాటు చేసుకున్నారు.విశాల ప్రాంతంలో ఏర్పాటు చేసుకున్న శిక్షణా శిబిరం వద్దకు పోలీసులు అడుగు పెట్టే సమాచారం సైతం ఇట్టే పసిగట్టేందుకు పెద్ద చెట్లపై నిఘా పెట్టేవారు. గుండెపోటుతో 2023 మే 31న చనిపోయిన మావోయిస్టు అగ్రనేత కటకం సుదర్శన్ పేరిట ఇక్కడ పెద్ద స్మారకస్థూపం ఏర్పాటు చేశారు. ఈ స్థూపాన్నీ, నిర్మాణాలను బలగాలు కూల్చివేశాయి.

శారదాపీఠం భవనం కూల్చివేతకు ఆదేశాలిస్తాం!

- కౌంటర్ దాఖలు చేయాలని శారదాపీఠానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అనుమతులకు విరుద్ధంగా తిరుమల గోగర్భం డ్యామ్ ప్రాంతంలో విశాఖ శారదాపీఠం నిర్మిస్తున్న భవనం కూల్చివేతకు ఆదేశాలిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. బిల్డింగ్ ప్లాన్, అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు ఎలా చేపడతారని నిలదీసింది. ఇలాంటి నిర్మాణాలను ఉపేక్షించడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిపి తే ఏం జరుగుతుందో తెలియజేసేందుకు ఈ కేసు ఒక ఉదాహరణ కావాలని పేర్కొంది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని శారదాపీఠాన్ని ఆదేశించింది. విచారణను వా యిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. తిరుమల గోగర్భం డ్యామ్ ప్రాంతంలో శారదాపీఠం అక్రమ నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ టీటీడీ ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదంటూ తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు, న్యాయవాది తుమ్మా ఓంకార్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. గతంలో ఈ పిల్‌పై విచారణ జరిపిన ధర్మాసనం భవన నిర్మాణ పనులను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. బుధవారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా.. శారదపీఠం తరఫున వకాలత్ వేశానని, పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని న్యాయవాది జ్యోస్యుల భాస్కరరావు అభ్యర్థించగా, అంగీకరించిన ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

ఆ గ్రామాలన్నీ ఎలా మాయమయ్యాయి?

- షెడ్యూల్డ్ ఏరియా పరిధిని ఎందుకు కుదిస్తున్నారు: హైకోర్టు

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలోని వివిధ మండలాల పరిధిలో షెడ్యూల్డ్ ఏరియా నుంచి వందల గ్రామాలను తొలగించడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. గతంలో షెడ్యూల్డ్ ఏరియాలో 792 గ్రామాలు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 292కి తగ్గిందని, మిగిలిన గ్రామాలు ఎలా మాయమయ్యాయని ప్రశ్నించింది. షెడ్యూల్డ్ ఏరియాను ఎందుకు, ఏ అధికారంతో కుదిస్తున్నారో చెప్పాలని నిలదీసింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలను కోర్టు ముందు ఉంచాలని కేంద్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శిని ఆదేశించింది. లేనిపక్షంలో తదుపరి విచారణ కు ఆన్‌లైన్ ద్వారా కోర్టు ముందు హాజరుకావాలని ఆ శాఖ కార్యదర్శికి స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. ఆ జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, జీయమ్మవలస, కొమరాడ, కురుపాం, పార్వతీపురం, మక్కువ, సాలూరు, పాచిపెంట మండలాల పరిధిలో గిరిజనేతరులకు లబ్ధి చేకూర్చేందుకు వీలుగా షెడ్యూల్డ్ ఏరియా హద్దులను ఇష్టారీతిన మారుస్తున్నారంటూ ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు టి.వెంకటశివరామ్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎ.శ్యాం సుందర్‌రెడ్డి వాదనలు వినిపించగా, కేంద్రం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్(డీఎస్‌జీ) పసల పొన్నారావు స్పందించారు.

సరస్వతి భూముల రిజిస్ట్రేషన్లు రద్దు

- అసైన్డ్ భూములుగా గుర్తింపు.. విక్రయించిన రైతులకు నోటీసులు

పిడుగురాళ్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ కుటుంబసభ్యులకు చెందిన సరస్వతి పవర్ ఇండస్ట్రీస్ పేరుతో పల్నాడు జిల్లా మాచవరం మండలంలో 2015లో రిజిస్ట్రేషన్ చేసిన భూముల్లోని 24.84 ఎకరాల రిజిస్ట్రేషన్‌ను అధికారులు రద్దు చేశారు. వేమవరం, పిన్నెల్లి గ్రామాల్లోని ఈ భూములు అసైన్డ్ భూములని.. వాటిని అనుభవించాలే తప్ప విక్రయించకూడదని బుధవారం పిడుగురాళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు సంబంధిత రైతులకు నోటీసులు కూడా జారీ చేశారు. కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలతో మాచవరం తహసీల్దార్ క్షమారాణి ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నారు. వేమవరం సర్వే నంబరు 792లో 20 ఎకరాలు, పిన్నెల్లి సర్వే నంబరు 464/3లో 4.84 ఎకరాలకు సంబంధించి ఆరు డాక్యుమెంట్లను రద్దు చేశారు. సరస్వతి పవర్ ప్రాజెక్టులో వేమవరం సర్వే నంబర్లు 786, 787, 792లో కొంత భూమిని వెనక్కి తీసుకుంటున్నట్లుగా గత నెల 12నే మాచవరం రెవెన్యూ అధికారులు ఆ భూమిని విక్రయించిన రైతులకు నోటీసులు జారీ చేశారు. వ్పుడు వాటి రిజిస్ట్రేషన్లను రద్దు చేశారు.

హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా హరిహరనాథశర్మ, లక్ష్మణరావు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర
- ఇద్దరూ రేపు ప్రమాణం చేసే అవకాశం!



హరిహరనాథశర్మ



లక్ష్మణరావు

అమరావతి/న్యూఢిల్లీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టుకు ఇద్దరు అదనపు న్యాయమూర్తులు నియమితులయ్యారు. అదనపు న్యాయమూర్తులుగా న్యాయాధికారులు అవధానం హరిహరనాథశర్మ, డాక్టర్ యడవల్లి లక్ష్మణరావుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. దీంతో వారిని నియమిస్తూ కేంద్ర న్యాయశాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ విషయాన్ని కేంద్ర న్యాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. కొత్త న్యాయమూర్తులకు శుభాకాంక్షలు తెలిపారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ శుక్రవారం వారిద్దరితో పదవీ ప్రమాణం చేయించే అవకాశం ఉంది. హరిహరనాథశర్మ, లక్ష్మణరావులను పదోన్నతిపై హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని కోరుతూ ఈ నెల 11న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తులు ఉండాలి. ప్రస్తుతం ఆ సంఖ్య 28గా ఉంది. ఈ ఇద్దరి నియామకంతో 30కి చేరింది. కాగా.. రేణుకా యార, నర్సింగ్‌రావు నందికొండ, తిరుమలదేవి, మధుసూదన్‌రావు బొబ్బిలి రామయ్యలను తెలంగాణ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమించేందుకు కూడా రాష్ట్రపతి ఆమోదం తెలిపారు.

బీఎస్సీ చేసి.. న్యాయ పట్టా

హరిహరనాథ శర్మ 1968 ఏప్రిల్ 16న జన్మించారు. ఆయన స్వస్థలం కర్నూలు. తల్లిదండ్రులు సుబ్బమ్మ, రామచంద్రయ్య. తండ్రి పురోహితుడు. కర్నూలు ఉస్మానియా కళాశాలలో బీఎస్సీ పూర్తి చేసిన హరిహరనాథశర్మ నెల్లూరు వీఆర్ లా కాలేజీలో న్యాయశాస్త్రం అభ్యసించారు. 1994లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. కర్నూలు జిల్లా కోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. 2007 అక్టోబరులో జిల్లా జడ్జిగా నియమితులయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వివిధ హోదాల్లో సేవలు అందించారు. 2017-18 నడుమ అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి (పీడీజే)గా, 2020-22 మధ్య విశాఖ పీడీజేగా పనిచేశారు. 2022లో హైకోర్టు రిజిస్ట్రార్‌గా పనిచేశారు. 2023 నుంచి ఏపీ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.

కంపెనీ, క్రిమినల్ లాలో బంగారు పతకాలు..

డాక్టర్ యడవల్లి లక్ష్మణరావు 1975 ఆగస్టు 3న జన్మించారు. ఆయన స్వగ్రామం ప్రకాశం జిల్లా కనిగిరి. తల్లిదండ్రులు పద్మావతి, వెంకటేశ్వర్లు. ప్రాథమిక విద్యను సొంత జిల్లాలో పూర్తి చేసిన ఆయన.. నెల్లూరు వీఆర్ లా కాలేజీలో న్యాయశాస్త్రం అభ్యసించారు. క్రిమినల్ లా, కంపెనీ లాలో బంగారు పతకాలు పొందారు. 2000లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు నెల్లూరు, కావలిలో న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. 2014లో జ్యుడీషియల్ సర్వీసులోకి వచ్చారు. మొదట ఏలూరు జిల్లా అదనపు జిల్లా జడ్జిగా పోస్టింగ్ తీసుకున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పీడీజేగా పని చేస్తూ 2021 సెప్టెంబరు 2న హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)గా నియమితులయ్యారు. 2022 అక్టోబరు 22న రిజిస్ట్రార్ జనరల్‌గా నియమితులయ్యారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.